ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు

# జయ జయ శంకర

శంకర జయంతి శుభతరుణంలో ఆదిశంకరాచార్యుల ప్రాభవాన్ని, ప్రభావాన్ని తలుచుకుందాం.భారతీయ సంప్రదాయంలో ముగ్గురిని 'జగ ద్గురువులు'గాభావించి గౌరవించి పూజిస్తారు.ఒకరు సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మ. రెండవవారు వ్యాస భగవానుడు.మూడోవారు ఆదిశంకరా చార్యులు. వీరిలో శ్రీకృష్ణుడు దైవం, వ్యాసుడు మహర్షి, ఆదిశంకరుడు తత్త్వవేత్త. ఆదిశంకరాచార్యుడిని అపర శంకర స్వరూపంగా అభివర్ణిస్తా రు. ప్రపంచవ్యాప్తంగా హిందూ మతాన్ని ఉద్ధరించినఈ మనీషామూర్తిని వర్ణించాలంటేమాటలు సరిపోవు.ఆ ప్రతిభ జగదాశ్చర్యకరం. ఆ బోధన లుజగదానందకారకం. "రెండు లేవు,అంతా ఒకటే" అంటూ అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తీరు,సమతను స్థాపించిన వైనంపరమాద్భు తం!ఆయన జనన,మరణ కాలాదులపై స్పష్టత లేకపోయినా,కేవలం కొన్ని వందల సంవత్సరాల క్రితం వరకూ ఈ భూమిపై నడయాడిన దైవస్వరూపంగా విశ్వసిస్తారు.దేవభూమిగా మన్ననలుఅందుకున్న కేరళ రాష్ట్రం ఈ మాననీయుని జన్మభూమి.ఆర్యుల జన్మల గురించి ఎంచరాదని పెద్దల మాట.కేవలం 32 ఏళ్ళు మాత్రమే భౌతికంగా ఈ భూమిపై నడయాడినా,అనంతకాలంలో నిలబడే సారస్వతాన్ని మనకు గొప్ప కానుకగా అందించి వెళ్లిపోయాడు.వందల ఏళ్ళనాడే ఆసేతు శీతాచలం సంచరించి, విస్తృతంగా జ్ఞాన బోధ చేసి మానవాళి ఐక్యతకు పునాదులు వేశాడు.వేదమయమైన వ్మాయానికి అద్భుతమైన వ్యాఖ్యలు రచించాడు. బ్రహ్మసూత్రాలు,ఉపనిషత్తులు, భగవద్గీతకు ఆదిశంకరుడు చేసిన భాష్యం అమృత తుల్యం.హిందూ మతంలోని సౌందర్యాన్ని తాను దర్శించి మనకు దర్శనం చేయించాడు.ఈ ప్రస్థానంలో ఉపన్యాసాలు, చర్చలు, బోధనలు,రచనలు వంటి అనేక మార్గాలను ఎంచుకున్నాడు. భరతభూమిలోని నాలుగు ప్రాంతాలలో నాలుగు విశిష్ట పీఠాలను స్థాపిం చాడు. సనాతన హిందూ సంప్రదాయ పునరుద్దీపనకు ఆదిశంకరుడు చేసిన కృషి అనన్య సామాన్యం.ఈ మహనీయుని జీవితానికి సంబంధించి అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి.ఆ గాథలను పరిశీలిస్తే,ఆ విశేషాలు తెలుసుకుంటే పులకిత గాత్రులమవుతాము.కేరళలోని పూర్ణానది ఒడ్డున ఉన్న కాలడిలో ఆర్యాంబ,శివగురులకు జన్మించినట్లు తెలుస్తోంది.వైశాఖ శుద్ధ పంచమి నాడు శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రంలో జన్మించా రని చెబుతారు.ఈ పుట్టు ప్రతిభావంతుడి విశేషాలు ఆశ్చర్యజనకాలు. జ్ఞాన దర్శనం,ప్రదర్శనం,కవితా ధార,ధారణ,గ్రాహ్యం అన్నీ అపూర్వ మై నవే.ఆయన దివ్యమేధ నుంచి పుట్టిన స్తోత్రాలు సాక్షాత్తు శారదాగాత్రా లు.సౌందర్యల హరి,కనకధారాస్తవంవంటివి ఎన్నో గొప్ప ఉదాహరణలు గా నిలుస్తాయి.నర్మదా నదీ తీరంలో గోవింద భగవత్పాదులను దర్శనం చేసుకున్న శుభవేళ చెప్పిన 'దశశ్లోకి'ని విన్నంతనే.. దివి నుంచి భువికి దిగివచ్చిన సాక్షాత్తు శంకర స్వరూపంగా ఆదిశంకరుడిని భగవత్పాదులు దర్శించారు.గోవిందునికి తొట్ట తొలిగా శంకరుడు పాదపూజ చేసి తన గురుభక్తిని చాటుకున్నారు. అలా గురుసేవకు, గురు –శిష్య పరంప రాగతమైన సంప్రదాయానికి బీజం వేశాడు. తదనుగుణంగా గురు శుశ్రూష చేసి విద్యాభ్యాసం చేశాడు. అక్కడ నుంచి వారణాసి పయనమై అనేక దివ్య జ్ఞానానుభూతులు పొందాడు.అక్కడే సదానందుడు అనే బ్రహ్మచారి ప్రథమ శిష్యుడుగా దొరికాడు.గంగానదికి కాలకృత్యాలకు వెళ్తున్న సమయంలో చండాలుడు ఎదురైన వేళ చెప్పిన 'మనీషా పంచకం' పరమ రమణీయం. ఇవి కేవలం ఐదు శ్లోకాలు మాత్రమే.అలా పరమశివుడు నుంచి కర్తవ్యబోధ పొందాడు. అక్కడ నుంచి బదరికి వెళ్ళాడు. అక్కడ జరిగిన పండిత గోష్ఠి అద్భుతం.ఉపనిషత్తులకు, భగవద్గీతకు,బ్రహ్మసూత్రాలకు రాసిన భాష్యాన్ని 'ప్రస్థానత్రయం' అంటారు. వ్యాసభగవానుడితో జరిగిన చర్చ అపురూపం.ఈ ప్రస్థానంలో ఆదిశంకరుడికి అనేకమంది మహనీయులైన శిష్యులు కూడా ఏర్పడ్డారు. బౌద్ధ,జైన మత ప్రభావాలతో హిందూమతానికి కాస్త క్షీణదశ ఏర్పడిన క్రమంలో ఆదిశంకరాచార్యుడి అవతారం అద్భుతమైన విజయాలను సనాతన హిందూ సంప్రదాయానికి అందించింది. శృంగేరి,ద్వారక,పూరి, జ్యోతిర్మఠంలో ఆయన స్థాపించిన పీఠాలు ఆధ్యాత్మిక జ్ఞాన పీఠాలుగా నేటికీ అఖండ జ్యోతులు వెలిగిస్తున్నాయి.లోకవశంకరుడైన శంకరుని అవతారం సత్యం,శివం, సుందరం.

## కాశీలో 9 రోజులు ఎందుకు ఉండాలి ?

నవ దిన కాశీ యాత్ర అంటే ఏమిటి ? మనిషి తల్లి గర్భం లో తొమ్మిది నెలలుంటాడు. జన్మ రాహిత్యం ఇచ్చేది కాశి ఒక్కటే.అందుకని వ్యాస మహర్షి కాశీ లో తొమ్మిది నెలలు దీక్ష లో ఉండి అ తర్వాతా స్వగ్రామం చేరి మంచి రోజు చూసి పూజ చేయాలి అని చెప్పాడు. అయితే కలికాలం లో ఇంత శ్రద్ధతో అంతకాలం ఉండలేమని ఇంకేదైనా ఉపాయం చెప్పమని సామాన్యులు కోరారు. దానికి అయన తొమ్మిది రోజులుంటే ఆ ఫలితం ఢోకా లేకుండా వస్తుంది అని చెప్పాడు.మరి ఆ రోజుల్లో ఏం చెయ్యాలి ?విశ్వేశ్వర నామ స్మరణ, దానాలు చేయటం,ధర్మ ప్రసంగాలు వినటం, ,ఏక భుక్తం ,ప్రాతఃకాల స్నానం ,ఉదయం రాత్రి విశ్వేశ్వర దర్శనం,కోపం లేకుండా ఉండటం ,అబద్ధ మాడకున్డటం ,అనే ఎనిమిది అంశాలు ఖచ్చితంగా అమలు చేయాలి.మొదటిగా మనసులో 33 కోట్ల దేవతలు,తీర్థాలతో సర్వ పరివారంతో సేవింప బడుతున్న శ్రీ కాశీ విశ్వేశ్వరా !శరణు !అనుజ్ఞ !అని స్మరించుకొని మణి కర్ణికా తీర్ధానికి వెళ్ళాలి . దీనినే చక్ర తీర్థం అంటారు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే మహా దేవుని సేవలో ఇక్కడ ధన్యమైనాడు.శివుడికి పార్వతి తర్వాత ఇష్టమైన వాడు విష్ణువే . అందుకే "నారాయణీ సహా చరయ నమశ్శివాయ "అన్నారు .విష్ణు సేవా ఫలితం గా ఏర్పడిన మణి కర్ణిక కు గొప్పదనాన్ని ఆపాదించాడు విశ్వేశుడు .యాత్రీకులు మణి కర్ణిక లో స్నానం చేయాలి .బ్రాహ్మణులకు దానాలు చేయాలి .కేశ ఖండనం చేసుకొని ,మళ్ళీ స్నానం చేయాలి .మహేశ్వరాదులను అర్చించి మళ్ళీ స్నానం చేయాలి.రుద్రాక్ష మాల ధరించి ఈకింది శ్లోకం చదువు కోవాలి 'కిము నిర్వాణ పదస్య భద్ర పీతం –మృదులం తల్ప మదోను మోక్ష లక్ష్యఃఅధవా మణి కర్ణికా స్థలీ పరమానంద సుకాండ జన్మ భూమిచరా చరేషు సర్వేషు–యావంతస్చ సచేతనః తావంతిహ్ స్నాంతి మధ్యాహ్నే మణి కర్నిజతే మలే..ఆ గంగా కేశవస్చైవ హరిశ్చన్ద్రస్చ మండ పాత్ ఆ మద్యా ద్దేవ సరితః స్వర్ద్వారా న్మణికర్ణికా నమస్తే నమస్తే నమః"అని నమస్కరించి అక్కడ నుండి డుండి వినాయకుడిని దర్శించి ఇరవవై ఒక్క గరికలను ,ఇరవై ఒక్క కుడుములను సమర్పించి ,ఇరవై ఒక్క సార్లు గుంజీలు తీసి ఇరవై ఒక్క రూపాయలు దక్షిణ గా సమర్పించాలి.తర్వాతా అన్నపూర్ణా దేవిని సందర్శించాలి ఆ తర్వాతా విశాలాక్షి ,జ్ఞాన వాపి ,సాక్షి గణపతులను చూడాలి .ఇది పూర్తీ చేసి నివాసం చేరి భోజనం చేయాలి రాత్రికి విశ్వనాదుడిని దర్శించాలి ఫలాలు పాలు ఆహారం గా గ్రహించాలి "హర సాంబ హర సాంబ సాంబ సాంబ హరహర హర శంభో హర శంభో శంభో శంభో హరహర మహాదేవ మహాదేవ విశ్వనాధ శివ శివ మహాకారి మహా కారి రక్ష రక్ష హరహర అంటూ పద కొండు సార్లు భజన చేసి నిద్రపోవాలి.రెండో రోజు ఉదయానే గంగా స్నానం చేసి విశ్వేశ్వర ,అన్నపూర్ణా దర్శనం చేయాలి .మధ్యాహ్నం పన్నెండు గంటలకు మణి కర్ణికా ఘట్టం లో స్నానం చేయాలి .తీర్థ శ్రాద్ధం చేయాలి . వెయ్యి సార్లు గాయత్రీ జపం చేయాలి .గురు ఉపదేశం తో"శ్రీ కాశీ విశ్వేశ్వరాయనమః "అనే మంత్రాన్ని వెయ్యి సార్లు జపించాలి .మధ్యాహ్నం విశ్వేశుని దర్శించి సాయంత్రం కూడా మళ్ళీ దర్శించాలి.రాత్రి ఫలహారం చేసి పడుకోవాలి తెల్లవారక ముందే అసీ ఘాట్ లో సంకల్ప స్నానం చేసి అక్కడున్న సంగమేశ్వర స్వామిని దర్శించాలి .తర్వాత దశాశ్వ మేధ ఘాట్ కు చేరాలి . దీనికి "రుద్ర సరోవర తీర్థం "అనే పేరు కూడా ఉంది .ఇక్కడ స్నానం చేసి శీతలాదేవిని దర్శించాలి .వరుణా ఘాట్ కు వెళ్లి స్నానం చేసి ఆదికేశవ స్వామిని దర్శించాలి .పంచనదీ తీర్థమైన బిందు మాధవ ఘట్టం లో సంకల్ప స్నానం చేయాలి 'తర్వాతా బిందు మాధవ సంగమేశ్వర దర్శనం చేసుకోవాలి .మణి కర్నేశుని ,సిద్ధి వినాయకుని దర్శించి పూజించాలి .అన్నపూర్ణా విశ్వేశ్వర దర్శనం కావించి నివాస స్థలం చేరి భోజనం చేయాలి .రాత్రికి పాలు ,పండ్లు మాత్రమె స్వీకరించాలి .ఉదయమే గంగా స్నానం విశ్వేశరుడి దర్శనం చేసి డుండి వినాయకుడిని చూసి దండ పాణి యిన కాల భైరవుని ,పూజించాలి.కాశీ క్షేత్ర రాజ్యాన్ని మనసు లో స్మరించి "ఓం కాశ్యైనమః "అని 36సార్లు అనుకోవాలి తర్వాతా బిందు మాధవుని దర్శించాలి .గుహను ,భవానీ దేవిని దర్శించాలి ఇలా మధ్యాహ్నం వరకు తొమ్మిది దర్శనాలు చేసి మణి కర్ణిక చేరి మట్టి లింగాన్ని పూజించి మళ్ళీ అన్నపూర్ణా విశ్వేశులను దర్శించి భోజనం చేయాలి .రాత్రి నామ స్మరణ పాలు ,పండ్లు ఆహారం .అంటే ఈరోజు పది దర్శనాలన్న మాటప్రాతః కాలమే గంగా స్నానం చేసి , కేదారేశ్వరుని దర్శించి ,అక్కడే రుద్రాభిషేకం నిర్వహించాలి . తర్వాత తిలా భాన్దేశ్వర ,చింతా మణి గణపతిని సందర్శనం చేయాలి.

## తూటాలకు జడవని, బాంబులకు భయపడని

# పోరాటయోధుడు ఓంకార్



ఎన్నికల్లో పోటీ చేసి మూడుసార్లు వరుస విజయాలు సాధిస్తే "హ్యాట్రిక్ వీరుడు" అని ప్రశంశిస్తారు. ఆ మూడుసార్లు రాష్ట్రంలో పాతుకుపోయిన కాంగ్రెసు పార్టీ అభ్యర్థులనే ఓడించటం విశేషమే. అటు తర్వాత మాతృ సంస్థ నుంచి విడివడి స్వతంత్రంగా పోటీ చేసి మరో రెండుసార్లు గెలుపొందటం గొప్ప విషయం. విజయం సాధించిన ఐదుసార్లు ఆయనకు సమీప ప్రత్యర్థులు కాంగ్రెసు వారే! 1983, 1985ల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం వీచిందని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆ రెండు ఎన్నికల్లోనూ ఆ పార్టీ ప్రభంజనం ఆ నియోజకవర్గంలో పని చేయలేదు. ఆయన్ని కదిలించలేదు. 1957లో ఏర్పాటయిన ఆ నియోజకవర్గానికి 2014 వరకు 13సార్లు ఎన్నికలు జరిగితే 5సార్లు వరుస విజయాలు సాధించిన చరిత్ర ఆయనది. 1978లో ఆయన సాధించిన ఓట్ల ఆధిక్యత 21,513. 1985లో అదే నియోజకవర్గం నుంచే పోటీ చేసి సాధించిన ఆధిక్యత 21,398. అవే ఇప్పటికీ ఆ నియోజకవర్గానికి ఆధిక్యతలు. ఆ ఆధిక్యాలను అధిగమించే అవకాశాలు కనుచూపు మేరలో కనిపించటం లేదు. ఇన్ని ప్రత్యేకతలను స్వంతం చేసుకున్న నియోజకవర్గం వరంగల్లు జిల్లా నరసన్నపేట. చరిత్ర సృష్టించినది మద్దికాయల ఓంకార్. ఓంకార్‌కి తల్లిదండ్రులు పెట్టిన పేరు రాములు. 1926 మే 12న జన్మించారు. తల్లి అనంతలక్ష్మి, తండ్రి రామయ్య. నల్గొండ జిల్లా సూర్యాపేట తాలూకా ఏపూరు గ్రామంలో ఆయన జన్మించారు. ఊహ తెలిసినప్పటి నుంచి ఉద్యమాలకే ఆయన పరిమితమయ్యారు. ఉద్యమాల పట్ల ఉబలాటం కారణంగా చదువు సాగించలేకపోయారు. రెండవ తరగతిలోనే చదువు ఆపేశారు. అయితే నేమి, సమాజాన్ని క్షుణ్ణంగా చదివారు. బడుగు, బలహీన వర్గాల బాధలు, బరువులు ఆకళింపు చేసుకున్నారు. వారిని విముక్తుల్ని చేయటానికి అహర్నిశలూ శ్రమించారు. తూటాల తాకిడికి తట్టుకున్నారు. బాంబుల దాడిని ఎదుర్కొన్నారు. 12 ఏళ్ల పాటు జైలు జీవితం గడిపారు. మరో పదేళ్ళు అజ్ఞాతవాసం చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వామపక్ష నేతలతో సహచర్యం కొనసాగించారు. మందుముల నర్సింగరావు, కొండా వెంకట రంగారెడ్డి లాంటి వారితో ఐక్యతగా మెలిగారు. ఓంకార్ జీవితం ఎన్నో రాజకీయ మలుపులకు నిలయం. 15 ఏళ్ల వయస్సులో 'ఆంధ్ర మహాసభ' వైపు అడుగులు వేశారు. 1944లో ఖమ్మంలో జరిగిన ఆంధ్ర మహాసభ వార్షిక మహాసభల సన్నాహక కమిటీలో వాలంటీరుగా సేవలందించారు. అప్పుడే ఆయన ప్రముఖుల దృష్టిలో పడ్డారు. సూర్యాపేట తాలూకా ఏరియా కమిటీ క్యాంప్ ఆఫీసు కార్యదర్శిగా కొనసాగారు. అటు తర్వాత దళ నాయకునిగా, పార్టీ ఏరియా కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1953 తర్వాత ప్రత్యక్ష రాజకీయాల వైపు దృష్టి సారించారు. 1946–1951 మధ్య కాలంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముందు భాగాన నిలిచారు. భుజానికి తుపాకీ తగిలించుకొని పోరాట యోధుడని ప్రశంసలందుకున్నారు. నిజాం సైన్యాలకు, దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపారు. 1952 నుంచి 1962 వరకు వరంగల్ జిల్లాలో కౌలుదారుల హక్కులకై జరిగిన పోరాటాల్లో ఓంకార్ ముందుండే వారు. భూస్వాముల అధీనంలోని భూములను కౌలుదారులకు చట్టపరంగా స్వాధీనపరచటానికి ప్రజలను చైతన్య పరచి ముందుకు నడిపించారు.1945 నుంచి కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు పెంచుకున్నారు. కొన్నాళ్ళ తర్వాత పార్టీలో కీలక వ్యక్తిగా మారారు. దురదృష్టవశాతు పార్టీలో అతివాద, మితవాద అభిప్రాయాలు తలెత్తాయి. వాటిని సరిదిద్దాలని శతవిధాలా ప్రయత్నించారు. ఫలితం లేకుండా పోయింది. 1964లో పార్టీ రెండుగా చీలిపోయింది. ఆ సమయంలో ఓంకార్ సి.పి.యం. వైపు మొగ్గు చూపారు. పార్టీలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఒకవైపు పార్టీ కార్యక్రమాలు, మరోవైపు పోరాటాలు సాగిస్తున్న దశలో 1972లో నరసన్నపేట నియోజకవర్గం నుంచి సి.పి.యం. అభ్యర్థిగా పోటీ చేయమని పార్టీ ఆదేశించింది. ఊహ తెలిసప్పటి నుంచి ప్రజలతో మమేకమై ఉండి, ప్రజల కోసం అహర్నిశలూ శ్రమించిన ఓంకార్ ముందు వెనుక ఆలోచించకుండా రంగంలోకి దిగారు. కట్టయ్య అనే కాంగ్రెసు పార్టీ అభ్యర్థిని 3,146 ఓట్ల తేడాతో ఓడించారు. అది మొదలు ఆయనకు ఎన్నికల్లో ఎదురులేకుండా పోయింది. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఓంకార్ తీరు మింగుడు పడని పార్టీ నాయకత్వం సి.పి.యం. నుంచి బహిష్కరించింది. అయినా ఆయన చింతించలేదు. నియోజకవర్గాన్ని వీడలేదు. అక్కడి ప్రజలు కూడా ఆయన్ని మరచిపోలేదు. 1985లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఓంకార్‌ను 21,398 ఓట్ల మెజారిటీతో గెలిపించి ఆయన పట్ల వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. 1984లో యం.సి.పి.ఐ. పార్టీని స్థాపించారు. ప్రజలా పార్టీకి బ్రహ్మరథం పట్టారు. తుది శ్వాస విడిచే వరకూ పార్టీని కాపాడారు. ఓంకార్ ఎంత నిరాడంబరంగా జీవించారో, పీడిత ప్రజలకు అంత సన్నిహితంగా వ్యవహరించారు. 12 ఏళ్ల పాటు జైలు జీవితం గడిపారు. మరో పన్నెండేళ్ళు అజ్ఞాతవాస జీవితం గడిపారు. 1980 నాటికి ఆయన యం.యల్.ఎ. హైదరాబాదులోని యం.యల్.ఎ. క్వార్టర్సులో ఉన్న ఓంకార్‌పై బాంబుల దాడి జరిగింది. చాకచక్యంగా ఆ దాడి నుంచి తప్పించుకున్నారు. తనపై ప్రత్యర్థులు కురిపించిన బాంబులను ఏరి, మరునాడు శాసనసభకు తీసుకువెళ్ళి అప్పటి ముఖ్యమంత్రి డా.. మర్రి చెన్నారెడ్డికి చూపించి, యం.యల్.ఎ.పై బాంబులు విసిరే సంస్కృతి కొనసాగుతున్న పాలనలో సామాన్యులకు రక్షణ ఏమిటి అని ప్రశ్నించారు. 1984 డిసెంబరు 18న అన్నారం అనే గ్రామంలో ఒక బహిరంగసభలో ప్రసంగిస్తుండగా ఆయనపై కాల్పులు జరిపారు. 12 తూటాలు ఆయన శరీరంలో నుంచి దూసుకెళ్ళాయి. డాక్టర్లు ఎంత ప్రయత్నించినా ఒక తూటాను మాత్రం బయటికి తీయలేకపోయారు. ప్రాణాలు పోతాయని భావించి అలానే వదిలేశారు. ఆయన చనిపోయే వరకు ఆ తూటా ఆయన శరీరంలో అలానే ఉంది. బాంబులకు వెరవని, తూటాలకు భయపడని ఓంకార్ శ్వాసకోశ వ్యాధి సోకి 2008 అక్టోబరు 17న మరణించారు.

దాసరి అళ్వారస్వామి

# జగద్గురువులు ఆది శంకరులు

శంకరం శంకరాచార్య కేశవం బాదరాయణమ్ ?
సూత్ర భాష్య కృతావందే భగవంతౌ పునః పునః ?



ప్రపంచములో అశాంతి, అధర్మము ప్రబలినపుడు భగవంతుడు తనను తాను సృజించుకుని ధర్మ పరిరక్షణ చేస్తాడు. ఈ క్రమంలో తాను స్వయంగా అవతరించటంగాని లేదా మత ప్రవక్తలుగా, మత బోధకలుగా గాని అవతరించటంగాని జరుగుతుంది. ఈ క్రమం లోనే శ్రీ ఆది శంకరాచార్యులు ధర్మము, శాంతి స్థాపించటానికి భూలోకంలో అవతరించారు. వీరు తమ బోధనలతో ప్రజలలో చైతన్యం తీసుకొని వచ్చారు. హిందూ ధర్మానికి, హైందవేతర ధర్మానికి మధ్య సంఘర్షణ కొనసాగుతూ వుండేది. ఇటువంటి స్థితిలో సృష్టి తత్వాన్ని, బ్రహ్మ తత్వాన్ని, జీవ రహస్యాన్ని తెసుకొని, నిత్యానుష్ఠాన శక్తితో, భక్తితో, యోగ బలంతో వేద వ్మాయాన్ని ఆధారంగా చేసుకొని పరతత్వాన్ని నిర్ధారించి చెప్పగలిగే హైందవ ధర్మ రథ సారధిగా శ్రీశంకరాచార్యులవారు అవతరించారు. ఈ కోవలోని వారైన శిరిడి సాయిబాబా, భగవాన్ రమణ మహర్షి, మధ్వాచార్యులు, నడిచే దైవంగా పిలువబడే శ్రీచంద్రశేఖరేంద్ర స్వామివారు, శ్రీజయేంద్ర సరస్వతీ మహాస్వామివారు మొదలైన వారు అయా కాలాలలోని సాంఘిక రుగ్మతలను రూపుమాపటానికి తమవంతు కృషి చేసారు. శ్రీశంకరాచార్య పరంపర నుండి నేటి శ్రీ భారతీ తీర్థ మహాస్వామివారి వరకు 36వ పరంపర కొనసాగుతున్నది. కృతయుగంలో కపిల మహర్షి, త్రేతాయుగంలో వాల్మీకి, ద్వాపరయుగంలో వ్యాసమహర్షి, కలియుగంలో శ్రీశంకరాచార్యుల్జ్ఞానమార్గ ప్రవర్తకులుగా మనకు తెలుస్తుంది.శ్రీ శంకరాచార్యులవారు కేరళలోని 'కాలడి' అనే గ్రామంలో క్రీ.పూ 44వ సంవత్సరంలో శివగురుడు, ఆర్యాంబి అనే నంబూద్రి దంపతులకు వైశాఖ శుద్ధ పంచమినాడు జన్మించారు. అద్వైత మత సంస్థాపన కోసం అవతరించిన పరమేశ్వరాంశ సంభూతులు. వీరు బహుముఖ ప్రజ్ఞశాలి, మహిమోపేతులు, మహాయోగి, మహా మేధావి, గొప్ప తాత్వికులు, కవి మరియు రచయిత. వీరు శంకర పీఠ సంస్థాపకలు, ఆచార్యులకే పరమాచార్యులు. వీరి జననము జరిగే సమయానికి సనాతన ధర్మము భ్రష్టుపట్టి సతమతమౌతున్నది. ఇటువంటి స్థితిలో దేవతాదులు కైలాసానికి వెళ్ళి, సనాతన ధర్మాన్ని ప్రతిష్టించమని శివుని ప్రార్ధించారు. దేవతల ప్రార్ధనను భక్తవశం కరుడైన పరమేశ్వరుడు అంగీకరించి తాను శంకరాచార్యులుగా అవతరించి, సన్యసించి అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం గావించి, ధర్మ ప్రతిష్ట గావిస్తానని వరము ప్రసాదించాడు. బ్రహ్మదేవుడు మండనమిశ్రునిగా, శారద ఉభయభారతిగా, కుమారస్వామి భట్టభాస్కరునిగా, ఇంద్రుడు సుధన్వమహారాజుగా అవతరించి ధర్మ సంరక్షణలో పాల్గొంటారని పరమేశ్వరుడు పలికాడు.కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు భారతదేశము అంతటా అనేకమార్లు కాలినడకన పర్యటించి తమ బోధనలతో ప్రజలను జాగృతం చేశారు. ఉగ్రదేవతను సౌమ్య దేవతలుగా మార్చారు. శ్రీచక్రాలు, ధనాకర్షణ, జనాకర్షణ యంత్రాలను ప్రతిష్టించారు. కైలాసం నుంచి స్ఫటికలింగాలను తీసుకొనివచ్చి, ముక్తిలింగాన్ని కేదారంలోను, వరలింగాన్ని నేపాల్‌లోని నీలకంఠంలోను, మోక్షలింగాన్ని చిదంబరంలోను, యోగ లింగాన్ని కంచిలోను, భోగలింగాన్ని శృంగేరిలోను ప్రతిష్ఠించారని విద్వాంసుల ఉవాచ. నిగ్రహం కొరకే విగ్రహారాధన అని అభిప్రాయ పడిన శ్రీ శంకరులు దేశంలో అనేక కొత్త ఆలయాల నిర్మాణానికి కృషి చేశారు. జంతు బలులను, కర్మకాండను నిరసించారు. భారతదేశములోని నాలుగు దిక్కుందు శక్తి పీఠాలను స్థాపించారు. తూర్పు దిక్కున ఒరిస్సాలోని పూరీ క్షేత్రము నందు ఋగ్వేదయుతమైన గోవర్ధన పీఠము, ఉత్తరమున బదరికా వన ప్రాంతములో అధర్వణ సమ్మతమైన జ్యోతిర్మఠము, దక్షిణాన కర్నాటకలో యజుర్వేదయుతమైన శృంగేరి శారదా పీఠము, పశ్చిమ దిక్కున సామవేద సమ్మతమైన ద్వారకా పీఠము స్థాపించారు. 'ప్రజ్ఞనం బ్రహ్మ, అహం బ్రహ్మస్మి, తత్త్వమసి, అయమాత్మ బ్రహ్మ' అనే మహా వాక్యాలకు ఈ పీఠాలు ప్రతీకలు. పూరీలో పద్మపాద, శృంగేరిలో సురేశ్వర, ద్వారకలో హస్తామక, బదరీలో తోటకాచార్యులను పీఠాధిపతులుగా నియమించి, అద్వైత సిద్ధాంత ప్రచారంలో పర్యటనలు గావించారు. నేటికీ ఈ మఠాలు నిర్విరామంగా శంకర సాంప్రదాయానుగుణంగా ధర్మ ప్రచారాన్ని గావిస్తున్నాయి. ఆయా పీఠాలలో తగిన పీఠాధిపతును నియమించి ధర్మ ప్రభోదానికి కృషి చేశారు. ఈ నాలుగు పీఠాలలో శృంగేరి పీఠము ప్రధానమైనది. శ్రీశంకరులు తమ జీవితంతో అత్యధిక భాగము ఇక్కడే గడిపారు. వనదుర్గా మంత్రముతో సరస్వతీ స్వరూపిణి అయిన ఉభయభారతిని ఆవాహన చేసి ఆమెను 'శారద' గా ప్రతిష్టించారు. ఆ రోజుల్లో ఆచరణలో వున్న వివిధ మత సంప్రదాయాలను ఏకం చేసి 'పంచాయతనము' అనే ఒక సిద్ధాంతమును ఏర్పరచారు. ఈ పూజా విధానములో ఆదిత్యుడు, అంబిక, విష్ణువు, గణపతి, మహేశ్వరుడు ప్రధానంగా పూజింపబడతారు. ఎవరి ఇష్ట దైవాన్ని వారు ఆరాధించుకోవచ్చును. శ్రీ శంకరాచార్యులు అద్వైత మత స్థాపకులు. అద్వైతము అంటే ఒక్కటే రూపము. పరమాత్మకు, జీవాత్మకు బేధం లేదు అని చెప్పే సిద్ధాంతము. ఇదే ఉపనిషత్సారము.శ్రీ శంకరాచార్యులు సామాన్యులకు కూడా అర్థం అయ్యే రీతిలో 150కి పైగా గ్రంధాలను రచించారు. 18 భాష్య గ్రంధాలను, 40 ప్రకరణ గ్రంధాలను, 74లఘు గ్రంధాలను రచించారు. సకల దేవతా స్తోత్రమును కూడా రచించారు. ఈ నాడు మనం చేయుచున్న స్తోత్రములన్ని శ్రీశంకరులు రచించినవే. భజగోవిందము, శివానందలహరి, నిర్వాణ మంజరి, కౌపీన పంచకం, వివేక చూడామణి మొదలైన ప్రముఖ గ్రంధాలను రచించారు. వీరు భిక్షాటనతో జీవించేవారు. ఒకనాడు ఒక పేదరాలి ఇంటి వద్దకు భిక్షకు వెళ్ళగా ఆమె సిగ్గుపడుతూ ఎండిన ఉసిరికాయ భిక్షగా సమర్పించగా, శ్రీ శంకరులు ఆమె ఔదార్యానికి సంతసించి ఆశువుగా కనకధారాస్తవం చేయగా లక్ష్మీదేవి ప్రత్యక్షమై ఆ పేదరాలి ఇంట బంగారు ఉసిరికాయలు వర్షంగా కురిపించింది. లక్ష్మీ కటాక్షానికి ఈ స్తోత్రము అత్యంత మహిమోపేతమైనది. శ్రీ శంకరులు రాగద్వేషాలకు అతీతంగా వుండాలని, కోరికలు అదుపుచేయనిదే దుఃఖము అంతమవ్వదని ప్రభోధించారు. నిరాడంబర జీవితం, పరోపకారము, భూతదయ, సత్యం, చిత్తశుద్ధి, గురు శుశ్రూష, తల్లిదండ్రుల సేవ వంటి సద్గుణాలను అలవరచుకోవాని బోధించేవారు. శ్రీ శంకరులు సాక్షాత్తు పరమేశ్వర అవతారము గనుక, పుట్టిన రెండవ యేటనే చదవటం, వ్రాయటం మొదలు పెట్టారు. వీరికి 5వ సంవత్సరములో ఉపనయనం జరిగింది. గురుకులంలో కేవలం రెండు సంవత్సరములోనే చతుర్వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు సంపూర్ణంగా అభ్యసించారు. సన్యాస వృత్తిని స్వీకరించి నర్మదా నదీ తీరములోని గోవింద భగవత్పాదులవద్ద శిష్యరికం చేశారు. తన తల్లి వృధాప్యంతో పూర్ణానదికి వెళ్లలేని స్థితిలో, పూర్ణానదినే తన తపోబలంతో ఇంటి వద్దకు వచ్చేలా చేశారు. ఒకసారి నర్మదా నది పొంగి ఇబ్బంది కలిగించగా, నదిని తన కమండంలో బంధించారు. వీరు భారతదేశములో దర్శింపని క్షేత్రము లేదు.ఒక రోజు శ్రీశంకరులు పరమేశ్వర దర్శనార్థమై వెడుతుండగా ఒక ఛండాలుడు నాలుగు కుక్కలను వెంట తీసుకుని వారి మార్గానికి అడ్డుగా రాగా, శంకరులు దారి తొలగమని అంటారు. అప్పుడు ఛండాలుడు నన్ను అడ్డ తొలగమంటావా లేదా నాలో కొలువైవున్న పరమాత్మను అడ్డుతొలగమంటావా అని ప్రశ్నింపగా, నిశ్చేష్టులైన శంకరులు, ఆవ్యక్తి సాక్షాత్తు పరమేశ్వరునిగా గుర్తించి, సాష్టాంగ నమస్కారం చేసి, వారిని స్తోత్రము చేసారు. ఈ స్తోత్రానికి 'మనీషా పంచకము' అని పేరు. అప్పుడు పరమేశ్వరుడు సాక్షాత్కరించగా, వారి వెంటన వున్న కుక్కలు నాలుగు వేదాలుగా రూపుదిద్దుకొన్నాయి. ఆ తరువాత పరమేశ్వర ఆదేశంతో బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాసారు.శ్రీశంకరులు సన్యాస వృత్తి స్వీకరించటానికి తల్లి మొదట అనుమతించలేదు. కాని అవసాన కాలంలో తప్పక వస్తానని మాట ఇచ్చి దేశాటనకి బయలుదేరి వెళతారు. తల్లి అంత్యదశలో తన కుమారుని స్మరించగా వారు ప్రత్యక్షమై, తల్లిని సంతోషపరుస్తారు. శ్రీశంకరులు ప్రార్ధన చేయగా విష్ణుమూర్తి తన దూతను పంపి ఆర్యాంబను వైకుంఠానికి తీసుకొని వెళతాడు. తల్లి పార్ధివ దేహానికి అంత్యక్రియల చేయటానికి ప్రయత్నించగా, గ్రామస్థులు అగ్ని ఇవ్వటానికి అంగీకరించకపోవటంతో, తన తపోబలంతో అగ్నిని సృజించి తల్లికి అంత్యక్రియు పూర్తి చేస్తారు. తరువాత గ్రామస్థులకు తీవ్రమైన శాపానిస్తారు. గొప్ప మహిమాన్వితులైన శ్రీశంకరాచార్యులు కేవలం8 సంవత్సరాల ఆయుష్షుతో జన్మించారు. వారు మరియు వారి తల్లి ఒకనాడు వారింటికి వచ్చిన సన్యాసులకు అతిధి మర్యాదు చేయగా సంతసించి, మరొక 8 సంవత్సరాల ఆయుష్షును ప్రసాదించారు. కాశీలో వేదవ్యాసునితో వాదించి వ్యాసానుగ్రహం పొంది, తద్వారా మరొక 16 సంవత్సరా ఆయుర్దాయంతో మొత్తము 32 సంవత్సరాలు జీవించారు. శ్రీ శంకరులు భూమిపై ఆధ్యాత్మిక, ధార్మిక కార్యములు పూర్తి చేసిన తరువాత దేవతాదులు విచ్చేసి వారిని కైలాసానికి పయనించవలసిన సమయము ఆసన్నమైనదని చెబుతారు. దేవతలు శ్రీశంకరులు చేసిన అద్వైత మత స్థాపన, ధర్మ పరిరక్షణ్జ్ఞన జ్యోతి వికాసము మొదలైన వాటి శ్లాఘించారు. నందీశ్వర, పార్వతి, ప్రమధ గణములు స్వాగతం చెబుతుండగా జగద్గురువులైన అపర శంకరులు నిజ శంకరులై ప్రకాశిస్థూ కైలాసానికి వేంచేయటం జరిగింది.ఇతి సకల దిశానుద్వైత వార్తానివృత్తౌ స్వయమథ తపరితస్త్వారయ మద్వైత వర్త్మప్రతిదినమపికుర్వ స్సర్వసన్దేహా మోక్షం రవిరివ తిమిరైఘే సమ్రుశాన్తే మహస్స్వమ్ జ్ఞనంతో అద్వైత స్థితిని అందుకోలేని సామాన్యులకు భక్తితో నిర్గుణ పరబ్రహ్మతత్వాన్ని తెలియచేసే అనేక స్తోత్రాలను రచించారు. భిన్నత్వంతో ఏకత్వం అనే భారతీయ ఉత్కృష్ట భావ సంస్కృతికి శంకరాచార్యులవారు స్ఫూర్తి. వివిధ వైదిక మతాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతీ విశేషాలతో అలరారుతున్న భారతదేశాన్ని ఆధ్యాత్మికంగా ప్రకాశించే విధంగా, అఖండ జ్యోతి రూపంగా వెలుగొందే విధంగా శంకరాచార్యులవారు సనాతన వైదిక ధర్మాన్ని పునః ప్రతిష్ఠించారు. వారి స్ఫూర్తి మనందరికీ మార్గదర్శకం, ఆచరణీయము. హైందవ సంప్రదాయాలను ఒకే తాటిపై తీసుకొచ్చిన అనూహ్య తపశ్శక్తి ఫలము. దీనిని కాపాడుకోవలసిన నిండైన భాధ్యత మనది. శంకర మార్గము శుభకరం ! శ్రీకరం!

దేవులపల్లి పద్మజ

# పశ్చిమ అభివృద్ధి

# జైభారత్ బ్యాటరీటార్చ్‌తోనే సాధ్యం

## టార్చ్ ర్యాలీలో జైభారత్ నేషనల్ పార్టీ పశ్చిమ అభ్యర్థి పోతిన వెంకట రామారావు



**విజయవాడ పశ్చిమ, మే 11, (ఆంధ్రపత్రిక) :** విజయవాడ పశ్చిమ అభివృద్ధి జైభారత్ పార్టీతోనే సాధ్యమని పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి పోతిన వెంకట రామారావు చెప్పారు. తమ్మిన పోతరాజు, మరుపిళ్ల చిట్టి, పోతిన చిన్నా, సన్యాసిరావు లాంటి వారు ఎమ్మెల్యేలుగా చేసిన పశ్చిమ నియోజకవర్గానికి ఇపుడు మరో రాజకీయ అవకాశం వచ్చిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని, వన్ టౌన్ ని అభివృద్ధి చేసుకుందామని ఓటర్లకు పిలుపునిచ్చారు. విజయవాడ పశ్చిమలో శనివారం ఉదయం చిట్టినగర్ కొత్త అమ్మవారి దేవాలయం నుంచి, రథం సెంటర్ వరకు, కుమ్మరి పాలెం సెంటర్ నుంచి సితార సెంటర్ వరకు జై బారత్ టార్చ్ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి వించి పేట వరకు ర్యాలీ చేశారు. పోతిన రాము కార్నర్ మీటింగులలో ఓటర్లనుద్దేశించి మాట్లాడుతూ, పశ్చిమ నియోజకవర్గాన్ని తాను మోడల్ నియోజకవర్గంగా మారుస్తానని హామీ ఇచ్చారు. భవానీపురంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, పిల్లలకు ఎమ్యూజ్ మెంట్ పార్క్, కొండ ప్రాంతంలో మెట్ల పునరుద్ధరణ, మంచి నీటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విజయవాడకు ప్రధాని మోదీ వచ్చి ఏం మేలు చేశారని, అమరావతి, ప్రత్యేక హెూదా, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై ఏం చేశారని ఆయన విమర్శించారు. జైభారత్ రోడ్ షోలో పోతిన రాముతోపాటు కార్మిక నాయకుడు బూరాడ యజ్ఞనారాయణ, జైభారత్ నాయకులు, రవికిరణ్, మహంత్ నాయర్, బెజవాడ నాని, పోతిన శ్రీనివాసరావు, రాయన మణి, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ అభ్యర్థి ఆసిఫ్‌ను గెలిపించండి

### పశ్చిమ ప్రజలకు జనసేన నాయకుడు గయాసుద్దీన్ పిలుపు



**విజయవాడ పశ్చిమ, మే 11, (ఆంధ్రపత్రిక) :** పేదవాడికి ధనవంతుడికి మధ్య జరుగు తున్న ఎన్నికల పోరాటంలో పేదవాడైన వైసిపి అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ని గెలిపించాలని పశ్చిమ నియోజకవర్గం ప్రజలకు ఐజా గ్రూప్ చైర్మన్, జనసేన విజ యవాడ నగర అధికార ప్రతి నిధి షేక్ గయాసుద్దీన్ పిలుపు నిచ్చారు. శనివారం భవానిపురంలోనీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అభ్యర్థి ఆసిఫ్ కనీసం 20,000 ఓట్ల మెజార్టీతో గెలుస్తారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి దిగుమతి అయిన బిజెపి అభ్యర్థి సుజనా చౌదరి ఇక్కడి స్థానికులకు అవసరం లేదని, స్థానికుడైన వైసీపీ అభ్యర్థి ఆసిఫ్ తోనే ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని ఆయన చెప్పారు. పొత్తులో భాగంగా కూటమి తరుపున పశ్చిమ సీటును బిజెపి కి కేటాయించారని, అయితే బిజెపి నాయకత్వం జనసేన నాయకులను, కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని, గాలికి వదిలేసారని ఘాటుగా విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎక్కువగా మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ ,బీసీలు కాపులు ఉన్నారని, వీరందరూ రానున్న ఎన్నికల్లో ఆసిఫ్ కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఐజా విజ్ఞప్తి చేశారు. అనేక సమస్యలు ఉన్న పశ్చిమ నియోజకవర్గాన్ని స్థానికులే సరైన రీతిలో అభివృద్ధి చేయగలరని అన్నారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్‌ని గెలిపించడం ఎంత అవసరమో, విజయవాడ పశ్చిమ లో ఆసిఫ్‌ను గెలిపించడం కూడా అంతే అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో పోతిన మహేష్ జనసేనపార్టీ వ్యవహారాలపై కొన్ని నిజాలు మాట్లాడారనీ అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి ఆసిఫ్ గెలుపుతోనే సామాన్యుడికి న్యాయం జరుగుతుందని ఐజా స్పష్టం చేశారు.

## ఆ నవరత్నాలు నవ మోసాలు



**నందిగామ, మే 11: (ఆంధ్రపత్రిక) :** జగన్ ప్రకటించిన వైసీపీ మేనిఫెస్టో అబద్ధాలపుట్ట అని నందిగామ అసెంబ్లీ కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచా రంలో భాగంగా శనివారం కంచిక చర్ల, గొట్టుముక్కల, మొగులూరులలో భారీ రోడ్ షో, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు అడుగడ్గున ప్రజల నుండి విశేషమైన ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేశామంటూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డా రు. మళ్లీ మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, మన కూటమి ప్రభుత్వం రాగానే పింఛన్ రూ.4 వేలు పెంచి ఏప్రిల్ నుంచే ఇస్తాం అన్నారు. రాజకీయ పిచ్చి కోసం గత నెలలో వృద్ధులను మండు టెండల్లో రోడ్లపైకి తీసుకొచ్చి 34 మంది వృద్ధులు చనిపోవడానికి కారణమయ్యారని ఆరోపించారు.ఆడబిడ్డలకు నెలనెలా రూ.1,500 చొప్పున ఐదేళ్లలో రూ.95 వేలిస్తాం అన్నారు. తల్లికి వందనం కింద బడిలో చదివే పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని, ఇంట్లో నలుగురు పిల్లలు ఉంటే రూ. 60 వేలు వస్తుందన్నారు. దీపం పథకంలో మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. అందరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బటన నొక్కి అలిసిపోయిన జగనకు సెలవిద్దాం



**నందిగామ, మే 11(అనాసాగరం), (ఆంధ్రపత్రిక):** బటన నొక్కి నొక్కి అలిసిపోయిన సీఎం జగన్మోహనరెడ్డికి ఇక సెలవు ఇద్దామని రాష్ట్ర ప్రజలకు టీడీపీ నాయకుడు వంగవీటి రాధా పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో శనివారం ఆయన పర్యటించారు. నందిగామ నియోజకవర్గ టీడీపీ–జనసేన–బీజేపీ ఉమ్మడి అభ్యర్థి తంగిరాల సౌమ్య ఎన్డీయే కూటమి నేతలతో కలిసి వంగవీటి రాధా నందిగామ పట్టణంలో రైతుపేట పార్టీ కార్యాలయం నుండి రైతుపేట, సీఎం రోడ్డు, గాంధీ సెంటర్, పాత బస్టాండ్ మీదుగా అనాసాగరం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వైసీపీ రాష్ట్ర ప్రజలను కులాలు, మతాలవారీగా విడ గొట్టిందని ఆరోపించారు. కాపులందరూ కలిసికట్టుగా ఉన్నామని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ ఎన్నికల్లో ఇచ్చే తీర్పు భావితరాలకు ఉజ్వల భవిష్యత్తునిస్తుందన్నారు. నందిగామ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్యను గెలిపించాలని కోరారు. ఇప్పటికే కూటమి అభ్యర్థుల విజయం పక్కా అన్నారు. చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమన్నారు.

### మాతృభూమికి సేవచేసే

## అవకాశం ఇవ్వండి

### బిజెపి పశ్చిమ అభ్యర్థి సుజనాచౌదరి



**విజయవాడ పశ్చిమ, మే 11, (ఆంధ్రపత్రిక) :** దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో మాతృభూమికి సేవచేసే అవకాశం వచ్చిందని, తనను గెలిపించాలని పశ్చిమ నియోజకవర్గ ఎన్డీయే కూటమి బిజెపి అభ్యర్థి వై. సుజనా చౌదరి అన్నారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు అయిన శనివారం భవానిపురం బిజెపి కార్యాలయం నుంచి ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, చిట్టినగర్, రథంసెంటర్ మీదుగా కాళేశ్వరరావు మార్కెట్ వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ మధ్యతరగతి రైతుబిడ్డగా మొదలైన ప్రస్థానం ప్రజల ఆశీస్సులతో రాజ్యసభ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా సుదీర్ఘ కాలం సేవలందించానన్నారు. ఈ ఎన్నికలు ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్నాయన్నారు. వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టేందుకు ఏపీ ప్రజలంతా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుస్తానని, పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. విద్యా వైద్యం మౌలిక సదుపాయాలకు సింహభాగం కేటాయించి పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానన్నారు. వైసిపి పాలకుల చేతగానితనంతో యువత గంజాయికి బానిసలుగా మారారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలన్నా రాజధాని అమరావతి నిర్మాణం జరగాలన్న అనుకున్న లక్ష్యం చేరాలంటే ఎన్డీయే కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని 100శాతం పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ టిడిపి పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాధ్, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి బుద్ధా వెంకన్న, టిడిపి అధికార ప్రతినిధి నాగుల మీరా ,మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, బిజెపి నాయకులు పోతిన వెంకటేశ్వరరావు, పైలా సోమినాయుడు,జనసేన ఆంధ్రాజోన్ కన్వీనర్ బాడిత శంకర్ , నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, టిడిపి మాజీ కార్పొరేటర్లు యేదుపాటి రామయ్య, పత్తి నాగేశ్వరరావు , నాయకులు చిన్న సుబ్బయ్య, యేదుపాటి వెంకటరమణి, బిజెపి నాయకురాలు రౌతు రమ్యప్రియ, జనసేన డివిజన్ ఇంచార్జ్ తిరుపతి అనూష ,బిజెపి ,టిడిపి, జనసేన నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాజధాని నిర్మాణం కూటమి ప్రభుత్వానికే సాధ్యం



**బంటుమిల్లి 11మే (ఆంధ్రపత్రిక) :** ఆంద్ర రాష్ట్ర రాజదాని నిర్మాణం టిడిపి ,జనసేన కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ప్రముఖ పారిశ్రామిక వేత్త పసుపులేటి లక్ష్మణస్వామి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో బాగంగా శనివారం మండల పరిదిలోని సముద్ర తీరగ్రామాలలో బిజేపి, జనసేన బలపరచిన టిడిపి పెడన నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ,బందరు పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలసౌరి ల ఎన్నికల గుర్తులైన సైకిల్ ,గాజుగ్లాసు గుర్తులపై తమ పవిత్రమైన ఓటుముద్రను వేసి అఖండ మెజారిటితో గెలిపించి ఆంధ్రరాష్ట్ర రాజదాని నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని మల్లేశ్వరం గ్రామనికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పసుపులేటి లక్ష్మణస్వామి ఓటర్లను అభ్యర్దించారు .ఈ సందర్బంగా లక్ష్మణస్వామి మాట్లడుతూ ప్రపంచదేశాలలో ఎక్కడా కనీవినీఎరుగని అంశం ఆంధ్రరాష్ట్రానికి రాజదాని లేకపోవడం అన్నారు .వైసిపి అదికారం చేపట్టిన తరువాత ఆంధ్రరాష్ట్రం అన్నివిధాలా అధ్వాన్నస్థితిలో ఉందన్నారు .ఆంధ్రరాష్ట్రనికి రాజదాని రావాలన్న ,రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ది చెందాలన్న కూటమి ప్రభుత్వానికే సాధ్యమని ,ప్రతిఒక్కరు ఆలోచించి ఓటువేయాలని వ్లిప్తి చేశారు .ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సినియర్ పుప్పాల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

### రెల్లి కుల సంఘ నాయకుడు

## వర కృష్ణ బిజెపిలో చేరిక



**విజయవాడ పశ్చిమ, మే 11, (ఆంధ్రపత్రిక) :** విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన రెల్లి కుల సంఘ నాయకుడు, వైయస్సార్సీపి నాయకుడు మాడుగుల వర కృష్ణ భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పశ్చిమ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి సుజనా చౌదరి సమక్షంలో బిజెపిలో చేరిన వర కృష్ణకు మాజీ కేంద్ర మంత్రి సయ్యద్ షాన్ వాజ్ హుస్సేన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. పార్టీ పురోభివృద్ధికి కృషి చేయాలని వర కృష్ణకు కేంద్రమంత్రి సయ్యద్ షాన్ వాజ్ హుస్సేన్, సుజనా చౌదరి సూచించారు. బీజేపీ పార్టీ లో చేరిన మాడుగుల వరకిష్ణ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశానని, అయినప్పటికీ పార్టీలో ఎటువంటి గుర్తింపు, గౌరవం లేకపోవడంతో వైయస్ఆర్సీపీని వీడి భారతీయ జనతా పార్టీలో చేరినట్లు చెప్పారు. వర కృష్ణ తో పాటు పెద్ద సంఖ్యలో రెల్లి కుల సంఘ ప్రముఖులు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, వర కృష్ణ అభిమానులు పార్టీలో చేరగా వారికి సైతం మాజీ కేంద్రమంత్రి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ , బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు పలువురు పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నంలో కొనసాగుతున్న

## వసంత శిరిష ఎన్నికల ప్రచారం



**మైలవరం, మే 11: (ఆంధ్రపత్రిక):** సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం ఇబ్రహీంపట్నంలోనిఎ,సికాలనీలో వసంత శిరిష ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు అత్మీయ స్వాగతం పలికి హరతులు పట్టి అశీర్వదిస్తూ ఘనమైన స్వాగతం పలికారు. ఇంటిం టి ప్రచారం నిర్వహించిన శిరిష వృద్దులు, మహిళలను కలిసి తెలు గుదేశం పార్టీ మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణి చేశారు. కాలనీలో దేవాలయాల్లో ప్రతేక పూజలు నిర్వహించగా వేద పండితులు అక్షింతలు వేసి అశీర్వదిం చారు. ఈ సందర్బంగా శిరిష వారితో మాట్లాడుతూ ఈ నెల 13 న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గ నుంచి ఎమ్మెల్యే గా పోటీచేస్తున్న వసంత వెంకట కృష్ణ ప్రసాదుకి ఈవియం లో 4 వ నెంబర్ లో నోక్కి సైకిల్ గుర్తు పై మీ ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అలానే యంపి అభ్యర్థిగా పోటీచేస్తున్న కేశినేని శివనాధ్ కి ఈవియం లో 1 వ నంబర్ పై నోక్కి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, తెలుగు మహిళలు, జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

## వైసిపి నుండి టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు



**ఆగిరిపల్లి మే 11 (ఆంధ్రపత్రిక):** ఆగిరిపల్లి మండలం ఎస్ ఏ పేట గ్రామానికి చెందిన తన్నీరు రామాంజనేయులు, తమ్మిశెట్టి రామారావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి రంగారావు, తమ్మిశెట్టి వెంకన్న, తమ్మిశెట్టి నాగేంద్రబాబు, తమ్మిశెట్టి మారేశ్వరరావు, తమ్మిశెట్టి మధు, తమ్మిశెట్టి వసంతరావు, తమ్మిశెట్టి శివాజీ, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి రంగారా వు, పల్లెపు ప్రసాద్, పల్లెపు కిరణ్, పల్లెపు అప్పారావు, దేవళ్ళ రాజు, దేవళ్ళ వెంకన్న, చల్లా అంజి, చల్లా రంగారావు, చల్లా రాఘవ, వేముల కొండలు, వేముల వెంకట్, అచ్చి సత్యనారాయణ, తమ్మిశెట్టి బాబురావు, తమ్మిశెట్టి నాగరాజు, తమ్మిశెట్టి ప్రసాద్, తమ్మిశెట్టి గంగాధర్ రావు, తమ్మిశెట్టి మోహన్ రావు, తమ్మిశెట్టి మధు, తమ్మిశెట్టి మాధవరావు, దేవళ్ళ చంద్రరావు మరియు 50 కుటుంబాల వారు ఈ రోజు నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం జనసేన బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి సమక్షంలో తెలుగుదేశం కండువాలు కప్పుకుని పార్టీలో చేరడం జరిగింది.ఈ సంద్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరగబోవు అసెంబ్లీ ఎన్నికల్లో సారధి విజయానికి నిరంతరం కృషి చేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### మండుటెండలో పోతురెడ్డిపల్లి, గొల్లపల్లి

## గ్రామాలలో ఎన్నికల ప్రచారం



**నూజివీడు, మే 11 (ఆంధ్రపత్రిక):** నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి, గొల్లపల్లి గ్రమాలలో నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి, వారి సతీమణి, కమల లక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది.పోతురెడ్డిపల్లి,గొల్లపల్లి గ్రామాలలో పార్థసారథికి ఘనంగా స్వగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ మరియు మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారథి మాట్లాడుతూ రాష్ట్రాన్ని సస్య శ్యామలం చేసే పోలవరాన్ని జగన్ గోదావరిలో కలిపేశారు, పోలవరం పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని, జులై 1వ తేదీన 7000 పింఛను ఇస్తామని, నెలకు నాలుగు వేలకు పెంచుతామని, ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని, జూలైలో మూడు నెలలవి కలిపి ఇస్తామని సారధి ప్రజలతో తెలియ చేయడం జరిగింది. అదేవిధంగా జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాల నకళ్ళను తగలబెట్టాలని, ఓటమి మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే బాధ్యత తీసుకుంటామని తెలియచేశారు. అదేవిధంగా ప్రజల ఆస్తిపై జగన్ కన్ను పడింది, ఈనెల 13వ తేదీన సైకిల్ గుర్తుపై ఓటు వేసి బుద్ధి చెప్పాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోతురెడ్డిపల్లి గ్రామంలో ఉన్న సమస్యలను పూర్తి చేసే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. కావున ప్రజలందరూ ఆలోచించి మీ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి నూజివీడుకి నన్ను మరియు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొట్లూరి సత్యనారాయణ, వెంకట్రావు, పొట్లూరి శాంతకుమార్, అక్కినేని చంద్రశేఖర్(చందు), అక్కినేని శ్రీదేవి, అక్కినేని బెనర్జి, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### కూటమి పార్లమెంట్, అసెంబ్లీ,

## అభ్యర్థులను గెలిపించండి



**నూజివీడు, మే 11 (ఆంధ్రపత్రిక) :** నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నూజివీడు ఉమ్మడి అభ్యర్థి పార్థసారధి, ఏలూరు పార్లమెంటు అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ గెలుపు కోసం గ్రామాల్లో జనసేన నాయకులను,కార్యకర్తలను కలుస్తూ జరిగిన ప్రచార కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బర్మా ఫణి బాబు పాల్గొన్నారు ఆయన మాట్లాడు ప్రతి ఒక్కరూ కూడా ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో రెండు ఓట్లు కూడా సైకిల్ గుర్తు మీద వేసి అటు ఎమ్మెల్యే గా పార్థ సారథిని ,ఇటు ఎంపీ అభ్యర్థిగా మహేష్ యాదవ్ ని గెలిపించి నూజివీడు అబివృద్ధికి భాగస్వామ్యం కావాలని కోరారు ఆయనతో పాటు నియోజకవర్గ జనసేన నాయకులు,పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కమిటి సభ్యులు పాశం నాగబాబు ,నాయకులు తోట వెంకట్రావు, సూరిశెట్టి శివ , బళ్ల వీరాస్వామి, బొక్కినాల రాజు పాల్గొన్నారు ఈ ప్రచార కార్యక్రమాల్లో గ్రామ టీడీపీ పార్టి నాయకులు,స్థానిక జనసేన,టీడీపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎన్డీయే కూటమి గెలుపుకు కృషి చేయాలి



**ఎ.కొండూరు మే 11 (ఆంధ్రపత్రిక) :** ఎన్డీయే కూటమి బలపర్చిన విజయవాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కేసినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు విజయాన్ని కాంక్షి స్తూ శనివారం రేపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సింగారెడ్డి ప్రసాదరెడ్డి ప్రధాన కార్యదర్శి తరిగొప్పుల హుస్సేన్ బాబు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే పోలవరం ప్రాజెక్ట్ అమరావతి రాజధాని నిర్మాణం చింతలపూడి ఎత్తిపోతల పథక నిర్మాణం పూర్తి కావాలన్నా తిరిగి ఈ రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావలసిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ ఐదేళ్ల వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఈ రాష్ట్రం అన్ని రంగాల్లో దివాళా తీసిందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కావాలన్నా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా ఎ. కొండూరు మండలంలో కిడ్నీ సమస్య శాశ్వత పరిష్కారం కావాలన్నా ఫ్లోరైడ్ రహిత కృష్ణా జలాలు సరఫరా కావాలన్నా ఎన్డీయే కూటమి బలపరిచిన కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొలిక పూడి శ్రీనివాసరావును మీ పవిత్రమైన అమూల్యమైన ఓటు ముద్రను సైకిల్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీ చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి శ్రీనివాసరెడ్డి కృష్ణకుమారి భవాని వాణి నాగమణి సంగీత రాణి తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## కుప్పం డిగ్రీ కళాశాలలో
# క్యాంపస్ ఇంటర్వ్యూలు



**కుప్పం,మే 11 (ఆంధ్రపత్రిక):** కుప్పం డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెనెక్స్ టెక్నాలజీ కంపెనీ నిర్వహించిన ఈ ఇంటర్ వ్యూ లలో 165 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 73 మంది విద్యార్థులు ఎంపిక అయినట్లు కళాశాల చైర్ పర్సన్ శాంత నాగ రాజ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ చైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణిలు అభినందించారు. ఎంపికైన విద్యార్థులు మాట్లాడుతూ తమకు స్టై పండ్ తో కూడిన ఇంటర్న్షిప్ కల్పించడమే కాకుండా ఏడాదికి 5.2 లక్షల పాకేజీ తో ఉద్యోగాలు పొందడానికి సహకరించిన కళాశాల యాజమాన్యానికి, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్ మెంట్ ఆఫీసర్ సుమయ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వివేకంతో ఆలోచించి మీ అమూల్యమైన
# ఓటుని వినియోగించాలి



**గుంటూరు, మే 11(ఆంధ్రపత్రిక):** గుంటూరు నగర ప్రజలందరూ వివేకంతో ఆలోచించి ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి పాలన అందిస్తూ ప్రజాసంక్షేమ ధ్యేయంగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధి అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తూ ఆదర్శవంతమైన ఆంధ్రప్రదేశ్ను దేశ చరిత్రలో ఒక ప్రత్యేక రాష్ట్రంగా నిలిపి పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వానికి తోడ్పాటున అందించాలని వైసిపి స్టేట్ జనరల్ సెక్రెటరీ బండ్లమూడి రోజా రాణి తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్మోహన్ రెడ్డి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్య తని ఇస్తూ నాడూ నేడు ప్రభుత్వ రంగ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్ని ఒకే గొడుగు కిందకి తీసుకొచ్చి పేదరికంలో ఉన్నటువంటి తల్లిదండ్రులకి చేయూతగా పిల్లల్ని విద్యాపరంగా ప్రోత్సహించేందుకు అమ్మ.ఒడి కార్యక్రమంతో పాటూ మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యాదీవెన, ఇంగ్లీష్ మీడియం బోధన భవిష్యత్తు తరాలకి దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని తెలిపారు. గత ఐదేళ్ళుగా జగన్మోహన్ రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి మహిళలకి ప్రాధాన్యత ఇచ్చారు. అన్నీ సంక్షేమ పథకాలలో కూడా మహిళలకి చేయూతని ఇచ్చారు. రాష్ట్రంలో వారికంటూ ఒక గుర్తింపు, ఆర్థికం గాఎదగడానికి కృషిచేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలి. మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఆకర్షణీయంగా ఉన్న చంద్రబాబు మేనిఫెస్టో హామీలు, కోటలు దాటుతున్న కూటమి మాటలు నమ్మి మళ్ళీ మోసపోవద్దని బాబు బడాయి మాటలు నమ్మితే నట్టేట మునగడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ఇది తాను చెబుతున్న మాట కాదనిచరిత్ర చెప్పిన సత్యమని చంద్రబాబును నమ్మడం అంటే కొండచిలువ నోట్లో తలపెట్టడమే, చంద్రముఖిని నిద్ర లేపడమేనని పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పేవన్నీ విఫల హామీలని విమర్శించారు. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని కోరారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గతంలో తాను చెప్పినవేమీ అమలు చేసిన పాపాన పోలేదని ఆరోపించారు. కనీసం చంద్రబాబు పేరు చెబితే ఏ పేదవాడికైనా కూడా ఆయన చేసిన మంచి కానీ ఏదైనా ఒక స్కీమ్ కానీ గుర్తుకురావడం లేదంటేనే ఆయన మోసాలు, ఆయన పాలనను ఒక్కసారి అందరూ గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. దానికి పూర్తి విరుద్ధంగా వైయస్ జగన్ తాను గత ఎన్నికల సమయంలో చెప్పిందే కాక చెప్పని అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలు కూడా చేపట్టి సుపరిపాలన అందించారని దేశంలోనే కోవిడ్ వంటి కల్లోలాన్ని సైతం సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూసిన ఏకైక ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ నిలిచిన వాస్తవాన్ని ఎవరూ విస్మరించరాదని ఆయన కోరారు. ఎక్కడా ఎప్పుడూ ఎవరూ కనీవినీ ఎరుగని రీతిలో విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టి, కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు నగదు బదిలీ పథకం ద్వారా నేరుగా లబ్ధి చేకూర్చుతూ ప్రతి పేదవాడి మోములో చిరునవ్వులు చూడడం కోసమే ముఖ్యమంత్రి వైయస్ జగన్ చిత్తశుద్ధితో కృషి చేశారని కొనియాడారు.

## పల్నాడు రైతులు గెలవాలంటే
# తెలుగుదేశం పార్టీ గెలవాలి



**గుంటూరు, మే 11(ఆంధ్రపత్రిక):** సత్తెనపల్లి నుండి నరసరావుపేట పట్టణం వరకు ఉమ్మడి కూటమి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రచారం ముగింపు ర్యాలీ ఘనంగా జరిగింది. భారీ ట్రాక్టర్ ర్యాలీతో ఈ కార్యక్రమం జరిగింది. నీటిని తెచ్చుకుంటేనే మన పల్నాడు ప్రజల జీవన గమనం మారేది మనం నీరందించుకోవాలంటే వరికెపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేసుకోవాలి, సాగర్ కుడి కాలవను గోదావరి జలాలతో స్థిరీకరణ చేసుకోవాలి, జల్జీవన్ మిషను పూర్తి చేసుకోవాలి,, ఇవన్నీ నిబద్ధతగా జరగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలి,, చంద్రబాబు నాయుడు గారు సీఎం కావాలి,, మే 13 వ తారీఖున సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందిగా మారబోతున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను తెదేపా అధికారంలోకి రాగానే సమూలంగా పెకిలించి వేస్తుందని అన్నారు. ప్రజలకు భూ సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటామని అన్నారు. పల్నాడు ప్రజలు కులమత వర్గ బేధాలు చూడరని ఎవరైతే మంచి చేస్తారో వారి వైపే నిలబడి గెలిపించుకుంటారని అన్నారు. ప్రజలకు అండగా నిలబడ్డామని, మరో మారు వారికి మంచి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని పలనాటి ప్రజలంతా మా వైపే ఉన్నారన్న నమ్మకం మాకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఎవరి బలవంతంగానో ఇక్కడ పోటీ చేయట్లేదని, ఈ ప్రాంతం పైన మక్కువతో, అభివృద్ధిపై ఇష్టంతో ఇక్కడ పోటీ చేస్తున్నానని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రలోభాలకులోనై
# భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



**గుంటూరు, మే 11 (ఆంధ్రపత్రిక):** గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న ప్రధాన పార్టీలు ఓటర్లను ఎన్నో విధా లుగా, ఎంతగానో ప్రలోభ పెడుతున్నాయని, ఆ ప్రలోభాలకులోనై వ్యక్తిగత, రాష్ట్ర, దేశ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ టి. సేవ కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఓటర్లకు పిలుపునిచ్చారు. కులం,మతం పార్టీ, డబ్బు ,మద్యం, అమలు సాధ్యంగానీ సంక్షేమ పథకాలు వంటి ప్రలోభాలకు లోనై ఓటు వేస్తే మన భవిష్యత్తు అధోగతి పాలవుతుందనీ డాక్టర్ టి. సేవ కుమార్ హెచ్చరించారు. ప్రతి ఓటరు వాస్తవ పరిస్థితులను బాగా ఆలోచించి, పోటీ చేస్తున్న అభ్యర్థులందరినీ అధ్యయనం చేసి సేవా దృక్పథం గల మంచి వ్యక్తులకు ఓటు వేసి గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఇప్పుడు పొరపాటు చేస్తే ఐదేళ్లు ఆ ఫలితం అనుభవించక తప్పదు అన్నారు. ఇప్పటికే మధ్యతరగతి ప్రజల బ్రతుకు ఎంతో భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితులు మారాలంటే ఓటు ఒక్కటే ఆయుధమన్నారు. ఆ ఆయుధాన్ని ప్రలోభాలకులోను కాకుండా సక్రమంగా వినియోగిస్తే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందని డాక్టర్ టి. సేవ కుమార్ అన్నారు.

## ఓటు హక్కు ఇచ్చిన మహానేతను
# మరచిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

**చెన్నేకొత్తపల్లి, మే 11 (ఆంధ్రపత్రిక):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ మహనీయుడు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 325, అలాగే ఆర్టికల్ 326ల ద్వారా భారత దేశంలో జన్మిం చి 18 సంవత్సరాల వయసు పూర్తి అయిన ప్రతి ఒక్కరికి భారత దేశంలో పార్లమెంటుకు, రాష్ట్ర శాసనసభ లకు జరుగు ఎన్నిక వయోజన హక్కు ప్రతిపాధికన జరుపవలెను. వయోజన ఓటు హక్కు అనగా ప్రభుత్వం నిర్ణయించే తేదీ నాటికి 18 సంవత్సరములు వయస్సు నిండిన పతి పౌరుడు ఓటు హక్కును కలిగి యుండాలని పార్లమెంటు ఉభయసభల ఎన్నికల కొరకు, రాష్ట్ర ఉభయ సభల ఎన్నికల కొరకు ఏర్పరచిబడిన ప్రతి ప్రాదేశిక నియోజకవర్గ మునకు ఒక సాధారణ ఓటర్ల జాభితా ఉండవలెను .మత, జాతి, కుల, లింగ భేదముల కారణంగా ఓటర్ల జాబితాలో చేర్చికొనుటకు ఎవ్వరిని అనర్హులుగా చేయకూడదని రాజ్యాంగములో ఆదేశిం చారు. మనకు భారత రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు కలిగి యున్నది కాబట్టే ఆయా రాజకీయ పార్టీల నాయకులు, స్వతంత్ర అభ్యర్థులు ప్రస్తుతం మన రాష్ట్రంలో జరుగుతున్న ఎం.పి, అలాగే ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచి పదవులలో కూర్చోవడానికి ఒక్కొక్క అభ్యర్థి ఎన్నికల కోడ్ అమలైనది మొదలుకొని ఓటర్లను తమ వైపు ఆకర్షించి కొనేందుకు ప్రచారాల పేరుతో లక్షలాది రూపాయిలను ఖర్చు చేస్తున్నారు.ఆయా గ్రామాలకు ప్రచారం నిమిత్తం వచ్చినప్పుడు ఆయా గ్రామాల ఆయా రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు ద్వారా పూల వర్షం కురూపించుకోవడానికి, ఘన స్వాగతం పలకడానికి, పటాకులకు, తప్పెట్లు, మేళాలకోసము, అలాగే సమావేశాలకు, ఎన్నికల ప్రచారంలో ప్రజలు పాల్గొనడా నికి చికెన్ బిర్యానీలు, బ్రాందీల కోసం అలాగే ఓటర్లకు డబ్బును సహితం కొంతమంది అభ్యర్థులు ఓటర్లకు పంచుతూ కోట్లాది రూపాయిలను ఖర్చు చేస్తున్న అభ్యర్థు లు మాత్రం భారత రాజ్యాంగం ద్వారా ఓటు హక్కును కల్పించిన డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ యొక్క విగ్రహం మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి లో ఉన్నది. అభ్యర్థులు చెన్నేకొత్తపల్లి లోని ఈ విగ్రహము ముందు నుంచే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కానీ ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గ ములో పోటీలో ఉన్న అభ్యర్థులు ఏ ఒక్కరూ కూడా అంబెద్కర్ యొక్క విగ్రహానికి ఒక్క పూలమాల కూడా ఒక్క రోజు కూడా వేయలేదు. ఈ విషయమై చెన్నేకొత్తపల్లి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలందరు బహిరంగంగా అభ్యర్థుల ను విమర్శిస్తున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన అభ్యర్థులు మా పాలనలో మీకు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా,ఎంతగానో మీకు మేలు చేసాము, మేము చేసిన అభివృద్ధి ని మరవకుండా ఈ ఎన్నికల్లో మాకు మాత్రమే ఓటు వేయాలని అభ్యర్థించిన వీరు మాత్రం వీరు ఆయా రాజకీయ పార్టీలలో చేరడానికి,పదవులలో కూర్చొని పాలకులుగా ఉండడానికి, కోట్లాది రూపాయల ఆస్తులను సంపాదించుకువడానికి ఓటు హక్కు ద్వారా అవకాశం కల్పించిన డాక్టర్ బి ఆర్ అంబెద్కర్ ను పట్టించుకోని ఆయన విగ్రహానికి పూలకుడా వేయని వీరిని మేము మరచిపోతే తప్పేంటని చెన్నేకొత్తపల్లి మండల ప్రజలు ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రశ్నిస్తున్నారు.



# రాష్ట్ర మంతా ఫ్యాను గాలే
## టీడీపీకి మరోసారి భంగపాటు తప్పదు



**గుంటూరు, మే 11 (ఆంధ్రపత్రిక):** రాష్ట్రమంతా ఫ్యాను గాలే వీస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. స్థానిక 35వ డివిజన్లో మనతో మన రజినమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. స్థానిక పట్టాభిపురం స్వామి థియేటర్ నుంచి ప్రారంభమైన ప్రచారం ఒకటో లైను, రెండో లైను, మూడో లైను మీదుగా రవీంద్రనగర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్రెడ్డి అంటేనే ఒక నమ్మకం అని చెప్పారు. 2019 మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను 99 శాతం పూర్తిచేసిన గొప్ప నాయకుడు జగనన్న అని తెలిపారు. విద్య వైద్యం, వ్యవసాయ రంగాల్లో అద్వితీయ సంస్కరణలు తీసుకొచ్చి రాష్ట్ర భవితకు కొత్త మార్గం జగనన్న చూపారని పేర్కొన్నారు. మరోవైపు చంద్రబాబునాయుడు మేనిఫెస్టోను చిత్తుకాగితంతో సమానం చూస్తారని తెలిపారు. 2014 మేనిఫెస్టోను చెత్త బుట్టలో వేసి పచ్చి మోసం చేశారని ధ్వజమెత్తారు. మళ్లీ ఇప్పుడు సూపర్ మోసానికి తెరలేపారని పేర్కొన్నారు. 2024 మేనిఫెస్టోలో అసాధ్యమైన హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు. 2014లో ఇదే చంద్రబాబు నాయుడు, మోడీ, పవన్కల్యాన్ కూటమిగా ఏర్పడి ఇంటింటికీ పంపిన పాంప్లెట్లో ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోయారని ధ్వజమెత్తారు. అందుకే ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకే ఓటేసి నమ్మకానికి ప్రతిరూపమైన జగనన్నను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడికి కూడా ఓటమి భయం బాగా పట్టుకుందని, అందుకే కుట్రలకు తెరలేపారని ధ్వజమెత్తారు. అవ్వాతాతలకు ఇంటికే పింఛన్లు వస్తుంటే వాటిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు కూడా అమలు కాకుండా అడ్డుకున్నారని దుయ్యబట్టారు.

**పథకాలను అడ్డుకోవడం దుర్మార్గం: ఎమ్మెల్యే మద్దాలి గిరి**

ప్రభుత్వ పథకాలను అడ్డుకోవడం ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాపం మూటగట్టుకున్నారని స్థానిక ఎమ్మెల్యే మద్దాలి గిరి పేర్కొన్నారు. వారు ఆపింది పథకాలను కాదని, అవ్వాతాతల ఆయుష్షునని చెప్పారు. అక్కచెల్లెమ్మల సంతోషాన్ని అడ్డుకున్నారని దుయ్యబట్టారు. రైతన్నలు, విద్యార్థుల భవిష్యత్తును అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్చార్జి టీఎల్ వీ ఆంజినేయులు, డివిజన్ నాయకులు గుంజర ప్రభుదాసు, మాణిక్యరావు, గంగాధర్, గట్టం అంజి, దేవదానం, పేరూరి అజయ్, పవన్కుమార్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్చార్జులు, అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు
# ఎన్నికలప్పుడే బీసీలు గుర్తొస్తారు




**గుంటూరు, మే 11 (ఆంధ్రపత్రిక):** బీసీలకు ఏ రాజకీయ పార్టీ కూడా అంతగా ప్రాధాన్యత ఇచ్చిన దాఖలాలు చరిత్రలో లేదని, సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చి వారిని అక్కున చేర్చుకున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. ముదిరాజ్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు గూడూరి నానిముదిరాజ్ ఆధ్వర్యంలో చుట్టుగుంటలో ముదిరాజుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో బీసీలు, మహిళలు అధికశాతం సీఎం వైఎస్ జగన్ వైపే ఉన్నారని, ఆ విషయం గ్రహించే అక్కసుతో చంద్రబాబు తన మనుషులతో మహిళలు, బీసీలపై దాడులు చేయిస్తున్నారని ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ కూడా బీసీల కు అత్యంత ప్రాధాన్యత కల్పించలేదని బీసీలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధి అభ్యున్నతికి తోడ్పాటునందించిన జగన్మోహన్ రెడ్డి నాయకత్వానికి ప్రజలందరూ మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న విడదల రజిని తొలుత సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువై, తర్వాత ఎమ్మెల్యేగా గెలిచి చిలకలూరిపేట అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా విలక్షణమైన పనితీరుతో తన సమర్ధతను నిరూపించుకున్నారని వివరించారు. ఇంకో పక్క గుంటూరు పార్లమెంటు స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగిన కిలారి రోశయ్య ఎమ్మెల్యేగా పొన్నూరు సమగ్రాభివృద్ధికి కట్టుబడిన తీరు అందరికీ తెలిసిందేనని చెప్పారు. ఇద్దరూ కూడా ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా నిరంతరం ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో పని చేసే వారేనని కొనియాడారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రెండు ఓట్లు వైసీపీ అభ్యర్థులకే వేసి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిని చేసే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నానీ ముదిరాజ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడికి ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలు గుర్తొస్తారని, అధికార పీఠంపై కూర్చున్నాక బీసీలను కాళ్ల కింద చెప్పుల్లా చూస్తారని తెలిపారు. చంద్రబాబు సీఎంగా ఉండగా నాయీ బ్రాహ్మణులు సచివాలయంలో కలిస్తే తోకలు కట్ చేస్తా అన్నాడని, బీసీలు జడ్జిలుగా పనికిరారని లేఖ రాశాడని, ఇటువంటి నీచ బుద్ధి గల చంద్రబాబు ఎన్నికలు రాగానే మళ్లీ బీసీ జపం చేస్తున్నాడని, ఆ కొంగ జపాలను బీసీలు నమ్మరని స్పష్టం చేశారు. మేనిఫెస్టోను అమలు చేయకుండా చివరకు వెబ్సైట్ నుంచి తొలగించిన దొంగ, మోసకారి చంద్రబాబు అని అన్నారు. సీఎం జగన్ మేనిఫెస్టో ను పవిత్ర గ్రంథంలా భావించి, ఆచరణలో అమలు చేసి చూపించారన్నారు. పాదయాత్రలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి, అధికారంలోకి రాగానే దానిని ఆచరించి చూపించారని, బీసీలకు ఉన్నత పదవులిచ్చి ఎనలేని గౌరవం కల్పించారన్నారు. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలందరూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మట్టి కరిపించి, జగన్మోహన్ రెడ్డిని మళ్లీ అధికార పీఠం మీద కూర్చోబెడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు తాతబోయిన మల్లిఖార్జున, తూటుపల్లి లక్ష్మణ్, నాగరాజు, పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో నంబూరు టాప్

**క్రోసూరు: మే 11 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల ప్రచారంలో చివరి రోజు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు టాప్ గేర్ లోకి వెళ్లారు. అమరావతి అమరలింగేశ్వరుని సాక్షిగా ప్రారంభమైన ర్యాలీ ప్రతి గ్రామంలో అపూర్వ స్వాగత సత్కారాల మధ్య సాగింది లింగాపురం, బలసుపాడు, పరస, 75 త్యాళ్లూరు, పెదకూరపాడు, లగడపాడు, గారపాడు, అందుకూరు మీదుగా క్రోసూరు వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కి బ్రహ్మరథం పట్టారు. హారతులు ఇస్తూ సత్కరించారు. ప్రతి గ్రామంలో అపూర్వ స్వాగతం అందించారు. ర్యాలీ పొడవునా జై జగన్, జై శంకరన్న నినాదాలతో దిక్కులు పిక్కటిల్లేలా గర్జించారు. జన ప్రభంజనం మధ్య సాగిన భారీ ర్యాలీ విజయ యాత్రను తలపించింది. గత ఎన్నికల్లో భారీ మెజారిటీ ఇచ్చి గెలిపించిన పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని పెదకూరపాడు శాసనసభ్యులు, వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు అన్నారు. ర్యాలీలో ప్రజలనుద్దేశించి ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. గత ఐదేళుగా కుటుంబాన్ని వదిలే ప్రజలే కుటుంబంగా భావించి సేవ చేశానన్నారు. గతంలో మూడు దశాబ్దాల్లో జరగని అభివృద్ధిని.. సీఎం జగన్ ప్రోత్సాహంతో ఐదేళ్లలో చేసి చూపించానన్నారు. అమరావతి బెల్లంకొండ రోడ్డు పూర్తి కాబోతుందన్నారు. క్రోసూరుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ తెప్పించానన్నారు. నియోజకవర్గంలో 27 కోట్లతో ఆస్పత్రులు నిర్మించామన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు నిర్మించామన్నారు. అచ్చంపేటలో గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు తెచ్చి ఎడ్యుకేషనల్ హబ్గా మార్చామన్నారు. కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ దశ దాటించామన్నారు. ఆ బ్రిడ్జి పూర్తైతే అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలు ఆర్థికంగా బలపడతాయన్నారు. అమరావతి తుళ్లూరు డబుల్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. తాను చేసిన అభివృద్ధిలో కనీసం నాలుగో వంతు అయినా టీడీపీ హయాంలో జరిగిందా అని ప్రశ్నించారు. సీఎం జగన్ నవరత్నాలతో ప్రతి ఇంటికి సంక్షేమం అందించామన్నారు. అమ్మ ఒడి, చేయూత, రైతు భరోసా, ఆసరా వంటి పథకాలతో ప్రతి ఒక్కరినీ ఆదుకున్నామన్నారు. మన సంక్షేమ పథకాలను విమర్శిం చిన చంద్రబాబు ఇప్పుడు అవే ఇస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అవుతుందన్న బాబుకు మరి అవే పథకాలు ఆయన ఇస్తే సింగపూర్ అవుతుందా అని ప్రశ్నించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ప్రతి గ్రామా నికి సాగునీరు ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు ఇవ్వడే తన లక్ష్యమన్నారు. పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నాగిరెడ్డి పాలెం చెరువుకు నీళ్లు తెచ్చి కెనాల్స్ ద్వారా అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు మండలాలకు తాగునీరు, సాగునీరు అందించే బాధ్యత తనది అని చెప్పారు. సీఎం జగన్ సంక్షేమ పాలన చూసిన ప్రజలు టీడీపీ పాలనకు, తమ పాలనకు తేడా చూడాలన్నారు.

పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని హెచ్చరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా అనిల్ కుమార్ యాదవ్ని గెలిపించాలని కోరారు. భారీ ర్యాలీలో ప్రచారంలో నంబూరు శంకరరావు వెంట ఆయన కుటుంబసభ్యులు అందరూ కలిసి వచ్చారు. సతీమణి నంబూరు వసంతకుమారి, కుమార్తెలు తులసి, లహరి కోడలు శ్రీవల్లితో పాటు మనవడు మనన్న శంకర్ కూడా పాల్గొని శంకరరావుని గెలిపించాలని కోరారు.



## ఉపాధిహామీ కూలీల సమస్యలు

# సత్వరంగా పరిష్కరిస్తాం

### గడ్డి కృష్ణారెడ్డి సతీమణి గడ్డి రోజారాణి వెల్లడి



ఎ. కొండూరు మే 11 ( ఆంధ్రపత్రిక) ; ఎన్డీయే కూటమి బలపరిచిన తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్ విజయాన్ని కాంక్షిస్తూ శనివారం ఎన్నికల ప్రచారంలో గడ్డి కృష్ణారెడ్డి సతీమణి గడ్డి రోజా రాణి ఉపాధి హామీ కూలీలను కలుసుకొనివారి సమస్యలను శనివారం అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకుకనీసమౌలిక వసతులు కల్పిస్తున్నారా మజ్జిగ త్రాగునీరు టెంట్ ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో రాగానే కొలికిపూడి శ్రీనివాసరావు చదువుకున్న యువతీ యువకులకు విద్యారంగంలో పెద్ద పీట వేసి వారి ఆర్థికా భివృద్ధికి కృషి చేస్తారని ఈ సందర్భంగా గడ్డి రోజారాణి పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు రోజువారి వేతనం సకాలంలో అందిస్తున్నారా కూలీలను అడిగి తెలుసుకున్నారు. మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తిరువూరు నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి అభ్యర్థిగా కొలికపూడి శ్రీనివాసరావు పోటీ చేసి ఉన్నారని ఈనెల 13వ తేదీనజరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ పవిత్రమైన అమూల్యమైన ఓటు ముద్రను విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి ఉన్న కేసినేని శివనాథ్(చిన్ని) కొలికపూడి శ్రీనివాసరావును సైకిల్ గుర్తుపై మీ పవిత్రమైన అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు అంతకుముందు ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఓంటేరు రామారావు చందు నాని మల్లాది చంటి మహిళా నాయకులు కార్యకర్తలు వందలాదిగా పాల్గొన్నారు ప్రజల నుండి విశేష స్పందన లభించింది

## ఎన్డీయే కూటమితోనే

# రాష్ట్రాభివృద్ధి సాధ్యం

### యునైటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల జవహర్



**విజయవాడ, మే 11, (ఆంధ్రపత్రిక) :** ఎన్డీఏ కూటమి విజయంతోనే భారతదేశం ,ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి చెందుతాయని యునైటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్టేట్ ప్రెసిడెంట్ అప్పికట్ల జవహర్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన తిరువూరు నియోజకవర్గ పరిధిలోని విస్సన్నపేటలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో జవహర్ మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి రానుందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. చంద్రబాబు సీఎం అవ్వాలని రాష్ట్ర ప్రజలంతా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎన్డీఏ కూటమి క్లీన్ స్వీప్ చేస్తుందన్న ధీమాని వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్ (చిన్ని) ఘన విజయం సాధించబోతున్నారని చెప్పారు. అలాగే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు అప్పికట్ల కుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఎస్ కే యాసిన్, జనరల్ సెక్రెటరీ కనపర్తి రమేష్ ,స్టార్ క్యాంపెయినర్ నాయకులు గుడిసె పాల్ రాజ్, జనసేన జనరల్ సెక్రటరీ తోట కిషోర్ ,యునైటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ట్రెజరర్ వంగూరి చంటి తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుని మృతి

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**ఎ. కొండూరు మే 11 (ఆంధ్రపత్రిక) ;** ఇబ్రహీంపట్నం.. జగదల్పూర్ జాతీయ రహదారి పై ఎ. కొండూరు మండలం గోపాలపురం గ్రామ సమీపంలో శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఇది పోలీసులు తెలిపిన కథనం ప్రకారం విజయవాడ వైపు నుండి తిరువూరు మోటార్ బైక్ పై వెళుతున్న నల్లగట్ల అఖిల్ తేజ (19) ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గోపాలపురం గ్రామ సమీపంలో మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎ. కొండూరు ఎస్ ఐ చల్లా కృష్ణ కేసు నమోదు చేసి విఆర్ఓ వెంకటేశ్వరమ్మ శవాన్ని శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ ఐ. చల్లా కృష్ణ తెలిపారు.

# పెడనలో ఎస్ వి బాబు ఎన్నికల ర్యాలీ



**పెడన 11మే (ఆంధ్రపత్రిక) ;** ఈనెల 13 న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పెడన నియోజవర్గం నుండి పోటీ చేస్తున్న ఎస్ వి బాబు ఈరోజు పెడన పట్టణం శివారులోని బ్రహ్మపురం హనుమాన్ టెంపుల్ లో పూజ చేసి అనంతరం ర్యాలీగా గుడివాడ రోడ్డు మసీదు వరకు అక్కడనుండి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. పెడన నియోజవర్గ అభివృద్ధి తన లక్ష్యం అని ఎస్ వి బాబు తెలియజేశారు. చేనేత మరియు కలంకారి సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారు. చేనేత మరియు కలంకారి అభివృద్ధి కొరకు కృషి చేస్తారని తెలియజేశారు. మైనార్టీ సోదరుల అవసరాలను ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే పట్టించుకోలేదని తెలియజేశారు. దళితుల అభ్యుదయమే ధ్యేయంగా పని చేస్తారని మాట ఇచ్చారు. జరగబోయే ఎన్నికల్లో నోటుకు ఓటు వేయకుండా, మీ కోసం మీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేసే నిజాయితీపరుడు కి ఓటు వేయవలసిందిగా సూచించారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని సర్వతో ముఖాభివృద్ధి చేస్తానని తెలియజేశారు.

## బిజెపి పశ్చిమ అభ్యర్థి సుజనాచౌదరిని గెలిపించండి

### బిజెపి నాయకులు పోతిన వెంకటేశ్వరరావు



**విజయవాడ పశ్చిమ, మే 11, (ఆంధ్రపత్రిక) :** పశ్చిమ నియోజకవర్గ ఎన్డీయే కూటమి బిజెపి అభ్యర్థి వై. సుజనా చౌదరిని గెలిపించాలని ప్రజలకు బిజెపి నాయకులు పోతిన వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం సుజనాచౌదరి రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పోతిన వెంకటేశ్వర రావు మీడియాతో మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడం ఖాయమని అన్నారు. పశ్చిమ నియోజకవర్గ సమస్యలపై సుజనాచౌదరికి పూర్తి అవగాహన వుందన్నారు. పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దగల సత్తా సుజనాకు ఉందని అన్నారు. పశ్చిమ నియోజకవర్గం సమగ్రాభివృద్ధి కోసం బృహత్తర ప్రణాళికతో సిద్దమైన సుజనా చౌదరి కేంద్రంలో తనకు వున్న పలుకుబడితో పశ్చిమను అభివృద్ధిచేయగలరన్న నమ్మకం వుందన్నారు.కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం రాష్ట్రంకోసం మరింతగా సహకరించేలా చూడగల పరిచయాలు సుజనాచౌదరికి వున్నాయన్న నమ్మకం పశ్చిమ ప్రజల్లో కనబడుతున్నదని పోతిన అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్దంగా వున్నారని ఆయన స్పష్టంచేసారు.

### వృద్దులు,అనాధలకు,దివ్యాంగులకు,వితంతువులకు,వ్యాధిగ్రస్తులకు

# మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**మైలవరం, మే 11: (ఆంధ్రపత్రిక):** మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ స్ట్ ఆధ్వర్యంలో వృద్ధులు, అనాధలు, దివ్యా ంగులు, వ్యాధిగ్రస్తులకు మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులను శనివారం మైలవరంలోని ట్రస్ట్ కార్యాలయంలో పంపిణీ చేశారు.ట్రస్ట్ అధ్వర్యంలో ప్రతినెలా నిత్యావసర వస్తువులు,బియ్యం పంపిణీ చేస్తున్న ట్లు ఆమె పేర్కొన్నారు. ఈ రోజు మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం లో వృద్దులకు,వ్యాధిగ్రస్తులకు బియ్యం, నిత్యావసర అందించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ తిండిలేక ఆకలితో ఎవరు ఇబ్బంది పడకూడనే ఉద్దేశ్యంతో తమ సంస్థ ద్వారా గతకొన్ని సంవత్సరాలు ప్రతి నెలాఇలా అందిస్తున్నామని ఎవరైన అపదలో ఉంటే తమ సంస్థను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా ఆమె అన్నారు.ఈ కార్యక్రమం లో ట్రస్ట్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# అమరావతికే ఓటేద్దాం !



**అమరావతి 11మే (ఆంధ్రపత్రిక) ;** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అనే పేరు నామవాచకం కాదు. సర్వనామం. ఐదేళ్ల వైకాపా పాలనలో ఆది నుంచి చివరి దాకా దిక్కులు పిక్కటిల్లేలా రాష్ట్రమంతటా వినిపించిన ఏక నినాదం అమరావతి. రాష్ట్రంలో ప్రగతి రథచక్రాలు నిలిచిపోవడానికీ, నమ్మిన నేలలను ఇచ్చిన రైతులు రోడ్లపై పాదయాత్రలు చేయటానికీ, రైతు మహిళలపై పోలీసుల దాష్టీకాలకు, కేసులకు, అరెస్టులకు, జైళ్ళకు ముఖ్యకారణం ముఖ్యమంత్రి తీసుకున్న అమరావతి విధ్వంసం. ఈ ఎన్నికల్లో ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా అంతర్లీనంగా 4 కోట్ల 14 లక్షల మంది ఓటర్ల మస్తిష్కంలో ప్రభావం చూపే ప్రధానమైన అంశం అమరావతి రాజధాని అంశం . అమరావతి ఉంటేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యం అన్నది పచ్చి నిజం. విపక్షాలు రాజధాని అంశాన్ని ఉమ్మడి మేనిఫెస్టోలో పెట్టడానికి కారణం కూడా ఇదే. శాసనాల ద్వారా, చట్టాల ద్వారా, సిఆర్ డి ఎ ఒడంబడికల ద్వారా నిర్మితమైన రాజధానిని ధ్వంసం చేయటం, అడవి కాసిన వెన్నెల చేయటం ప్రజాస్వామ్యంలో మహా చట్ట విరుద్ధం. ముఖ్యమంత్రి ఎలాంటి తణుకు, బెణుక లేకుండా ఆ పాపానికి ఒడి గట్టారు. మళ్లీ మూడు రాజధానులు అంటూ మూర?పు నిర్ణయానికే కట్టు బడ్డారు. తాను మళ్ళీ అధికారంలోకి వస్తే, విశాఖ ఋషికొండపై కూర్చుంటానని చెప్పేశారు. అంటే రాయలసీమ, ఉత్తరాంధ్ర, మధ్యాంధ్ర చెందిన మూడు ప్రాంతాల ప్రజల మధ్య విభజన గీతలు గీస్తే, రాజకీయంగా బాగుపడదామనే తలంపులో నుంచి బయటకు రాకపోవడం మోసానికి మించిన మహా మోసం. రాజధాని లేకపోవడం కారణంగా అధికంగా రోడ్డున పడ్డది బహుజన కులాల వారే. 2019 కి ముందు రాజధానిలో పనిచేస్తున్న దాదాపు 40 వేల మంది కార్మికులను ముఖ్యమంత్రి వెళ్లగొట్టారు. ఆగర్లు తీసేవారు, సీలింగ్ పనులు చేసేవారు, కరెంటు పనులు చేసేవారు, నిర్మాణ పనులు చేసేవారు, అందరూ దాదాపు 40 రకాల పనివారలు పనిముట్లు వదిలేసి వెళ్లిపోయారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన బహుజన కులాలు వారు కూడా మిగిలిన పెద్ద కులాల రైతులతో పాటు రోడ్లపైకి వచ్చారు. ఆఖరికి రాజధాని కోసం ఇచ్చిన భూములను ఈ వేలం ద్వారా అమ్మే ప్రయత్నాలు బాగా జరిగాయి. రాజధాని కోసం ఇచ్చిన రైతుల భూములను సెంటు పట్టాలుగా మార్చి ఇళ్ల పట్టాల పేరుతో కులాల మధ్య వైషల్యాలు కూడా సృష్టించారు. న్యాయస్థానాలు అడ్డుపడకపోతే, రాజధాని భూముల అమ్మకం ముగిసేది. అమరావతి అంటే చంద్రబాబు బినామీలది అంటూ పదేపదే అబద్ధాలు చెప్పే ముఖ్యమంత్రి ఐదేళ్లపాటు ఎక్కడ ఉన్నారు? ఎక్కడ నుంచి పాలన చేశారు? చంద్రబాబు కట్టిన అసెంబ్లీ, సచివాలయం, న్యాయస్థానం నుంచే కదా ! పాలన చేశారు. ఆ రాజధానికే కదా ! స్మశానం, ఎడారి అంటూ పేర్లు పెట్టారు. భూమి ఇచ్చిన రైతులనే కదా ! వ్యాపారులని, స్వార్ధపరులని, కమ్మవారని నిందించారు. ఇలాంటి ఘోరాన్ని, నేరాన్ని తప్పు పట్టిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ లాంటి వారిని పార్టీ నుంచి బయటికి పంపించేశారు. తాను చేసుకున్న నిర్ణయానికి జీ హుజూర్ అనే వారే తన పార్టీ లో ఉండాలని, లేకపోతే పార్టీ వీడి వెళ్ళిపోవాలనే నిబంధన విధించారు. 2019 కి ముందు అమరావతి అందరిదీ అని, అమరావతి అమ్మ లాంటిది అన్న ముఖ్యమంత్రి, 2019 తర్వాత అధికారంలోకి రాగానే అమరావతిని 'నీ యమ్మ' అని అమరావతి కొందరిది మాత్రమే అంటూ మాట మార్చారు. ఇలాంటి పోకడ పాలకులకు ఉండటం ప్రజాస్వామ్యానికే ప్రమాదం. పవిత్రమైన ప్రజాస్వామిక ఎన్నికల వేళ... ప్రజలు గుర్తుంచుకోవాల్సిన ప్రధానమైన అంశం అమరావతి. నాయకుడంటే నమ్మకం ఉండాలనీ, నాయకుడు అంటే విశ్వసనీయ ఉండాలని, రామకోటి రాసినట్లుగా, హనుమాన్ చాలీసా చెప్పినట్లుగా , పది ఆజ్ఞలను వల్లెవేసినట్లుగా చెప్పే ముఖ్యమంత్రి మాట తప్పారు. మాట మార్చారు. నమ్మకం, విశ్వసనీయ రెండూ కోల్పోయారు. ఈ అంశాలన్నిటినీ ఓటర్లు తెలుగు ప్రజల ఆత్మగౌరవ చైతన్యంతో మదిన నింపుకోవాలి. ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2019లో జరిగిన పొరపాటు, చారిత్రాత్మక తప్పును సరిదిద్దుకునే భాధ్యత ఓటర్ల పైనే ఉంది. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో ఐదేళ్ళకు జరిగే ఎన్నికలే రాష్ట్ర భవిష్యత్తుకు, ప్రజల భవితవ్యానికి ప్రతీక . అందుకేనేమో, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 'దేశ ప్రజలారా! మీకు నేను ఆయుధాలను ఇవ్వటం లేదు. ఓటు అనే చైతన్యం ఇస్తున్నాను. ఆ చైతన్యంతో మీ తలరాతలను మార్చుకుంటారో, తారుమారు చేసుకుంటారో.... మీరే నిర్ణయించుకోండి' అనే సందేశం ఇచ్చారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా అంబేద్కర్ సందేశాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. రాష్ట్రంలో మార్పు దిశగా ఓటేసి, అమరావతిని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎంపీగా కేశినేని చిన్ని, ఎమ్మెల్యేగా సుజనాని గెలిపించండి

### టిడిపి మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్



**విజయవాడ పశ్చిమ, మే 11, (ఆంధ్రపత్రిక) :** ఐదేళ్లుగా జగన్ పాలన మాఫియా పాలనగా సాగిందని, అన్ని వర్గాల ప్రజలను జగన్ మోసం చేశారని, ప్రజలు మళ్ళీ మోసపోవద్దు అని టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్మెస్ బెగ్ పిలుపు ఇచ్చారు. భవానీపురం బీజేపీ ఎన్నికల కార్యాలయంలో ఆయన విలేకరుల తో మాట్లాడారు. లాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో నల్ల చట్టాన్ని తీసుకు వచ్చి ప్రజల ఆస్తులను కొల్లగొట్టాలని జగన్ ప్రణాలికలు సిద్ధం చేసుకున్నారని ఆయన కుట్రలను నిరోధించాలంటే మళ్ళీ చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరచవలసిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ పశ్చిమ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి)నీ, ఎంపి అభ్యర్థి కేశినేని చిన్నినీ భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య మాట్లాడుతు సైకో జగన్ పాలన అంతం కావాలని, నల్ల చట్టం రద్దు కావాలంటే చంద్రబాబు నాయుడు సిఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని, భారీ మెజార్టీతో వెస్ట్ బీజేపీ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) నీ గెలిపించాలని కోరారు.మాజీ కార్పొరేటర్ సుఖాసి సరిత మాట్లాడుతు జగన్ కు బుద్ధి చెప్పే రోజుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, మహిళలను మోసం చేసిన జగన్ నీ ఇంటికి పంపించేందుకు అంతా రెడీగా ఉన్నారని మండిపడ్డారు.

### సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్‌లను సందర్శించిన

# పార్లమెంట్ పోలింగ్ అబ్జర్వర్



**బంటుమిల్లి 11 మే (ఆంధ్రపత్రిక) ;** మచిలీపట్నం పార్లమెంట్ పోలీస్ అబ్జర్వర్ అయిన అక్కనూరు ప్రసాద్ ప్రహ్లాద్ ఐపీఎస్ బంటుమిల్లికి విచ్చేసినారు. ఎన్నికల సందర్భంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను సందర్శించినారు మరియు ఎన్నికలలో ఎటువంటి మద్యం, డబ్బులు పంచకుండా చూడాలని సూచనలు జారీచేసినారు. పెడన అసెంబ్లి పోలీస్ ఇంచార్జ్ డి స్ పి ఎం. రమేష్ బాబు , పెడన సర్కిల్ ఇన్స్పెక్టర్ కె నాగేంద్ర ప్రసాద్ మరియు బంటుమిల్లి ఎస్ఐ జి వాసు పాల్గొన్నారు

## కుప్పు స్వామి చౌదరి ఖ్యాతిని పెంచుతున్న జెకెసి కళాశాల

### రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ వి ఆర్ కె కృపాసాగర్




**గుంటూరు : మే 11 (ఆంధ్రపత్రిక) ;** మనిషి సమగ్ర వికాసానికి విద్య మాత్రమే దోహదం చేస్తుందన్న స్పృహతో 56 సంవత్సరాల క్రితం జాగర్లమూడి కుప్ప స్వామి స్ఫూర్తితో నెలకొల్పిన జెకెసి కళాశాల ఖ్యాతి ఖండాంతరాలకు విస్తరించటం అభినందనీయమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ వి ఆర్ కె కృపాసాగర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జాగర్లమూడి కుప్ప స్వామి చౌదరి డిగ్రీ కళాశాల 56వ వార్షికోత్సవం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల మూల స్తంభాలైన కీర్తిశేషులు జాగర్లమూడి చంద్రమౌళి జాగర్లమూడి నరేంద్రనాథ్ విగ్రహాలకు పూలమాలల లు వేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి కృపాసాగర్ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యా జ్ఞానం అనంతంగా విస్తరించిందని దానిని అందుకుంటూ విద్యార్థులు సమగ్ర వికాసంతో వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఉద్బోధించారు. కేవలం ర్యాంకులు మార్కులతో కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు శారీరక మానసిక వికాసానికి దోహదపడే క్రీడలు, పోటీ పరీక్షల పట్ల ఆసక్తి కనపర్చాలని కోరారు. కళాశాల కార్యదర్శి, కార్య నిర్వహణ అధికారి జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ కళాశాల ఆడిటోరియంను తీర్చిదిద్దుతున్నట్లు తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల పాలక మండలి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా యు జి సి ఏ గ్రేడ్ గుర్తింపు పొందుతూ విద్యా ప్రమాణాల స్థాయిని నిలబెడుతున్నదని వివరించారు. కార్యక్రమంలో స్నాతకోత్సవ స్థాయి సంచాలకులు శరణు రామకృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటూరి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ పరుచూరి గోపీచంద్ పాలకమండలి సభ్యులు, విశ్రాంత అధ్యాపకులు, నగర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## మండలంలో

# గడపగడపకు ప్రచారం పూర్తి చేసిన వైసిపి



**ఆగిరిపల్లి, మే 11 (ఆంధ్రపత్రిక) ;** ఆగిరిపల్లి మండలం వైసిపి అధ్యక్షుడు పలగాని నరసింహారావు ఈరోజు ఆంధ్ర పత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలంలోనీ అన్ని గ్రామాలలో గడపగడపకు ప్రచారం పూర్తి చేశామని, ప్రచారంలో మేమే ముందున్నామని, ప్రజలలో జగనన్న పట్ల మంచి స్పందన వచ్చిందని, జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల గురించి, బీద బలహీన వర్గాలకు ఆయన చేసిన మేలును గురించి వివరించామని తెలుపుతూ మరల నాలుగవసారి ఎంఎల్ఏ గా మేకా వెంకట ప్రతాప్ అప్పారావు , ఎంపీగా సునీల్ కుమార్ యాదవ్ మరియు ముఖ్యమంత్రిగా జగనన్నను మంచి మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు

## పేదవాడి భవిష్యత్తు బాగుపడాలంటే

# ఫ్యాన్ గుర్తుపై ఓటు వెయ్యాలి

- ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి
- చంద్రబాబు ప్రలోభాలకు లొంగొద్దు..

జరుగుతున్న మంచిని పొగొట్టు కోవద్దు

చిలకలరిపేట ఎన్నికల ప్రచార సభలో

సీఎం జగన్




**చిలకలూరిపేట, మే 11(ఆంధ్ర పత్రిక):** చంద్రబాబు అధికారం లోకి వచ్చేదాకా అబద్ధాలు మోసాలు చెబుతారని.. అధికారంలోకి వచ్చాక మాయలు, మోసాలే ఉంటాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా.. శనివా రం ఉదయం చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలో పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో నిర్వహించిన ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన ప్రసంగానికి ముందే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు, ఎంపీ అభ్యర్థి పి అనిల్ కుమార్ యాద్‌లు ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2014లో ఇదే పెద్ద మనిషి చంద్రబాబు నాయుడు ఇదే ముగ్గురితో కలిసి కూటమిగా ఏర్పడ్డారని,. ఈ ఫాంప్లెట్ మీద చంద్రబాబు నాయుడు స్వయంగా సంతకం పెట్టి.. ముఖ్యహామీలంటూ ప్రతి ఇంటికీ పంపించారని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా పనిచేసిన కాలంలో ఇందులో చెప్పినవి ఒక్కటంటే ఒక్కటైనా జరిగిందా? ప్రశ్నించారు. . రైతు రుణమాఫీపై మొదటి సంతకం చేస్తానన్నారు. మరి రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ జరిగిందా?. పొదుపు సంఘాల రుణాలన్నీ రద్దు చేస్తానన్నాడు. రూ.14,205 కోట్లు పొదుపు సంఘాల రుణాల్లో.. ఒక్క రూపాయైనా మాఫీ చేశారా?. మూడో ముఖ్యమైన హామీ.. ఆడ బిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు మీ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నారు. రూ.25 వేల కథ దేవుడెరుగు.. కనీసం ఒక్క రూపాయి అయినా మీ ఖాతాల్లో వేశారా?..అని ప్రశ్న ల వర్షం కురిపించారు. ప్రతి ఇంటికీ ఉద్యోగం అన్నారు. ఉద్యోగం ఇవ్వకపోతే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ప్రతి నెలా అన్నారు. అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు అన్నారు.

చంద్రబాబు హయాంలో చంద్రబాబు మీలో ఏ ఒక్కరికైనా కూడా ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చారా? అని మీ బిడ్డ అడుగుతు న్నాడు. రూ.10,000 కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నారు , చేనేత పవర్ లూమ్స్ రుణాల మాఫీ అన్నారు. విమెన్ ప్రొటెక్షన్ ఫోర్సు ఏర్పాటు చేస్తామన్నారు. సింగపూరుకు మించి అభివృద్ధి అన్నారు. ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ అన్నారు?.. జరిగిందా? ప్రశ్నిం చారు. చంద్రబాబు పెట్టే ప్రలోభా లకు లొంగిపోవద్దని హితవు పలికారు. ఈ ఐదు సంవత్సరాల మీ బిడ్డ పాలనలో క్యాలెండర్ ఇచ్చి మరీ.. ఏ నెలలో అమ్మ ఒడి, చేయూత అని ఫలానా నెలలో ఫలానా ఇస్తామని చెప్పి మరీ మేలు చేశాడని, పొరపాటును చంద్రబాబు ప్రలోభాలకు మోసపోయి.. ఇంటికి జరుగుతున్న మంచిని పొగొట్టుకోవద్దని కోరారు. వాలం టీర్లు ఇంటికే రావాల న్నా.. అవ్వాతాతల పెన్షన్ ఇంటికే రావాలన్నా.. నొక్కిన బటన్ డబ్బులు మళ్లీ నేరుగా నా అక్కచెల్లెమ్మల ఖాతాలో పడాలన్నా.. పేదవాడి భవిష్యత్ బాగుపడాలన్నా.. పథకాలన్నీ కొనసాగాలన్నా.. లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా.. మన పిల్లలు, వారి బడులు, వారి చదువులు ఇవన్నీ బాగుపడాలన్నా.. మన వ్యవసాయమూ, హాస్పిటల్ మెరుగుపడాలన్నా.ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

## శెట్టిబలిజలకు

# జగన్ పెద్ద పీట వేసారు



**అయినవిల్లి,మే 11(ఆంధ్రపత్రిక):** అయినవిల్లి మండలం శెట్టిబలిజ సంఘం పెద్ద మేడిశెట్టి శ్రీనివాస్ శనివారం ఒక సమావేశం లో మాట్లాడుతూ నేను ఏదో ఒక పార్టీ ని గురించి మాట్లాడాలని కాకుండా తెలియ చేయడం ఏమనగా వైసీపీ మరియు కాంగ్రెస్ పార్టీ(రాజశేఖర్ రెడ్డి) హయాంలో అప్పుడు శెట్టిబలిజ కులస్తు లకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో ఇప్పుడు ఇతర పార్టీలో ఉన్న శెట్టిబలిజ కులం వారు మరి ముఖ్యంగా తెలుసుకోవాలని మా హృదయ పూర్వక విన్నపం చేస్తున్నాను అన్నారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి శెట్టిబలిజ కులం పట్ల ఆయన చూపిన అభి మానం నేరుగా రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన పిల్లి సుభాస్ చంద్రబోస్‌ను తన క్యాబినెట్ లోకి తీసుకుని శెట్టి బలిజ లను గుర్తించడం జరిగింది. ఇప్పుడు టీడీపీ పార్టీ లో కొనసాగుతున్న సోదరుడు ఆచంట నియోజకవర్గానికి చెందిన పితాని సత్యనారా యణ కూడా అప్పుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి తన క్యాబినెట్లో కొన సాగించారు. అమలాపురం నియోజకవర్గానికి చెందిన కుడు పూడి చిట్టబ్బాయి శాసనసభ్యులు రాజశేఖర్ రెడ్డి సమయంలో పనిచేశారు. ఇవే కాకుండా వివిధ మార్కెట్ యార్డులో, కార్పొరేషన్ పదవుల్లో చైర్మన్గా, డైరెక్టర్గా రాజశేఖర్ రెడ్డి శెట్టిబలిజ కులస్తులను గుర్తించడం జరిగింది. తదనంతరం రాజశేఖర్ రెడ్డి మరణంతో తన తనయుడైన వైయస్ జగన్మోహన్ రెడ్డి కొన్ని కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీని వీడి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించడం జరిగింది. పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు వైయస్ జగన్మోహన్ రెడ్డి శెట్టిపల్లి ఇచ్చిన ప్రాధాన్యత ఒకసారి చూద్దాం. 2019లో జగన్మోహన్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన దగ్గర నుండి అన్ని కులాలతో పాటు మన శెట్టిబలిజ కులానికి వివిధ కార్పొరేషన్ మరియు మార్కెట్ యార్డులు సొసైటీలు శాసనసభ్యులుగా టిక్కెట్లు ఇచ్చి వారిని గెలిపించి మంత్రి పదవులు, రాజ్యసభ పదవులు ఇచ్చారు. ఇప్పుడు 2024 లో మళ్లీ జగన్ మన శెట్టిబలిజ కులానికి పెద్ద పేట వేశారు. ఉదాహరణకి నరసాపురం పార్లమెంటు ఇప్పుడు చూసిన అగ్రవర్ణాలకు చెందినవారికి టికెట్లు ఇచ్చేవారు. కానీ చరిత్ర లో నిలిచిపోయేలా జగన్ శెట్టి బలిజ కులానికి చెందిన గూడూరి ఉమాబాల ను ఎంపీగా అవకాశం ఇవ్వడం జరిగింది. అలాగే రాజమండ్రి నుండి గూడూరి శ్రీనివాసరావును ఎంపీగా బరిలోకి దించారు. అలాగే రాష్ట్రంలో నాలుగు ఎమ్మెల్యే టికెట్లు శెట్టిబలిజ లకు ఇవ్వడం జరిగింది. మరియు ఇదే 2019లో జగన్ వచ్చిన తర్వాత శెట్టి బలిజలను గుర్తించి పెద్దలకు ఎమ్మెల్సీలుగా గుర్తించడం జరిగింది. వెనకబడిన తరగతుల కులానికి చెందిన మేము ఏ పార్టీ కూడా ఇంతవరకు గుర్తింపు ఇవ్వలేదని మీడియా మిత్రులు సాక్షిగా అందరికీ అనగా శెట్టిబలిజ సోదరులకు తెలియ పరుస్తున్నాం అన్నారు. సోదరులారా ఒక్కసారి ఆలోచించండి మనకు ఏ పార్టీ ఎంత ప్రాధాన్యత ఇవ్వలేదని మా నమ్మకం. మనకు ఎంత ప్రాధాన్యత గుర్తింపు ఇచ్చిన జగన్‌కి మన వంతు మద్దతు ఇవ్వాలని సానుకూలంగా స్పందించి మన సోదరులందరూ కలిసికట్టుగా ప్రయాణం చేయాలని మన కులానికి ఈ రోజు ఇంత గుర్తింపు వచ్చింది అంటే మన కులానికి చెందిన నాయకులకు సరైన న్యాయం చేసి మంచి హోదాలో కూర్చోబెట్టి శెట్టిబలిజలు అంటే ఒక్క కోనసీమలో మాత్రమే తెలుసు. ఈరోజు ఉభయ రాష్ట్రాలు అంతా శెట్టిబలిజలు అంటే అంటే ఇంత స్టైంత్ ఉందా అని తెలిసేలా చేసిన ఘనతకు కారణం ప్రధానంగా మన కులానికి చెందిన నాయకులను అన్ని శాఖలలో గుర్తించి అందరికీ ఆశ్చర్యాన్ని కలగజేసే విధంగా శెట్టిబలిజలను ఉన్నత శిఖరంలో చూడవచ్చు అని ఆయన అన్నారు.

## మళ్లీ జగన్మోహన్ రెడ్డి గెలిస్తేనే

# భావితరాలకు భవిష్యత్తు



**గుంటూరు, మే 11(ఆంధ్రపత్రిక):** మళ్లీ జగన్మోహన్ రెడ్డి గెలిస్తేనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా మరియు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరి, రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ మందపాటి శేషగిరిరావు, మరియు నరసరావుపేట పేట అసెంబ్లీ పరిశీలికులు గులాం రసూల్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య, జిల్లా అధ్యక్షులు వినోద్,వైసీపీ ముఖ్య నాయకులు జియా ఊర్ రెహమాన్ "ఇతర ముఖ్య నాయకులతో కలసి భారీ ర్యాలీతో నియోజవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో విస్తృతం గా పర్యటించారు. అనంతరం స్థానిక ప్రజల కు అభివాదం చేస్తూ మరో రెండు రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో తమ విలువైన ఓట్లను ఫ్యాన్ గుర్తు పై వేసి తనని గెలిపించాలని నియోజకవర్గం ప్రజలను ఆమె కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం తెలిసిన నాయ కుడు కావాలో !! సంక్షేమన్ని అడ్డడుగు తీసుకువెళ్లే కూటమి నాయ కులు కావాలో జనం ఆలోచన చెయ్యాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తమ విలువైన ఓటును ఫ్యాన్ గుర్తు పై వేసి రాష్ట్రంలో సంక్షేమ సారధిని గెలిపించాలని తెలిపారు. అప్పుడే వైయస్ జగన్ మరో ఐదేళ్ల పాటు మనందరి కోసం బటన్ నొక్కుతూ నే ఉంటారని ఆమె వెల్లడించారు. పేదలకి పెత్తందార్లకు మధ్య జరగనున్న ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్ల మన ఇంటింటి అభివృద్ధిని, పథకాల కొనసాగింపు ను నిర్ణయించబోయే ఎన్నికలని తేల్చి చెప్పారు. ఈ ఎన్నికల్లో మీరు వైసీపీకి ఓటు వేస్తే ప్రతి గడపలో ప్రగతి తాండ వించడంతో పాటు ఇంటింటా బంగారు భవిష్యత్తు, సంక్షేమ పథకాల కొనసాగింపు జరుగుతుందన్నారు. అదే పొరపాటున చంద్ర బాబుకు ఓటు వేస్తే పథకాలన్నింటికీ ఆయన ముగింపు పలకడం ఖాయమని మళ్లీ మోసపోవడం తథ్యమని ఇదే చంద్రబా బు గత చరిత్ర చెబుతున్న సత్యమని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీకి దోచుకోవడం దాచు కోవడం తప్ప ప్రజా సంక్షేమం పట్టదని ఆరోపించారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, కార్పరెటర్లు, వార్డు ఇన్చార్జిలు, ప్రెసిడెంట్స్,జంబో కమిటీ సభ్యులు, కో.కన్వీనర్లు, మహిళా నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌ను అభివృద్ధి దిశగా

# మరింత ముందుకు తీసుకెళ్లడం

**కర్నూల్, మే 11, (ఆంధ్రపత్రిక):** ఆధునిక డిజిటల్ యుగంలో భారతీయ రిటైల్‌కు మూలస్తంభమైన కిరాణా స్టోర్‌లు స్థిరమైన అడ్డంకిని ఎదుర్కొంటున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ అనుగుణంగా. వ్యక్తిగతీకరించిన కస్టమర్ సేవలు, సౌకర్యాలు అందించడంలో కిరాణా యజమానులు రాణిస్తున్నప్పట ికీ, సంప్రదాయ వ్యాపార పద్ధతులు కొన్నిసార్లు పురోగతికి ఆటంకం కలిగిస్తాయి. అదృష్టవశాత్తూ బీ2బీ ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు కిరాణా స్టోర్‌లలో కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, సామర్థ్యాన్ని పెంచడానికి పోటీతత్వ ప్రయోజనాన్ని పెంపొందించ డానికి శక్తివంతమైన పరిష్కారాలను అందిస్తున్నాయి. కిరాణా స్టోర్‌లకు బీ2బీ ఈ-కామర్స్ అందించే ఆరు ప్రాథమిక ప్రయోజ నాలు కలవు. మెరుగైన సామర్థ్యం, తగ్గిన కార్యాచరణ ఖర్చులు: హోల్‌సేల్ వ్యాపారులతో బేరమాడడం, రద్దీగా ఉండే మార్కెట్‌లలో తమ కార్యకలాపాలు నిర్వహించడంమరియు దుకాణానికి సరుకులను రవాణా చేయడం వంటి వాటితో గడిపిన సమయాన్ని ఊహించుకోండి. ప్లాట్‌ఫారమ్‌లు ఇలాంటి ఇబ్బందులను తొలగిస్తా యి. షెడ్యూల్ చేయబడిన డెలివరీల కోసం ఎంపికలతో పాటు విలువైన సమయాన్ని ఆదా చేయడంతోపాటు కొన్ని క్లిక్‌లతో ఆర్డర్‌ల ను ఉంచవచ్చు. ఇది కిరాణా యజమానులు కస్టమర్ సేవపై దృష్టి పెట్టడానికి మరియు స్థానిక నివాసితులతో సంబంధాలను ఏర్పరచు కోవడానికి మరియు మర్చండైజింగ్ మరియు స్టాఫ్ మేనేజ్‌మెంట్ వంటి ఇన్-స్టోర్ కార్యకలాపాలపై ఎక్కువ సమయాన్ని వెచ్చించ డానికి అనుమతిస్తుంది. విస్తృత ఎంపిక మరియు సరసమైన ధరలు: సాంప్రదాయకంగా, కిరాణా స్టోర్‌లు పరిమితమైనస్థానిక పంపిణీదా రులపై ఆధారపడతాయి, అయితే ప్లాట్‌ఫారమ్‌లు డిజిటల్ మార్కె ట్‌ప్లేస్‌గా పనిచేస్తాయి, దేశవ్యాప్తంగా సరఫరాదారుల యొక్క విస్తృత నెట్‌వర్క్‌తో వాటిని కనెక్ట్ చేస్తాయి. ఇది కొత్త బ్రాండ్‌లు మరియు కొత్త కస్టమర్‌లను ఆకర్షించగల ప్రత్యేక వస్తువులతో సహా విస్తా రమైన ఉత్పత్తులకు తలుపులు తెరుస్తుంది. వివిధ పంపిణీదారుల నుండి ధరలను సరిపోల్చగల సామర్థ్యం ప్లాట్‌ఫారమ్ ద్వారా బల్క్ బైయింగ్ పవర్ ద్వారా మరింత ఖర్చును ఆదా చేయడంలో సహాయపడుతుంది. మెరుగైన ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ ద్వారా

**అత్యుత్తమ మూలధన వినియోగం:** అధిక డిమాండ్ ఉన్న వస్తువులు అయిపోవడం లేదా మూలధనాన్ని కట్టడి చేసే అధిక స్టాక్‌తో భారం పడడం వంటి సవాలు లాభాలను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ప్లాట్‌ఫారమ్‌లు రియల్ టైమ్ ఇన్వెంటరీ ట్రాకింగ్ టూల్స్ మరియు అమ్మకాల డేటా ఆధారంగా ఆటోమేటెడ్ ఇన్వెంటరీ రీఆర్డరింగ్ వంటి విలువైన వనరులను అందిస్తాయి. ఈ వ్యూహాత్మక విధానం స్టాక్‌అవుట్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది మరియు అమ్మకాల అవకాశాలను మరింత మెరుగుపరుస్తుంది, మూలధనం యొక్క సరైన వినియోగాన్ని మరియు లాభదాయకతను పెంచుతుంది.

**డేటా-ఆధారిత నిర్ణయాధికారం:** కొన్ని ప్లాట్‌ఫారమ్‌లు కేవలం ఆర్డర్ ప్రాసెసింగ్‌కు మించి ఉంటాయి మరియు కిరాణా యజమానులకు సమర్థవంతమైన విశ్లేషణ సాధనాలను అందిస్తాయి, ఇవి విలువైన అంతర్దృష్టులను అందించగలవు అత్యధికంగా అమ్ముడైన ఉత్పత్తులు మరియు స్థానిక కొనుగోలు ధోరణులపై డేటా, కస్టమర్ ప్రాధాన్యతలకు అనుగుణంగా వారి జాబితాను రూపొందించడానికి వీలు కల్పిస్తుంది. కొనుగోలు నమూనాలు మరియు పీక్ డిమాండ్ పీరియడ్‌లపై సమాచారం, స్టాక్ స్థాయిలను ఆప్టిమైజ్ చేయడానికి మరియు నిదానమైన సీజన్‌లలో ఓవర్‌స్టాకిం గ్‌ను నివారించడానికి వీలు కల్పిస్తుంది. కస్టమర్ డెమోగ్రాఫిక్స్‌లో అంతర్దృష్టులు, టార్గెట్ ప్రమోషన్‌లు మరియు మార్కెటింగ్ వ్యూహా లను అభివృద్ధి చేయడంలో వారికి సహాయపడతాయి. పెద్ద రిటైలర్ లను చేర్చడం ద్వారా రిటైల్ రంగాన్ని సమం చేయడం భారతీయ రిటైల్ రంగం క్రమబద్ధీకరించబడిన కొనుగోలు ప్రక్రియల కోసం సాంకేతికతను ఉపయోగించుకునే పెద్ద, ఆధునిక రిటైలర్‌ల ఆవిర్భా వానికి సాక్ష్యమిస్తోంది. ఇ-కామర్స్‌ను స్వీకరించడం ద్వారా, కిరాణా స్టోర్‌లు పోల్చదగిన స్థాయి సామర్థ్యం మరియు వ్యయ ప్రయోజ నాలను పొందగలవు, వాటి ఉత్పత్తి ఎంపికను అందించడానికి వీలు కల్పిస్తాయి మరియు పెద్ద సంస్థలతో సమర్థవంతంగా పోటీ పడేలా శక్తివంతం చేస్తాయి. ఈ వ్యూహాత్మక చర్య కిరాణా స్టోర్‌లను పోటీకి సిద్ధంగా ఉంచడమే కాకుండా ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న రిటైల్ రంగంలో వారిఔచిత్యాన్ని నిర్ధారిస్తుంది.

## వచ్చే ఎన్నికల్లో

# విజయం ఖాయం



**రౌతులపూడి, మే 11 (ఆంధ్ర పత్రిక):** ఎన్నికల ప్రచారంలో భాగంగా రౌతులపూడి మండలం దారపల్లి, ఎం కొత్తూరు, రామకృష్ణాపురం గ్రామల్లో పర్యటించిన ప్రత్తిపాడు వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుబ్బారావు ఆఖరి అవకాశం ఆశీర్వదించండి. ప్రజలందరికీ ఎటువంటి అవసరం వచ్చిన అందు బాటులో ఉంటాను అంతే కాకుండా తాను 2004,2014 శాసనసభ్యుడిగా పనిచేసిన కాలంలో ప్రత్తిపా డు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి మరొక్కసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల ఆస్తులు, వారి భవితను నిర్దేశించేది

# ఒక్క ఓటు మాత్రమే..



**చిలకలూరిపేట, మే 11 (ఆంధ్ర పత్రిక) :** నియోజకవర్గంలో, రాష్ట్రం మొత్తం మీద కూడా వారి ఆస్తులు భద్రంగా ఉండాలా వద్దా, వారి భవిష్యత్‌కు భరోసా కావాలా వద్దా అన్నది నిర్ణయించేది ఒక్క ఓటే అన్నారు మాజీమంత్రి, కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు. కూటమికి ఓటేస్తే జులై-1న రూ. 7వేల పింఛను, సూపర్ సిక్స్ పథకాలతో పాటు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో అంతా నిశ్చింతగా ఉండొచ్చని అన్నారు. అదే వైకాపాకు ఓటేస్తే ఎవరి భూమి ఎవరు ఎప్పుడు కొట్టేస్తారో అన్న భయం, నిరుద్యోగం, కోతల సంక్షేమానికి తోడు మరో అయిదేళ్లు రౌడీయిజం, దాడులు, అరాచకాల్ని భరించాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు ప్రత్తిపాటి. శనివారం చిలకలూరిపేట 34, 35వ వార్డులో కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు, బాగోగులు తెలుసుకున్నారు. తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి కూటమికి మద్ద తుగా ఓట్లేయాలని కోరారు. స్థానికుల నుంచి ప్రత్తిపాటికి ఘనస్వాగతం లభించింది. ప్రచారంలో ఉన్న ప్రత్తిపాటిని నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం కలిసి మద్దతు ప్రకటించారు. గతంలోనూ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశారని, అటువంటి మంచి మనిషి ప్రత్తిపాటి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రత్తిపాటి జగన్‌రెడ్డి ప్రభుత్వ వైఫ ల్యాలతో పాటు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. చిలకలూరిపేట లో తమ గెలుపు ఎప్పుడో ఖాయమైపోయిందన్న ఆయన సాధించే మెజార్టీపైనే అందరూ చర్చించుకుంటు న్నారని తెలిపారు. అదే సమయంలోప్రచారం చివరిరోజు కావడంతో చిలకలూరిపేట నియోజకవర్గం మొత్తం ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన కుటుంబ సభ్యులు ఉద్ధృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రత్తి పాటికి మద్దతుగా ఆయన సతీమణి వెంకటకుమారి, కుమార్తె డాక్టర్ స్వాతి, కుమారుడు శరత్ ఇంటింటి ప్రచా రం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. చిలకలూరిపేట పట్టణం, గ్రామీణ మండలం, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో వారు చేపట్టిన ప్రచారానికి విశేష స్పందన లభించింది. విస్తృత ప్రచారంతో ప్రజల మద్దతు కూడగట్టారు. కూటమి మేనిఫెస్టో, సూపర్-6 పథకాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. అన్ని వర్గాల ప్రజలను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేయబోతున్నారో తన ప్రణాళికలను వివరించారు. అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. హారతులతో మహిళలు స్వాగతించారు. ఈ కార్యక్రమంలో రెండు వార్డుల నాయకులు, మహిళలు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాపుల రిజర్వేషన్లు అమలు కాకుండా చేసిన

# ద్రోహి జగన్‌రెడ్డి



**చిలకలూరిపేట, మే 11 (ఆంధ్ర పత్రిక):** రాష్ట్రంలో కాపుల రిజర్వేషన్లు అమలు కాకుండా చేసి, వారిని అన్నివిధాల అణగదొక్కిన ద్రోహి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అని ధ్వజమెత్తారు మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తి పాటి పుల్లారావు. కేంద్రం ఇచ్చిన రిజర్వేషన్లలో 5శాతం కాపులకు ఇస్తే వారు ఎక్కడ ఎదిగి పోతారో అన్న అసూయ, ద్వేషంతో జగన్‌రెడ్డి దానిని తుంగలోకి తొక్కారని, ఇప్పుడు అతడి ప్రభుత్వాన్ని, పార్టీని భూమిలోకి తొక్కడానికి కాపులంతా సిద్ధంగా ఉన్నారన్నారాయన. శనివా రం చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్స్‌లో కాపుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ఛైర్‌పర్సన్ రుద్రమదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రత్తిపాటి ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాపు, ఒంటరి, తెలగ, బలిజ కులాలు పవన్‌కల్యాణ్ పిలుపుతో ఈసారి ఏకమొత్తంగా కూటమికి ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో కాపులంతా నలిగిపోయారన్నారు. జగన్ వారికి ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు చేయడమే కాక అధికారాన్ని కక్షసాధింపులకు ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వం కాపులకు ఇచ్చిన పథకాలను తొక్కి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపు కార్పొరేషన్ ద్వారా చంద్రబాబు ఏటా రూ.వెయ్యి కోట్లు, విదేశీ విద్య అమలుకు ఒక్కొక్క విద్యార్థికి రూ.10 లక్షలు మంజూరు, కాపులకు 500 సామాజిక భవనాలు వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు ప్రత్తిపాటి. కాపు కులాలకు రూ.లక్ష రాయితీతో 2 లక్షల రుణ సదుపాయా న్నీ కల్పించారన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయకపోవడం వల్ల గడిచిన ఐదేళ్లలో కాపు యువత 30 వేల ఉద్యోగాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్‌పై అయిదేళ్లుగా వైకాపా చేస్తున్న హీనమైన దాడిని కూడా ప్రతిఒక్కరూ గమనిస్తున్నారు ప్రత్తిపాటి. ఎంత కష్టం వచ్చినా జగన్‌రెడ్డి పాలనను అంతమొందించాలంటే ఓట్లు చీలకూడదనే ఏకైక లక్ష్యం తో పవన్‌కల్యాణ్ పనిచేశారని కొనియాడారు. ఇప్పుడు పిఠాపురంలో పవన్‌కల్యాణ్ గెలుపును, చిలకలూరిపేటలో తన గెలుపును అడ్డుకోవడం జగన్‌రెడ్డి వల్ల కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో టాప్ టెన్ మెజార్టీల్లో చిలకలూరిపేట ఉండటం ఖాయమని, పిఠాపురంలో పవన్‌కల్యాణ్ మెజార్టీ కూడా టాప్ టెన్‌లో ఉంటుందని తెలిపారు.

పిఠాపురంలో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్ వచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. స్థానికంగా అందరు కోరుకుంటున్నట్లు నియోజకవర్గంలోని కాపు సోదరులు గర్వపడేలా కాపు భవన్ నిర్మించి చూపిస్తామన్నారు. అలానే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రాగానే కాపులకు 5 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని అన్నారు. కాపు సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని కాపు కార్పొరేషన్‌కు రూ.15 వేల కోట్ల కేటాయిస్తామని మేనిఫెస్టోలో పెట్టించారన్నారు. ఆ విధంగా కూటమి ప్రభుత్వంలో కాపులకు ప్రాధాన్యత లభించబోతుందని వివరించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ది ఒకే మాట, ఒకే బాట.. అభివృద్ధి, సంక్షేమం ఉండబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి రుద్రమదేవి, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఓటేసేందుకు బయలుదేరిన నగరవాసులు

(మొదటిపేజీ తరువాయి)

విజయవాడ హైవే వాహనాలతో రద్దీగా మారింది. మే 13న పోలింగ్ కావడం, వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో ప్రజలంతా సొంతూళ్ల బాట పట్టారు. వీకెండ్‌తో పాటు సోమవారం పోలింగ్ నేపథ్యంలో తెలుగు ప్రజలు పల్లెలకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో బస్టాండ్లకు చేరుకుంటున్నారు. ఏపీలో ఓట్ల పండగ మొదలు కానుంది. ఎన్నికల వేళ అక్కడ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్‌లో స్థిరపడిన ఓటర్లు భారీగా తరలివెళ్తున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం ఇక్కడ ఉండి ఐదేళ్లకోసారి తమకు ఇష్టమైన నాయకున్ని ఎన్నుకునేందుకు ఉత్సాహంగా సొంతూళ్లకు కదులుతున్నారు. ఈ క్రమంలో చాలామంది ఓటర్లు ప్రత్యేక బస్సులు, రైళ్లలో ఊర్లకు చేరుకుంటుండగా.. ఇంకొందరు తమ సొంత వాహనాల్లోనే స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో హైదరాబాద్ – విజయవాడ హైవేపై రద్దీ నెలకొంది. వారాంతం, వరుస సెలవులు, పోలింగ్ కు ఇంకా రెండు రోజులే టైం ఉండడంతో తమ సొంత వాహనాల్లో వేకువజాము నుంచే వాహనదారులు బయలుదేరడంతో హైవేపై ట్రాఫిక్ జాం నెలకొంది. ఈ వాహనాలు విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం, విశాఖ వైపు తరలివెళ్తున్నాయి. జాతీయ రహదారిపై రద్దీ నేపథ్యంలో నెమ్మదిగా కదులుతున్నాయి. మరోవైపు, హైదరాబాద్ శివారు హయత్ నగర్ నుంచి అబ్దుల్లాపూర్ మెంట్ వరకు ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోంది. అటు, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. ఇప్పటికే అనేక మంది వెళ్లిపోగా.. మరికొందరు ఉదయం నుంచి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఎంజీబీఎస్ వద్ద సొంతూళ్లకు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెళ్తున్న వారితో బస్టాండ్ కిక్కిరిసి పోయింది. అయితే ఆర్టీసీ సరిపడా బస్సులు ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట, మహబూబ్ నగర్, ఖమ్మం, కోదాడ మార్గాల్లో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. నగరంలోని అన్ని బస్ స్టేషన్ల వద్ద ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది.

## గుర్తింపు కార్డుతో ఓటు వేయాలి

(మొదటిపేజీ తరువాయి)

**అమరావతి, మే 11 (ఆంధ్రప్రత్రిక):** ఓటరు గు ర్తింపు కార్డు ద్వారా ఓటేయడానికి అవకాశం ఉన్నా.. అది లేకున్నా పలు గుర్తింపు కార్డులు చూ పి ఓటేయవచ్చని అధికారులుతెలిపారు. ఒకవేళ ఓటరు గుర్తింపు కార్డు లేనివారు ప్రత్యామ్నాయంగా 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దానిని చూపి ఓటు వేయొచ్చు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు ఓటు వేసే అధికారం ఉన్నప్పటికీ, ఆ పేరు గల వ్యక్తి తానేనని నిరూపించుకోవాల్సి ఉంటుంది. అందుకోసం ఎన్నికల సంఘం ఓటు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటరు గుర్తింపు కార్డును అందజేస్తుంది. ఆ గుర్తింపు కార్డుతో ఓటు వేయాలి. ఓటరు గుర్తింపు కార్డు లేనివారు ప్రత్యా మ్నాయంగా 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపి ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. 1. పాస్‌పోర్టు 2. డ్రైవింగ్ లైసెన్స్ 3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోతో కూడిన సర్వీసు గుర్తింపు కార్డులు, 4. బ్యాంకులు జారీ చేసిన పాస్ పుస్త కం, తపాలా కార్యాలయాలు జారీ చేసిన ఫొటో ఉన్న పాస్ పుస్తకాలు, 5. పాన్‌కార్డు, 6. ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, 7. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, 8. కార్మిక మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు, 9. ఫొటోతో కూడిన పింఛను పత్రం, 10. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, 11. ఆధార్‌కార్డు చూపించి ఓటు వేయవచ్చు.

## కడపలో షర్మిలనే గెలిపించండి

**కడప, మే 11 (ఆంధ్రప్రత్రిక):** ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన తల్లి విజయమ్మ షాక్ ఇచ్చారు. ' వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అభిమానించే వారికి, ప్రేమించే వారికి నా హృదయ పూర్వక నమస్కారాలు. కడప ప్రజలకు నా విన్నపం. వైఎస్సార్ బిడ్డ షర్మిలమ్మ ఎంపీగా పోటీ చేస్తోంది. వైఎస్సార్ బిడ్డను గెలిపించి పార్లమెంట్‌కి పంపాలని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను అంటూ విజయమ్మ వీడియో విడుదల చేశారు. దీంతో కూతురు షర్మిలకు మద్దతు ప్రకటించడం జగన్‌కు విజయమ్మ బిగ్ షాకిచ్చినట్టు అయ్యింది. అవినాశ్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డిలకు వ్యతిరేకంగా వైయస్ విజయమ్మ వీడియో విడుదల చేయడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కన్న తల్లే జగన్‌ను నమ్మడం లేదంటూ సోషల్ మీడియాలో ట్రోల్స్ కనిపిస్తున్నాయి.పోలింగ్ సమయం దగ్గర పడుతున్న వేళ.. ఏపీ సీఎం జగన్ తల్లి వైఎస్ విజయమ్మ కీలక ప్రకటన చేశారు. కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి షర్మిలకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 'కడప ప్రజలకు నా విన్నపం. వైఎస్సార్‌ను అభిమానించే, ప్రేమించే వారికి నా హృదయ పూర్వక నమస్కారాలు. వైఎస్సార్ బిడ్డ షర్మిలమ్మ ఎంపీగా పోటీ చేస్తోంది. కడప జిల్లా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించండి. ఆమెను గెలిపించి పార్లమెంటుకు పంపాలని మిమ్మల్ని ప్రార్థిస్తున్నా' అని విజ్ఞప్తి చేశారు. మరి కొన్ని గంటల్లో పోలింగ్ జరగనుండగా విజయమ్మ ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చ నీయాంశంగా మారింది.అమెరికాలో ఉన్న ఆమె ఈమేరకు వీడియో సందేశం విడుదల చేశారు.

## షర్మిలను పార్లమెంట్‌కు పంపాలి

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభలో మాట్లాడిన రాహుల్.. బీజేపీ బీ టీం చంద్రబాబు, పవన్, జగన్ బీజేపీ బీ టీం అని విమర్శించారు. జగన్ ఏనాడు కేంద్రాన్ని ఏ విషయంలోనూ ప్రశ్నించ లేదన్నారు. ఈ పదేళ్లలో ఏపీకి ప్రత్యేక హోదా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పోలవరం ఎందుకు పూర్తి కాలేదన్నారు. కేంద్రంలోకి అధికారంలోకి రాగానే కడప స్టీల్ ఫ్యాక్టరీ, పోలవరం పూర్తి చేస్తామని చెప్పారు. ప్రతి ఏడాది మహిళలకు లక్ష రూపాయలు ఇస్తామన్నారు. రైతురుణమాఫీ,రైతులకు కనీస మద్దతు , 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు,ఉపాధి కూలీ రూ.400 కు పెంచుతామని హామీ ఇచ్చారు. అంగన్ వాడీల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పారు. సీబీఐ చార్జ్ షీట్ లో వైఎస్సార్ పేరును కాంగ్రెస్ చేర్చలేదన్నారు. హస్తం, వైఎస్సార్ ఒక్కటేనన్నారు. కాంగ్రెస్, వైఎస్సార్ ఆలోచనలకు వ్యతిరేకంగా పనిచేయబోదన్నారు. రాజశేఖర్ యాత్ర స్ఫూర్తితోనే తాను యాత్ర చేశానని చెప్పారు. తన తండ్రికి వైఎస్సార్ మంచి స్నేహితుడు. రాజశేఖర్ రెడ్డిని చూస్తూ పెరిగిన, పాదయాత్రతో పేదల కష్టాలను చూశా. పాదయాత్రలో పేదలకు దగ్గరయ్యా. రాజశేఖర్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శం. ఉమ్మడి ఏపీలో వైఎస్సార్ సేవలు మరువలేమన్నారు. మోదీ రాజ్యాంగాన్నినాశనం చేయాలని చూస్తుండని రాహుల్ విమర్శించారు. పేదలకు హక్కులు లభించేది రాజ్యాంగం వల్లేనని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని మోదీ కాదు ప్రపంచంలో ఎవరూ మార్చలేరన్నారు. షర్మిల పార్లమెంట్ లో ఉండాలి.. షర్మిల నా చెల్లెలు, లోక్ సభకు పంపించాలి. ఏపీ ప్రజల ఆలోచనను ఢిల్లీ పార్లమెంట్ లో వినిపిస్తుంది. షర్మిలను సీబీఐ, ఈడీ ఏం చెయ్యలేదని చెప్పారు.సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏపీసీసీ అధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల శనివారం కడపలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఆర్ పాదయాత్ర తన భారత్ జోడో యాత్రకు స్ఫూర్తి అని, పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను..నేరుగా తెలుసుకోవచ్చునని వైఎస్ఆర్ తనతో చెప్పేవారని అన్నారు. తన తండ్రి రాజీవ్‌గాంధీ , వైఎస్ఆర్ సోదరుల్లా ఉండేవారని వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ ఏపీకే కాదు.. దేశానికే దారి చూపించారని కొనియాడారు.

## పిఠాపురంలో రామ్‌చరణ్,సురేఖ

(మొదటిపేజీ తరువాయి)

కలిసి శనివారం పిఠాపురంలో పర్యటించడం జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. తొలుత పిఠాపురంలోని కుక్కుటేశ్వర స్వామి ఆలయాన్ని సంద ర్శించిన అనంతరం పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడం, రామ్‌చరణ్ రావడంతో అభిమానులు కార్యకర్తలు పోటెత్తారు. భారీగా తరలి వచ్చిన జనసైనికులు, అభిమానులకు రామ్‌చరణ్ అభివాదం చేశారు. ఈ సందర్భంగా సురేఖ.. పవన్ కల్యాణ్‌కు ఆశీస్సులందించారు. ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా చరణ్.. పవన్‌కు మద్దతు తెలిపారు. తన తండ్రి చిరంజీవి. జనసేనానికి సపోర్ట్‌గా ఓ వీడియో విడుదల చేయగా చరణ్ దాన్ని పోస్ట్ చేస్తూ 'మీ భవిష్యత్తు కోసం పాటుపడే నాయకుడు పవన్ కల్యాణ్‌ని గెలిపించండి' అని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే నాగబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి గత కొన్ని రోజులుగా పిఠాపురంలోనే మకాం వేసి పవన్ కల్యాణ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

## తెలంగాణకు లక్షల కోట్ల నిధులు

**హైదరాబాద్, మే 11 (ఆంధ్రప్రత్రిక):** మిగులు బడ్జెట్ రాష్ట్రం తెలంగాణ ఇప్పుడు అప్పులపాలయ్యిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విమర్శించారు. గతంలో భారాస అప్పులు చేసినట్లే కాంగ్రెస్ కూడా చేస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్లలో తెలంగాణకు రూ.లక్షల కోట్ల నిధులు ఇచ్చామని చెప్పారు. మరోసారి కేంద్రంలో భాజపా అధికారంలోకి రావడం ఖాయం. తెలంగాణలో 10 ఎంపీ సీట్లు తప్పక గెలుస్తున్నాం. 11 చోట్ల విజయావకాశాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 400 సీట్లు వస్తాయని మాకు పూర్తి విశ్వాసం ఉంది. మోదీ ప్రధానిగా ఉంటేనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. మోదీ పాలనలో ఉగ్రవాద దాడులు లేవు. తెలంగాణలో రామగుండం ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ నిర్మించాం. సమ్మక్క- సారక్క గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు చేశాం. ఇలా ఎన్నో కీలక సంస్థలను నెలకొల్పాం. తెలంగాణ ప్రభుత్వ స్టీరింగ్ ఇప్పటికీ ఓవైసీ చేతిలోనే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలుకావడం లేదు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు. అదీ లేదు. రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి.. ఇవ్వలేదు. కౌలు రైతులకు రూ.15వేల ఆర్థిక సాయం లేదు. విద్యార్థులకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. భాజపా ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది. నా వీడియోను ఎడిట్ చేసి తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ వస్తే.. మళ్లీ ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తారని అమిత్ షా అన్నారు.తెలంగాణలో బీజేపీకి మంచి స్పందన ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో బిజెపి 10 సీట్లు గెలుస్తుందని చెప్పారు. మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్టీరింగ్ ఇంకా ఓవైసీ చేతిలోనే ఉందన్నారు. కాంగ్రెస్ కు తెలంగాణ ఏటిఎంలా మారిందని విమర్శించారు. దక్షిణాదిలో బీజేపీ అద్భుతంగా విజయం సాధించబోతుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

# వంగా గీతను గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ పారిపోతారని అన్నారు. ఎన్నికల చివరి ప్రచార సభను పిఠాపురంలో నిర్వహించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో పాటు కూటమికి కూడా షాక్ ఇచ్చిన జగన్ ప్రచారంలో భాగంగా కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ గెలిస్తేనే పథకాలన్నీ కొనసాగుతాయని, కూటమి గెలిస్తే పథకాలకు ముగింపు పలికినట్లే అని అన్నారు. ఈ ఎన్నికలు వచ్చే ఐదేళ్ల ఇంటింటి అభివృద్ధిని నిర్ణయించే ఎన్నికలని అన్నారు జగన్. కూటమి నేతలు గత ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేశారని అన్నారు. చంద్రబాబుకు ఓటేస్తే కొండచిలువ నోట్లో తలా పెట్టినట్లే అని అన్నారు. 14ఏళ్ళ చంద్రబాబు పాలనలో ఒక్క మంచి పని అయినా చేశారా, బాబు పేరు చెబితే ఒక్క మంచి పని కూడా గుర్తు రాదని అన్నారు. సాధ్యంకాని హామీలతో చంద్రబాబు మేనిఫెస్టో ఇచ్చారని.. పొరపాటున బాబుకు ఓటు వేస్తే ప్రజలు మోసపోయినట్టేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పిఠాపురంలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ కూటమి మోసాలను ఎండగట్టారు. ఇంటింటి అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని సీఎం జగన్ పిలుపునిచ్చారు. చంద్రబాబు గత చరిత్ర చెబుతున్న సత్యం ఇదే. చంద్రబాబును నమ్మడం అంటే కొండ చిలువ నోట్లో తలపెట్టడమే. కూటమికి ఓటేస్తే పథకాలన్నిటికీ ముగింపే. 2 లక్షల 70 వేల కోట్ల రూపాయలు నేరుగా ప్రజల ఖాతాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేసింది. రాబోయే ఐదేళ్ల ఇంటింటి అభివృద్ధి, పథకాల కొనసాగింపును నిర్ణయించే ఎన్నికలు. ఐదేళ్లు లంచాలు, వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందించాం. ఇంటి వద్దకే పెన్షన్, పౌరసేవలు, పథకాలు ఇస్తున్నాం. గతంలో ఎన్నికల తర్వాత మేనిఫెస్టోను కూటమి నేతలు చెత్తబుట్టలో వేశారు' సీఎం జగన్ మండిపడ్డారు. 2 లక్షల 31 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 99 శాతం హామీలు అమలు చేశాం. గతంలో ఎప్పుడైనా ఈ పథకాలు చూశారా. అక్కాచెల్లెమ్మల పేరుపై 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చాం. రైతులకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతన్నకు తోడుగా ఉన్నాం. డ్రైవర్ అన్నదమ్ములకు వాహనమిత్ర, నేతన్నలకు నేతన్న నేస్తం. జగనన్న తోడు, చేదోడుతో చిరు వ్యాపారులకు తోడుగా నిలిచాం' అని సీఎం పేర్కొన్నారు.మేనిఫెస్టోకు, విశ్వసనీయతకు అర్థం చెప్పింది మీ బిడ్డే. స్వయం ఉపాధికి గతంలో ఈ పథకాలు ఉన్నాయా?. 59 నెలల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించాం. మన మేనిఫెస్టోను నేరుగా ఇళ్లకే పంపి ఆశీస్సులు తీసుకున్నాం. మేనిఫెస్టోకు, విశ్వసనీయతకు అర్థం చెప్పింది మీ బిడ్డే' అని సీఎం చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ విపరీతంగా దుష్ప్రచారం చేస్తున్నారు. ఇదే దత్తపుత్రుడు మంగళగిరి వెళ్లి భూములు కొన్నాడు.. బాలకృష్ణ మొన్ననే విశాఖలో రిషికొండలో భూమలు కొన్నాడు.. మీ ఇద్దరినీ అడుగుతున్నా.. మీకు ఒరిజినల్ డీడ్స్ ఇచ్చారా? జిరాక్స్ ఇచ్చారా?. రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 9 లక్షల మందికి ఒరిజినల్ డీడ్స్ ఇచ్చాం' అని సీఎం జగన్ వివరించారు. వంగా గీతను గెలిపిస్తే డిప్యూటీ సీఎంని చేస్తా.. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న దత్తపుత్రుడికి ఓటు వేయ కండి.. దత్తపుత్రుడికి ఓటేస్తే ఇక్కడే ఉంటాడా? హైదరాబాద్ వెళ్తాడా?. గాజువాక, భీమవరం అయిపోయింది.. ఇప్పుడు పిఠాపురం అంటున్నారు. దత్తపుత్రుడిని మహిళలు నమ్మే పరిస్థితి ఉంటుందా? ఐదేళ్లకోసారి కార్లు మార్చినట్టుగా భార్యలను మారుస్తున్నాడు' అంటూ సీఎం జగన్ ఎద్దేవా చేశారు. ప్రత్యర్థులు నన్ను అవమా నిస్తున్నారు.. అవహేళన చేస్తున్నరని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీత అన్నారు. పిఠాపురం ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లా డారు. ' కొంగు చాచి అడుగుతున్నాను.. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి. నా బిడ్డ సాక్షిగా పిఠాపురం అభివృద్ధి చేస్తాను. మళ్లీ జన్మలో పిఠాపురంలో పుడతాను. కట్టె కాలే వరకు పిఠాపురంలోనే ఉంటా. నేను పిఠాపురం వదిలి వెళ్లను. నా అంతిమయాత్ర పిఠా పురంలోనే జరగాలి. మళ్లీ జన్మలో పిఠాపురంలోనే పుడతా. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి. నా బిడ్డ సాక్షిగా పిఠాపురాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా' అని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. మరోవైపు పవన్ కల్యాణ్ తనపై చేసిన వ్యాఖ్యలకు తనదైన శైలిలో కౌంట రిచ్చారు వంగా గీత. 'వంగా గీతాను నిలదీయండి అని పవన్ అంటున్నాడు. పిఠాపురంలో పాలిటెక్నిక్ కాలేజ్ తెచ్చినందుకు నన్ను అడగాలా? కాకినాడలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి తెచ్చి నందుకా? కరోనా సమయంలో ప్రజల్లో ఉన్నది నేను.

# ప్రజల కష్టాలు తీరుస్తా..

(మొదటిపేజీ తరువాయి)



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపైనే చేస్తాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం అన్నారు. పింఛన్ తీసుకొచ్చిందే తెదేపా. రూ.200 పింఛన్‌ను రూ.2 వేలు చేశాం. దీన్ని రూ.4 వేలకు పెంచి ఏప్రిల్ నుంచే ఇస్తాం అని అన్నారు. దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ అందజేస్తాం. మన భూమి పాసు పుస్తకంపై జగన్ ఫొటో ఎందుకు? దానిపై రాజముద్ర ఉండాలి.. సైకో ఫొటో కాదుని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ అనే వ్యక్తిని జగన్ పెడుతున్నారు. మనకు ఏ సమస్య ఉన్నా ఆ అధికారి వద్దకే వెళ్లాలి. మీ భూమి మీరు అమ్ముకోవడానికి వీల్లేకుండా చేస్తున్నారు. మీ భూమి పోతే నేరుగా హైకోర్టుకు వెళ్లాలి. వైకాపా ప్రభుత్వం ఇంటి వద్ద పింఛన్ ఇవ్వకుండా శవ రాజకీయాలు చేస్తోందని చంద్రబాబు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నంద్యాలలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఇందులో నంద్యా ఎమమెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ కూడా పాల్గొన్నారు. నంద్యాలకు రాగానే నాకు సెప్టెంబర్ 9వ తేదీ గుర్తుకు వస్తోంది. రాత్రి మీటింగ్ కంప్లీట్ చేసుకుని బస చేశాను. నిద్ర పోతున్నప్పుడు పోలీసులు దొంగల్లా వచ్చారు. నోటీసు ఇచ్చి అరెస్టు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. నేను మాజీ ముఖ్యమంత్రిని ఏ కేసులో అరెస్ట్ చేస్తున్నారని అడిగాను. ఎఫ్ఐఆర్ ఇవ్వమని అడిగాను. దారిలో ఇస్తామని చెప్పి ఇక్కడ నుంచి తీసుకెళ్లారు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన సీనియర్, మాజీ ముఖ్యమంత్రిని నన్నే అక్రమంగా అరెస్టు చేశారు. ఇక సామాన్యుల ఓ లెక్కా. జైల్లో నన్ను చంపేస్తానంటూ భయపెట్టారు. నన్ను చంపేస్తానంటే ఎవరి మెడకు వాళ్ళు ఉరేసుకుని చావాల్సి వస్తుంది జాగ్రత్త. నేను ఎప్పుడు ప్రాణానికి భయపడలేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ మెయిన్‌టెన్ చేశాను. తిరుపతిలో నాపై క్లైమెర్ మెన్స్‌తో దాడి చేస్తే వెంకటేశ్వర స్వామి కాపాడారని టీడీపీ చీఫ్ చెప్పుకొచ్చారు.రాష్ట్రాన్ని గట్టెక్కిస్తాననే విశ్వాసం తనకుందన్నారు. కర్నూలును న్యాయ రాజధాని చేస్తానని జగన్ చెప్పారని.. చేశారా? అని ప్రశ్నించారు. అమరావతిని బెస్ట్ రాజధాని చేయాలనుకున్నానని.. దాన్ని సైకో జగన్ నాశనం చేశారని మండిపడ్డారు. 'విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేస్తాడంటా. ఇడుపులపాయలో మీ నాన్న సమాధి వద్ద చేయ్' అంటూ కామెంట్స్ చేశారు. పోలవరం పూర్తి చేసి గోదావరి నీళ్లు, రాయలసీమకు నీళ్లు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. నంద్యాల బై ఎలక్షన్‌లో రోడ్ల విస్తరణ చేస్తానని చెప్పానని... చేశానా లేదా అని అడిగారు. ఎన్డీయే కూటమితోనే నంద్యాల అభివృద్ధి అని చెప్పుకొచ్చారు. తన జీవితంలో ఇలాంటి సైకో ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదన్నారు. జగన్ రాయలసీమలో ఒక్క ప్రాజెక్ట్ అయినా కట్టారా... జగన్ రాయలసీమ ద్రోహి అని విరుచుకుపడ్డారు. కులాలు మతాల పేర్లు చెప్పి జగన్ రాయలసీమలో అత్యధిక సీట్లు పొందారని.. కానీ రాయలసీమకు ఏమీ చేయలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో రాయలసీమలో రివర్స్‌లో 52 సీట్లలో 49 సీట్లు గెలిపించాలని కోరారు. 'జే బ్రాండ్ రద్దు చేస్తా. మీ ఆరోగ్యం కాపాడతా.. ధరల నియంత్రణ చేస్తా. కరెంటు కొరత ఉండదు. విద్యుత్ బిల్లులు పెంచం. ఇసుక మద్యం మాఫియాలను మరిచిపోయి ఫ్యాన్‌ను గెలిపిస్తే... మీ ప్రాంతానికి గొడ్డలి వస్తుంది. చెల్లెలు చీర పుట్టుక గురించి మాట్లాడే వాడు మనిషేనా. తల్లి శీలాన్ని రాజకీయాలకు వాడుకునే వాళ్ళని ఏమనాలి' అంటూ టీడీపీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమి మేనిఫెస్టోపై జనంలో చర్చ జరగాలన్నారు. జగన్ చేసిన అభివృద్ధి వల్ల బటన్ ఆగిపోయిందని.. నొక్కే పరిస్థితి కూడా లేదన్నారు. జనవరిలో డీపీటీకి బటన్ నొక్కితో మే నెలలో కూడా డబ్బులు జమ కాలేదన్నారు. జగన్, తాను చాలా రోజుల నుంచి ఎన్నికల ప్రచారం చేస్తున్నామని.. ఏ రోజు కూడా కొత్త విషయాలు చెప్పారా అని ప్రశ్నించారు. 'ఈరోజు నేనొస్తే పథకాలు కొనసాగుతాయని జగన్ అంటున్నారు. భవిష్యత్తులో ఏం చేస్తాడో చెప్పే దమ్ము లేని వ్యక్తి జగన్' అంటూ వ్యాఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల కష్టాలు తీరుస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## కూటమి విజయం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతిలో రోడ్‌షో నిర్వహించారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ దేశాభివృద్ధికి మోదీ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. తిరుపతి ఎంతో గొప్ప పుణ్యక్షేత్రమని.. మోదీ ఈ నగరాన్ని ఐటీ కేంద్రంగానూ తీర్చిదిద్దుతారన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వచ్చేలా చూస్తామని చెప్పారు. నారా లోకేశ్ మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తిరుపతి సహా రాయలసీమ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామని వివరించారు. రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్ అని విమర్శించారు. వైకాపా పాలనలో ఒక్క ప్రాజెక్టూ పూర్తిచేయలేదన్నారు. జగన్ నిర్వాకంతో కొత్త కంపెనీలు రావడం సంగతి పక్కన పెడితే.. ఉన్న కంపెనీలూ తరలిపోయాయని ఎద్దేవా చేశారు. తిరుపతిలో ఎక్కడ చూసినా భూకబ్జాలు, దందాలు జరుగుతున్నాయన్నారు. భూమన కుటుంబానికి డబ్బులు ఇస్తే తప్ప పనులు జరగడం లేదని ఆరోపించారు. కూటమి అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, లోక్‌సభ అభ్యర్థి వరప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి అభ్యర్థికి మద్దతుగా రోడ్ షోలో పాల్గొనేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా తిరుపతికి చేరుకున్నారు. తిరుపతిలో నిర్వహించే రోడ్ షోలో పాల్గొనేందుకు జేపీ నడ్డా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇప్పటికే జ్యోతిరావు పూలే విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం జేపీ నడ్డాతో కలిసి లోకేష్ రోడ్ షో నిర్వహించారు. జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రచారం కోసం ప్రత్యేక విమానంలో లోకేష్ తిరుపతికి వచ్చారు. ఈ సందర్భంగా లోకేష్‌కు కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు రోడ్ షో జరిగింది. రోడ్డు షో నిర్వహించే ప్రాంతం వద్దకు జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు వచ్చారు.అంతకుముందు ఉదయం తిరుపతి చేరుకున్న జేపీ నడ్డా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శ్రీవారిని దర్శించుకుని.. స్వామి వారి ఆశీర్వాదం పొందానన్నారు. దేశం, సమాజంలో ప్రజలందరూ సుఖంగా ఉండడంతో పాటు అభివృద్ధి చెందాలని స్వామి వారిని ప్రార్థించానని తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో సమవృద్ధి భారత్, సంక్షేమ భారత్, సురక్షిత భారత్ దిశగా దేశం పయనించాలని వేడుకున్నట్లు జేపీ నడ్డా పేర్కొన్నారు.

# ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు..

(మొదటిపేజీ తరువాయి)

శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకే ముగిసిందని ప్రధాన ఎన్నికల అధికారి మీనా తెలిపారు. ఏపీలో అన్ని నియోజకవర్గాల్లో రాజ కీయ ప్రచారం ముగిసిపోయిందన్నారు. 144 సెక్షన్ ఏపీ వ్యాప్తంగా అమల వుతుందని చెప్పుకొచ్చారు. అలాగే 6 గంటల తర్వాత స్థానికేతర రాజకీయ నేతలు అంతా ఆయా నియోజకవర్గాల్లో నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. అయితే పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు ఉన్న చోట మినహాయింపు ఉంటుందని తెలి పారు. రాజకీయ పార్టీల ఎలాం టి ప్రలోభాలకు గురి చేయొద్దని హెచ్చరించారు. శనివారం ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా మీడియా సమావేశం నిర్వహించి పలు విషయాలు వెల్లడించారు. మే 13 తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 13న 6 పోలింగ్ కేంద్రాల్లో 3 చోట్ల 4 గంటలకు, మూడు చోట్ల 5 గంటలకే పోలింగ్ ముగుస్తుందని తెలిపారు.టీవీ,రేడియో, సోషల్ మీడియా ద్వారా ప్రచారం ముగుస్తుందని చెప్పారు. పత్రికల్లో ప్రకటనల కోసం ప్రీ సర్టిఫికేషన్ తీసు కోవాలని అన్నారు.

ఆదివారం సాయంత్రం ఈవీఎంలు తీసుకుని పోలింగ్ సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్తారని తెలిపారు. పోలింగ్‌కు 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహిస్తామని వివరించారు. 13 తేదీన సరిగ్గా 7 గంటలకు పోలింగ్ మొదలు అవుతుందని ప్రకటించారు. పోలింగ్ ఏజెంట్‌కు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు ఇచ్చామన్నారు.నియోజకవర్గంలో స్థానికుడైన అభ్యర్థి నుంచి ధ్రువపత్రాలు తీసుకుంటే ప్రిసైడింగ్ అధికారి ఏజెంట్ గా అనుమతి ఇవ్వొచ్చని వివరించారు. అలాగే పోలింగ్ కేంద్రానికి 200 మీ టర్ల పరిధిలో రాజకీయ పార్టీలు ఎలాంటి చిహ్నాలు లేకుండా స్లిప్‌లు పంచు కోవచ్చని అన్నారు. అలాగే పోలింగ్ రోజు ప్రజల రవాణాను నిరోధించాలని ఎన్నికల సంఘం ఉద్దేశ్యం కాదన్నారు.ఓటర్లను రాజకీయ పార్టీలు తరలిం చడం చట్ట వ్యతిరేకమని అన్నారు. అభ్యర్థికి సంబంధించి వాహనాల పరిమితి ఉందన్నారు. మూడు వాహనాల వరకే సదరు అభ్యర్థి వినియోగించు కోవచ్చని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లోకి ప్రిసైడింగ్ అధికారి మినహా ఎవరూ ఫోన్లు తీసుకెవెళ్లేందుకు అనుమతి లేదన్నారు.ఓటర్లు కూడా ఫోన్లు తెచ్చేందుకు అనుమతి లేదన్నారు.అలాగే ఆయుధాలతో ఎవరూ పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించామని స్పష్టం చేశారు.

# రాజ్యాంగాన్ని తొలగించే ప్రయత్నాలు



**తాండూరు,మే 11 (ఆంధ్రప్రత్రిక):** రాజ్యాంగాన్ని పూర్తిగా తొలగించాలని దేశంలో ప్రయత్నం జరుగుతోందని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో పేదలను ఆదుకునే పథకాలేవీ ఉండవని చెప్పారు. రైతుల, నిరుపేదలు, మహిళల కోసం ఆ ప్రభుత్వం ఏమీ చేయదన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో గ్యాస్ సిలిండర్ రూ.1200 ఉందని, తెలంగాణలో రూ.500కే ఇస్తున్నామని గుర్తు చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభలో ప్రియాంక ప్రసంగించారు. రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. భాజపా పాలనలో పేదలపై వేసే పన్నులు నిరంతరం పెరుగుతూనే ఉంటాయి. పేద రైతులు రూ.50 వేలు, రూ.లక్ష రుణాలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారికి రుణమాఫీ చేసేందుకు భాజపా సర్కార్ అంగీకరించదు. కానీ, బడా వ్యాపారులకు మాత్రం భాజపా సర్కార్ రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసింది. కీలకమైన సంస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకొని ఆడిస్తోంది. ప్రజలు ఎలా బతుకుతున్నారో తెలుసుకునే ప్రయత్నాన్ని మోదీ ఎప్పుడూ చేయరు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రం వచ్చి ధర్మం అనే నినాదం ఎత్తుకుంటారు. ప్రజల మధ్య మతం చిచ్చు పెట్టి ఓట్లు వేయించుకుంటారు. కాంగ్రెస్‌పై భాజపా నేతలు ఎన్నో అబద్ధాలు చెప్తున్నారు. కాంగ్రెస్ కొందరి ఆస్తులు గుంజుకొని మరో వర్గానికి ఇస్తుందని భాజపా దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి మోదీ దానిని రాయలేదు. మన పూర్వీకులు ఎంతో కృషి చేసి భావితరాల కోసం రూపొందించారు. రాజ్యాంగమే మనకు ఎన్నో అవకాశాలు కల్పించింది. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది రాజ్యాంగం మాత్రమే. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని మరోసారి చాటి చెప్పాలి. ఈ రాష్ట్రానికి భాజపా ఏం చేసిందో అడగాలి. ఈ ప్రాంతం ఎంతో సుభిక్షమైనది. తెలంగాణ ప్రజలు ఎంతో కృషి చేసి ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకున్నారు. భాజపా అబద్ధాలు నమ్మి.. మోసపోయేది లేదని చాటి చెప్పాలి' అని ప్రియాంక పిలుపునిచ్చారు. దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని బిజెపి ప్రయత్నిస్తుందని ప్రియాంకగాంధీ అన్నారు. గడిచిన పదేళ్లలో మోదీ సర్కార్ బడా వ్యాపారుల కోసం మాత్రమే పని చేసిందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం మోదీ ప్రభుత్వం ఏనాడు పనిచేయలేదని విమర్శించారు. వాస్తవాలు తెలియకుండా మీడియాను మేనేజ్ చేస్తున్నారని ఫైరయ్యారు. గత ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని ప్రియాంకగాంధీ అన్నారు.బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చూస్తుందని.. బిజెపి కుట్రను అడ్డుకోవాలంటే కాంగ్రెస్ ను గెలిపించాలని ప్రియాంక గాంధీ చెప్పారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రాజేసి రాజకీయాలు చేసి, బీజేపీ సీట్లు నెగ్గే ప్రయత్నం చేస్తుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పటాన్ చెరు ప్రాంతానికి గోదావరి జలాలు రావాలన్నా, మెట్రో రైలు రావాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. మాదిగల వర్గీకరణతో పాటు ముదిరాజులను బీసీ-డీ గ్రూప్ నుంచి బీసీ-ఏ గ్రూప్ లోకి మార్చాలన్నా కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ అగ్రనేతలు చెబుతున్నారని, రాజ్యాంగాన్ని సైతం మార్చే యోచనలో బీజేపీ ఉందని ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, ఉపాధి అవకాశాలు పెరగాలంటే కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రానికి వచ్చినా కొత్త ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకపోగా, ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం మాత్రం చేశారని విమర్శించారు. ల్గ÷తులకు రుణమాఫీ చేసి వారి రుణం తీర్చుకుంటానని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం నిర్లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా వెనుకబడిందని, అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులు నెగ్గాలన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో కలిసి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డిని చేపట్టింది కాంగ్రెస్ పార్టీ అని, కానీ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్ కు పంపించాలని ప్రజలను రేవంత్ రెడ్డి కోరారు.

# ఆంధ్ర రాష్ట్రానికి సైకో జగన్ రెడ్డి నుండి విముక్తి

## శొంఠి శివరాం ప్రసాద్ గౌడ్



**విజయవాడ,మే 11( ఆంధ్రపత్రిక ) :** జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కృష్ణాజిల్లా బీసీ గౌడ్ సాధికారిక కన్వీనర్ శొంఠి శివరాం ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ ఈ 5 సంవత్సరాలుగా జగన్ రెడ్డి చేతిలో బీసీలు బలి అయ్యారని, ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే దాడులు, హత్యలు చేస్తూ బీసీలను భయపెట్టి రాజ్యమేలాడు అన్నారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి అరాచకాలకు ఎక్కువ శాతం బీసీలు బాధితులు అన్నారు. అక్రమ కేసులు, అక్రమ అరెస్టులతో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులపై, కార్యకర్తలపై బనాయించి వారి నోళ్లు నొక్కే ప్రయత్నం చేశాడు అన్నారు. జగన్ రెడ్డి అరాచకాలను తట్టుకుంటూ ఈ ఐదు సంవత్సరాలు సైకో పై పోరాటం చేస్తూ, ప్రజల పక్షాన తెలుగుదేశం పార్టీ నిలబడింది అన్నారు.జగన్ రెడ్డి అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా అప్పులు చేస్తూ, అరా కోరా సంక్షేమ అందిస్తూ ప్రజల నెత్తిన అప్పుల కుప్ప పెట్టాడన్నారు. రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా తయారు చేశాడు అన్నారు. చంద్రబాబు గారు రాష్ట్రానికి తీసుకువచ్చిన కంపెనీలు, పెట్టుబడులు జగన్ రెడ్డి ధన దాహానికి ఇతర రాష్ట్రాలకు పారిపోయాయని, యువతకు ఉద్యోగాలు లేక వలసలు వెళ్ళిపోయారు అన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్ గా తయారుచేసి వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారని, యువత డ్రగ్స్ కి, గంజాయి కి బానిసలై వారి జీవితాలు పక్కదారి పట్టాయి అన్నారు.

పేదలు కడుపునిండా అన్నం తినే అన్న క్యాంటీన్ తీసేసి జగన్ రెడ్డి పేదలకు కడుపుకొట్టాడని,రాష్ట్రానికి రాజధాని లేకుండా పాలించిన ఘనుడు జగన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు.లాండ్ టైటిలింగ్ ముసుగులో ప్రజల స్థిరాస్తులను దోచుకోవాలని జగన్ రెడ్డి కుట్రపన్నాడని, ఈ యాక్ట్ ద్వారా ప్రజల స్థిరాస్తులకు భద్రత ఉండదు అన్నారు. రాష్ట్రాన్ని, రాష్ట్ర వనరులను దోచుకోవడమే కాకుండా జగన్ రెడ్డి ప్రజల ఆస్తులపై కన్నేసాడని విమర్శించారు.సైకో జగన్ రెడ్డి కబంధ హస్తాల నుండి రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే ఈనెల 13న జరగబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, చంద్రబాబు గారిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు పామర్తి కిషోర్ బాబు,వీరంకి కుటుంబరావు పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న డాక్టర్ ఏలూరి



**తిరుపతి,మే 11( ఆంధ్రపత్రిక ) :** ఆఖరి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా తిరుమ లలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆయన దర్శించుకున్నారు. ఆయన వెంట డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సహా పలువురు కీలక నాయకులు ఉన్నారు. ఈ సందర్బంగా డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించాలని శ్రీవారిని ప్రార్థించినట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించి ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. కాగా, నడ్డా వెంట.. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, విష్ణువర్ధన్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, కోలా ఆనంద్, డాక్టర్ ఏలూరి ఉన్నారు.

## మద్యం ప్రభావం ఎన్నికల మీద చూపకుండా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు



**పొన్నూరు ,మే 11( ఆంధ్రపత్రిక ) :** సాధారణ ఎన్నికల సందర్భముగా కమిషనర్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో నోడల్ డిప్యూటీ కమిషనర్ కె. హేమంత్ నాగరాజు, నోడల్ డిప్యూటీ కమిషనర్, నెల్లూరు జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో శనివారం పొన్నూరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయం పని తీరు సమీక్షించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ స్టేషన్ పరిధి లో తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి గ్రామాలలో అనుమానిత ప్రదేశాలలో చేసిన దాడుల గురించి సమీక్షించి తగు సూచనలు ఇవ్వడమైనది. నాన్ డ్యూటి పైడ్ లిక్కర్, నాటుసారాయి, అనధికార మద్యం విక్రయాలు అక్రమ మద్యం నిల్వల గోడౌన్ ల సమాచారము సేకరించి దాడులు నిర్వహించాలన్నారు. నాన్ డ్యూటి పైడ్ లిక్కర్, నాటుసారాయి అనధికార మద్యం పాత ముద్దాయిలను బైండ్ ఓవర్ చేయుటకు వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు, పెండింగ్ వాహనములు, పెండింగ్ కేసులను త్వరితగతిన డిస్పోసల్ చేయుటకు తగు చర్యలు తీసుకో వాలన్నారు. 13 న జరుగు ఎన్నికల సందర్భముగా మద్యం ప్రభావం ఎన్నికల మీద చూపకుండా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు జరుపుటకు విధులను సమర్ధవంతంగా నిర్వవహించవలసినదిగా అదేశించారు. ఈ సమీక్షా సమావేశము నందు, సెబ్ ఏ ఈ ఏస్, గుంటూరు,కృష్ణ కిషోర్ రెడ్డి, స్టేషన్ ఇన్స్పెక్టర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం



**రెంటచింతల,మే 11( ఆంధ్రపత్రిక ) :** రెంటచింతలలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు...రెంటచింతల మే 11 (ఆంధ్రపత్రిక):మండలంలోని వివిధ గ్రామాలలో నున్న 50 పోలింగ్ కేంద్రాలు ఈ నెల 13 న నిర్వహించ నున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి మొత్తం మంది ఓటర్లు 40,603 కాగ వారిలో పురుషులు 19,531 మంది, మహిళలు 21,071 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారన్నారు. గ్రామాల వారిగా రెంటచింతల 12,966, పాలువాయి 3,642, పాలువాయిగేటు 1,464, తుమ్మకోట 4,276, కొత్తగంగరాజుపల్లి 316, పశర్లపాడు 2,484, మల్లవరం 1,688, జెట్టిపాలెం 8,302, గోలి 1,405, మిట్టగుడిపాడు 1,569, రెంటాల 4,060, మంచికల్లు 3,431 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. 197 నుంచి 246 పోలింగ్ బూత్ నెంబరు వరుకు రెంటచింతల మండలంకు చెందిన పోలింగ్ కేంద్రాలుగా నూతనంగా ఏర్పాటు చేశారన్నారు. పురుషులు కన్నా మహిళా ఓటర్లు 1.540 అధికంగా ఉన్నారు.

## భారత్‌ను అభివృద్ధి దిశగా మరింత ముందుకు తీసుకెళ్లడం

### కిరాణా స్టోర్‌లు బీ2బీ ఈ-కామర్స్ ఆఫర్‌లను స్వీకరించడానికి గల ఆరు కారణాలు

**తిరుపతి,మే 11( ఆంధ్రపత్రిక ) :** ఆధునిక డిజిటల్ యుగంలో భారతీయ రిటైల్‌కు మూలస్తంభమైన కిరాణా స్టోర్‌లు స్థిరమైన అడ్డంకిని ఎదుర్కొంటున్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ అనుగుణంగా. వ్యక్తిగతీకరించిన కస్టమర్ సేవలు, సౌకర్యాలు అందించడంలో కిరాణా యజమానులు రాణిస్తున్నప్పటికీ, సంప్రదాయ వ్యాపార పద్ధతులు కొన్నిసార్లు పురోగతికి ఆటంకం కలిగిస్తాయి. అదృష్టవశాత్తూ బీ2బీ ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు కిరాణా స్టోర్‌లలో కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, సామర్థ్యాన్ని పెంచడానికి పోటీతత్వ ప్రయోజనాన్ని పెంపొందించడానికి శక్తివంతమైన పరిష్కారాలను అందిస్తున్నాయి. కిరాణా స్టోర్‌లకు బీ2బీ ఈ-కామర్స్ అందించే ఆరు ప్రాథమిక ప్రయోజనాలు కలవు.

1.మెరుగైన సామర్థ్యం, తగ్గిన కార్యాచరణ ఖర్చులు: హోల్‌సేల్ వ్యాపారులతో బేరమాడడం, రద్దీగా ఉండే మార్కెట్‌లలో తమ కార్యకలాపాలు నిర్వహించడంమరియు దుకాణానికి సరుకులను రవాణా చేయడం వంటి వాటితో గడిపిన సమయాన్ని ఊహించుకోండి. B2B ప్లాట్‌ఫారమ్‌లు ఇలాంటి ఇబ్బందులను తొలగిస్తాయి. షెడ్యూల్ చేయబడిన డెలివరీల కోసం ఎంపికలతో పాటు విలువైన సమయాన్ని ఆదా చేయడంతోపాటు కొన్ని క్లిక్‌లతో ఆర్డర్‌లను ఉంచవచ్చు. ఇది కిరాణా యజమానులు కస్టమర్ సేవపై దృష్టి పెట్టడానికి మరి యు స్థానిక నివాసితులతో సంబంధాలను ఏర్పరచుకోవడానికి మరియు మర్చండైజింగ్ మరియు స్టాఫ్ మేనేజ్‌మెంట్ వంటి ఇన్-స్టోర్ కార్యకలాపాలపై ఎక్కువ సమయాన్ని వెచ్చించడానికి అనుమతిస్తుంది.

2.విస్తృత ఎంపిక మరియు సరసమైన ధరలు: సాంప్రదాయకంగా, కిరాణా స్టోర్‌లు పరిమితమైన స్థానిక పంపిణీదారులపై ఆధారపడతాయి, అయితే B2B ప్లాట్‌ఫారమ్‌లు డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌గా పనిచేస్తాయి, దేశవ్యాప్తంగా సరఫరాదారుల యొక్క విస్తృత నెట్‌వర్క్‌తో వాటిని కనెక్ట్ చేస్తాయి. ఇది కొత్త బ్రాండ్‌లు మరియు కొత్త కస్టమర్‌లను ఆకర్షించగల ప్రత్యేక వస్తువులతో సహా విస్తారమైన ఉత్పత్తులకు తలుపులు తెరుస్తుంది. వివిధ పంపిణీదారుల నుండి ధరలను సరిపోల్చగల సామర్థ్యం B2B ప్లాట్‌ఫారమ్ ద్వారా బల్క్ బైయింగ్ పవర్ ద్వారా మరింత ఖర్చును ఆదా చేయడంలో సహాయపడుతుంది.

3.మెరుగైన ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ ద్వారా అత్యుత్త మ మూలధన వినియోగం: అధిక డిమాండ్ ఉన్న వస్తువులు అయి పోవడం లేదా మూలధనాన్ని కట్టడి చేసే అధిక స్టాక్‌తో భారం పడడ ం వంటి సవాలు లాభాలను గణనీయంగా ప్రభావి తం చేస్తుంది. B2B ప్లాట్‌ఫారమ్‌లు రియల్ టైమ్ ఇన్వెం టరీ ట్రాకింగ్ టూల్స్ మరియు అమ్మకాల డేటా ఆధారంగా ఆటోమే టెడ్ ఇన్వెంటరీ రీఆర్డరింగ్ వంటి విలువైన వనరులను అందిస్తా యి. ఈ వ్యూహాత్మక విధానం స్టాక్‌అవుట్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది మరియు అమ్మకాల అవకాశాలను మరింత మెరుగుపరుస్తుంది, మూలధనం యొక్క సరైన వినియోగాన్ని మరియు లాభదాయకతను పెంచుతుంది.

4.డేటా-ఆధారిత నిర్ణయాధికారం: కొన్ని B2Bప్లాట్‌ఫారమ్‌లు కేవలం ఆర్డర్ ప్రాసెసింగ్‌కు మించి ఉంటాయి మరియు కిరాణా యజమానులకు సమర్థవంతమైన విశ్లేషణ సాధనాలను అందిస్తాయి, ఇవి విలువైన అంతర్దృష్టులను అందించగలవు.

a.అత్యధికంగా అమ్ముడైన ఉత్పత్తులు మరియు స్థానిక కొనుగోలు ధోరణులపై డేటా, కస్టమర్ ప్రాధాన్యతలకు అనుగుణంగా వారి జాబితాను రూపొందించడానికి వీలు కల్పిస్తుంది.

b.కొనుగోలు నమూనాలు మరియు పీక్ డిమాండ్ పీరియడ్‌లపై సమాచారం, స్టాక్ స్థాయిలను ఆప్టిమైజ్ చేయడానికి మరియు నిదానమైన సీజన్‌లలో ఓవర్‌స్టాకింగ్‌ను నివారించడానికి వీలు కల్పిస్తుంది.

c.కస్టమర్ డెమోగ్రాఫిక్స్‌లో అంతర్దృష్టులు, టార్గెట్ ప్రమోషన్‌లు మరియు మార్కెటింగ్ వ్యూహాలను అభివృద్ధి చేయడంలో వారికి సహాయపడతాయి.

5.పెద్ద రిటైలర్‌లను చేర్చడం ద్వారా రిటైల్ రంగాన్ని సమం చేయడం: భారతీయ రిటైల్ రంగం క్రమబద్ధీకరించబడిన కొనుగోలు ప్రక్రియల కోసం సాంకేతికతను ఉపయోగించుకునే పెద్ద, ఆధునిక రిటైలర్‌ల ఆవిర్భావానికి సాక్ష్యమిస్తోంది. B2B ఇ-కామర్స్‌ను స్వీకరించడం ద్వారా, కిరాణా స్టోర్‌లు పోల్చదగిన స్థాయి సామర్థ్యం మరియు వ్యయ ప్రయోజనాలను పొందగలవు, వాటి ఉత్పత్తి ఎంపికను అందించడానికి వీలు కల్పిస్తాయి మరియు పెద్ద సంస్థలతో సమర్థవంతంగా పోటీ పడేలా శక్తివంతం చేస్తాయి. ఈ వ్యూహాత్మక చర్య కిరాణా స్టోర్‌లను పోటీకి సిద్ధంగా ఉంచడమే కాకుండా ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న రిటైల్ రంగంలో వారిఔచిత్యాన్ని నిర్ధారిస్తుంది.

6.సౌలభ్యంతో పాటు సమయం ఆదా: బిజీగా ఉండే కిరానా స్టోర్ ఓనర్‌లకు, సమయం చాలా ముఖ్యం మరియు రిపీటెటివ్ ప్రొక్యూర్‌మెంట్ టాస్క్‌లలో సమయాన్ని ఆదా చేయడంలో వారికి సహాయపడటానికి, B2B ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు డిజిటల్ కామర్స్ ప్రయోజనాలను విస్తరించడం ద్వారా గేమ్-ఛేంజర్‌గా ఉంటాయి.

ఈ ప్లాట్‌ఫారమ్‌లు కిరానా స్టోర్‌లను వారి ఇళ్ల సౌలభ్యం నుండి 24/7 ఆర్డర్‌లను ఇవ్వడానికి వీలు కల్పిస్తాయి, ఇంటర్నెట్ కనెక్షన్ మాత్రమే అవసరం. ఇది నియంత్రిత వ్యాపార సమయాల్లో పంపిణీదారులకు వెళ్లవలసిన అవసరాన్ని సమర్థవంతంగా తొలగిస్తుంది, తద్వారా వారి విలువైన సమయం మరియు వనరులను ఆదా చేస్తుంది.

## విజయవాడ రైల్వేస్టేషన్లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుండి 12 కేజీల గంజాయి



**విజయవాడ,మే 11( ఆంధ్రపత్రిక ) :** స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు జిఆర్పి సిఐ పి.శ్రీనివాస్, ఆర్.పి.ఎఫ్ సీఐ ఫతే ఆలీ బేగ్ తెలిపారు. శనివారం నిర్వహిం చిన విలేకరుల సమా వేశం లోవారు మాట్లాడుతూ ఉన్నతాధి కారులు, రైల్వేడిఎస్పీ బి.వి.ఎన్.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రైల్వేస్టేషన్లలో జిఆర్పి, ఆర్.పి.ఎఫ్ సిబ్బంది సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా జి.ఆర్. పి ఎస్ఐ ఖాదర్ హుస్సేన్, ఆర్పీఎఫ్ ఎస్ఐ మకట్లాల్ నాయక్, ది లీవ్ నేతృత్వంలో ప్రత్యేక టీం రైల్వేస్టేషన్లో తనిఖీలు చేస్తుండగా ఉదయం ప్లాట్ఫామ్ ఒకటిలో సౌత్ బుకింగ్ వద్ద ఒడిస్సా రాషం లోన్ని కందమాల్ జిల్లాకు చెందిన అలొక్ గిగల్(32) కన్ను స్వామ ప్రవీణ్ (25) అనే ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగాసంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని రెండు బ్యాగ్లను తనిఖీ చేయగా ఒకొక్కరి బ్యాగ్ 6 కేజిల గంజాయి లభించింది. వారినీ విచారణ చేయగా ఒడిస్సా ప్రాంతంలో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా తమిళనాడులోని మధురైకి తరలించి అక్కడ ఎక్కువ ధరకు చిన్నచిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తామని తెలిపారన్నారు.

విశాఖపట్నం నుండి టికెట్ లెకుండా కోరమండల్ ఎక్స్ప్రెస్లో బయలుదేరి విజయవాడకు చేరుకున్నారు. ఇక్కడ నుండి మరో రైలు కోసం వేచిఉండగా తాము అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందులపై ఎన్డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు.

## అపోలో టైర్స్ కొత్త టీవీసీ ఆవిష్కరణ




**విజయవాడ,మే 11( ఆంధ్రపత్రిక ) :** అపోలో విరాట్ టైర్‌ను నేటి ప్రగతిశీల రైతులకు నమ్మకమైన తోడుగా ప్రదర్శించే రీతిలో ఆకర్షణీయమైన టెలివిజన్ వాణిజ్య ప్రకటనను అపోలో టైర్స్ అందిస్తుంది. ఆధునిక వ్యవసాయం యొక్క మార్గదర్శక సారాంశానికి ప్రతీకగా నిలిచిన విరాట్ వెనుక ఉన్న రహస్యాన్ని వెలికితీసేందుకు ఒక ఉత్సాహభరితమైన జర్నలిస్ట్ అన్వేషణను ప్రారంభించడాన్ని కథనం అనుసరిస్తుంది. డ్రోన్ సహాయక పంట పర్యవేక్షణ నుండి అత్యాధునిక నీటిపారుదల వ్యవస్థల వరకు ఆధునిక సాంకేతికతల శ్రేణిని చూసిన ఆమె, ఆధునిక పొలాల ద్వారా ప్రయాణిస్తున్నప్పుడు ఆమె ఉత్సుకత మరింత తీవ్రమవుతుంది. విరాట్ అనేది రైతు పేరు కాదు, అపోలో విరాట్ టైర్ల ద్వారా పురోగతి, మార్పు యొక్క స్వరూపం. ఈ వెల్లడి రైతులను ఆవిష్కరణలను స్వీకరించడానికి, వ్యవసాయంలో పరివర్తనాత్మక మార్పును అందించడంలో అపోలో విరాట్ టైర్ల యొక్క కీలక పాత్రను నొక్కి చెబుతుంది.

## పోలింగు మరుసటి రోజు పోలింగు సిబ్బందికి స్పెషల్ క్యాజువల్ లీవు మంజూరు చేయాలి

### ఏపి జేఏసి అమరావతి రాష్ట్ర కమిటి విజ్ఞప్తి



**విజయవాడ ,మే 11( ఆంధ్రపత్రిక ) :** ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు మే 12వ తేదీ నుండి 13వ తేదీ పోలింగ్ రోజు ఎన్నికలు విధులు ముగించే సరికి రాత్రి దాటి కొన్ని చోట్ల మరుసటి రోజు తెల్లవారు జామువరకు పనిచేస్తారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కూడా అక్కడ పోలింగ్ రోజు పాల్గొనే ఉద్యోగులు అందరికీ 14వ తేదీ ప్రత్యేక సెలవు దినంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది.కావున పోలింగ్ మరుసటి రోజు తేదిః14-5-24 న పిఓ/ఏపిఓ/ఓపిఓ మరియు పోలింగు విధులకు హాజరయ్యే సిబ్బంది అందరికి స్పెషల్ క్యాజువల్ లీవు (ఆన్ డ్యూటీ) మంజూరు చేసేలా గౌః ఏపి రాష్ట్ర ప్రధాన ఎన్నిక కమిషనర్ చర్యలు తీసుకోవాలని, తెలంగాణాలో కూడా ఎన్నికల మరుసటి రోజు ఎన్నికలకు హాజరయ్యే సిబ్బంది అందరికీ సెలవు మంజూరు చేసారని, కావున ఏపిలో ఎన్నికలు విదులకు హాజరయ్యే ఉద్యోగులకు ఈనెల 14వ తేదీనీ ప్రత్యేక సెలవుగా ప్రకటించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి పక్షాన లేఖను ఏపిజేఏసి అమరావతి స్టేట్ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటిరీ జెనరల్ పలిశెట్టి దామోదరరావు, స్టేట్ అసోషియేట్ ఛైర్మన్ టి.వి.ఫణిపేర్రాజు, స్టేట్ కోశాధికారి వి.వి.మురళి కృష్ణనాయుడు శనివారం సీఈఓ శ్రీ ముఖేష్ కుమార్ మీనా ఐఏఎస్ గారిని వెలగపూడి సచివాలయంలో ఆయన ఛాంబర్ లో కలిసి కోరడమైనది.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం పంచేయాలి

### నగర శాఖ ప్రతిష్టలను ఇనుమడింప చేయాలి..

### ఎన్జీవో సంఘం నేత విద్యాసాగర్.



**విజయవాడ ,మే 11( ఆంధ్రపత్రిక ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం గా నూతన కార్యవర్గం పనిచేసి నగరశాఖ ప్రతిష్టను మరింత యినుమడింప చేయాలని ఎన్జీవో సంఘ యన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ . విద్యా సాగర్ అన్నారు. ఎపి ఎన్జీవో అసోసియేషన్ విజయవాడ నగర శాఖ లో కార్యవర్గ సభుల పదవులకు ఎన్జీవో హెూం లో కో -ఆప్షన్ విధానం లో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ కార్యదర్శి ఎండి ఇక్బాల్ ఆధ్వర్యంలో కార్యక్రమంలో నగర నూతన అధ్యక్షుడుగా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన సివిఆర్ ప్రసాద్ (మలేరియా) బి. రాజశేఖర్ (సహకార)సహాధ్యక్షులుగా, ఎస్ కే నజీరుద్దీన్ (జలవనరులు)కార్యదర్శిగా, వ శ్రీనివాస్ (వ్యవసాయశాఖ)కోశాధికారిగా ఎం. శ్రీనివాస్ (పంచాయితీ రాజ్)సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ గతంలో ఇదే పదవులు నిర్వహించిన నాయకులు వేర్వేరు జిల్లాలకు బదిలీ కావడంతో ఈ ఎంపిక చేసామన్నారు. రాష్ట్రంలోనే విజయవాడ నగర కార్యవర్గం అత్యధిక సభ్యులతో ఉన్న కార్యావర్గాల్లో ఒకటని వివరించారు. ఈ పదవులకు ఎంపిక చేసిన ఈ నాయకులు గతంలో తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న విజయవాడ వంటి నగరంలో ఎంతోమంది ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఈ నూతన నాయకులపై ఉందన్నారు. జిల్లా కార్యవర్గం ఎంపిక చేసిన ఈ నూతన నాయకత్వం ద్వారా విజయవాడ సంఘం పేరు ప్రతిష్టలు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిధ్వనించేలా పనిచేయాలని కోరారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన నూతన నేతలు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అప్పగించిన పదవులలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి విజయవాడ నగర విభాగ ఎన్జీవో సంఘం పేరు ప్రతిష్టలను ఇనుమడింప చేస్తామన్నారు. తమ సంఘంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం లో నగర శాఖ మాజీ అధ్యక్షులు జి.నారాయణరావు ,సత్యనారాయణ రాజారావు జె.స్వామి జిల్లా నగర కార్యవర్గ సభ్యులు వివిధ శాఖల ఉద్యోగుల పాల్గొని నూతన కార్యవర్గ సభ్యుల ను అభినందించారు.

# ప్రకాశంలో నీటి శుద్ధి యంత్రం ఆవిష్కరణ



**ప్రకాశం,మే 11( ఆంధ్రపత్రిక ) :**ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో 50 లక్షల విలువ గా వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ సిస్టమ్ పరికరాన్ని నూతనంగా ఈ శనివారం ఆవిష్కరించినట్టు యాజమాన్యం ఒక ప్రకటనలో చెప్పింది. గ్రీన్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్, బెంగళూర్ సంస్థ ఇన్స్టలేషన్ చేసిందన్నారు. ప్రకృతి పరిరక్షణ కార్యక్రమంలో ప్రకాశం యాజమాన్యం కృషి బేస్ గా ఉందని ప్రారంభోత్సవ కార్యక్రమానికి చేసిన ప్రకాశం జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్ ప్రకాష్ ప్రశంసించారు. క్యాంపస్ లో ఎటు చూసినా సోలార్, విండ్ పవర్, హాస్టల్లో వినియోగించిన నీటిని పరిశుద్ధం చేసే ప్లాంట్ ఇలా పరిరక్షణకు యాజమాన్యం పెట్టుబడులు వారి కృషికి తార్కాణమన్నారు. నీరు లేనిదే జీవితం అసాధ్యం, అలాంటి నీరును వృధా కాకుండ, శుద్ధి చేసే పరికరాన్ని కళాశాల ప్రాంగణంలో ఆవిష్కరించడం హర్షనీయమన్నారు. కార్యక్రమానికి ఆహ్వానించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రతి నీటి బొట్టు ప్రగతికి మెట్టు అనే నినాదంతో ఈ పరికారాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డాక్టరు కంచర్ల విజయ శ్రీనివాస్ శుద్ధి చేసిన మురుగు నీటిని ప్రాంగణం లో ఉన్న లాన్ కు, మొక్కలకు మరియు పంట పొలానికి ఉపయోగిస్తామన్నారు. ఈ పరికరంతో ప్రాంగణంలో భూగర్భ జలాల పరిమాణల పెంపుదల తో పాటు నీటి వృధా అరికట్టవచ్చున్నారు. రోజుకి లక్ష లీటర్ల పరిశుద్ధ నీటిని అందించే సామర్థ్యం ఈ ప్లాంట్ ప్రత్యేకత అని తెలిపారు.పరికరాన్ని ప్రారంభించిన అనంతరం, విద్యార్థులతో రెడ్ క్రాస్ సొసైటీ ముఖ్య ఉద్దేశాన్ని మరియ రక్త దానం ప్రాముఖ్యతను విద్యార్థులకు సొసైటీ బృంద సభ్యులు భీమేశ్వర రావు మరియు నాగేశ్వర రావు వివరించారు. రక్త దానం తో ఆరోగ్యం క్షీణిస్తుంది అనేది అపోహ మాత్రమే అని అన్నారు. రక్త దానం దాదాపు ప్రాణ దానం అనే విషయాన్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎకడమిక్ ఇన్చార్జి యస్.యన్ మీరావలి, యం.బి.ఏ హెచ్.ఓ.డి డాక్టరు పావని, సివిల్ హెచ్.ఓ.డి డాక్టరు రాఘవ శర్మ, డాక్టర్ సురియా మీరా షరీఫ్, ఎలక్ట్రీషియన్ బాబు రావు, అంక బాబు, సదానంద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకారం ఇవ్వాలి



**బాపట్ల మే 11 (ఆంధ్రపత్రిక) :** ప్రశాంత వాతావరణంలో బాపట్ల జిల్లాలో ఎన్నికలు నిర్వహించడానికి సంసిద్ధమయ్యామని బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా ఎన్నికల అధికారి మీడియా సమావేశం నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రకటించారు. పౌరులు స్వేచ్ఛగా ఓటు వేయడం కొరకు 120 శాతం పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. 12 న డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ యంత్రాలు, సిబ్బందిని కేంద్రాలకు పంపుతామన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా సాయంత్రం నుంచి తమ ప్రచారాలను నిలిపివేయాలన్నారు. ముందస్తు అనుమతి తీసుకుంటేనే కేవలం ఇంటింట ప్రచారానికి నలుగురితో కలిసి అభ్యర్థి వెళ్లవచ్చన్నారు. హోర్డింగులు, పార్టీ గుర్తులు, కరపత్రాలతో ప్రచారాలు చేయరాదన్నారు. ఎన్నికల సమయంలో ఎగ్జిట్ పోల్స్ ప్రచురణ, ప్రసారాలు నిషేధమన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి మూడు వాహనాలు అనుమతిస్తామన్నారు. ఒక్కొక్క వాహనంలో ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయరాదని, అలా చేసినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారి రంజిత్ బాషా చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి టీమ్ లు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు రూ.5.30కోట్ల విలువచేసే మద్యం, బంగారం, వెండి ఆభరణాలు, బహుమతులు, ప్రచార సామగ్రి, తదితరమైన వాటిని సీజ్ చేశామన్నారు. సి-విజిల్ యాప్ లో వచ్చిన 735 ఫిర్యాదులను 32 నిమిషాల్లోనే పరిష్కరిస్తున్నామని చెప్పారు. కోడ్ ఉల్లంఘించిన నలుగురు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశామని, 31 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, 42 మంది వాలంటీర్లను తొలగించా మన్నారు. రాజ్యాంగం కల్పించిన ఏంతో విలువైన ఓటు హక్కును పౌరులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గత ఎన్నికలలో సుమారుగా 86% ఓటింగ్ జరగ్గా, ప్రస్తుతం మరింత పెరగాలన్నారు. ఓటర్లు చైతన్యవంతులై ఖచ్చితంగా ఓటు వేయాలని ఆయన సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కొరకు సక్షం యాప్ అమల్లోకి వచ్చిందని, ముందస్తుగా నమోదు చేసుకున్నవారికి వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు.ఎన్నికలు సమీపించినందున ఈసిఐ డ్రైడేగా ప్రకటించడంతో మద్యం విక్రయాలను నిలిపి వేశామని కలెక్టర్ చెప్పారు. రెండు వాహనాలు స్వాధీనం చేసుకోగా, లౌడ్ స్పీకర్ పై 9 కేసులు, అక్రమ మద్యంపై 14కేసులు, మరో 19 మంది మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. పోలింగ్ రోజున బల్క్ ఎస్ఎంఎస్ లు పంపినా, ముందస్తు అనుమతి లేకుండా పత్రికలలో ముద్రించడం, టీవీ చానల్స్ లో ప్రసారాలు చేసినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. 1,030 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసి కలెక్టరేట్ నుంచి నిఘా ఉంచుతామన్నారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ యంత్రాలు ఒంగోలులోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరుస్తారన్నారు.

ఎన్నికల సమయంలో బాపట్ల జిల్లాలో గొడవలు, అల్లర్లు నియంత్రణకు పదివేల మందిని బైండోవర్ చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రచారం ముగుస్తుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు అయిదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడరాదన్నారు. అక్రమ మద్యం, నగదు, బహుమతులతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా పోలీస్ పెట్రోలింగ్ టీమ్ లు సంచరిస్తాయన్నారు. మిగిలిన టీమ్ లు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. రానున్న 48 గంటలలో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలోని పోలీస్ బలగాలే గాకుండా తమిళనాడు రాష్ట్రం నుండి 250 మంది పోలీసులు, 5 %దీూఖీ, 3 ఞూూ, 1 ×ుదీూ% కంపెనీల సాయుధ బలగాలు జిల్లాలో విధులు నిర్వహిస్తాయన్నారు. జిల్లాలో మొత్తం 913 పోలింగ్ ప్రాంతాలలో 1,510 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. 269 ప్రాంతాలలో 337 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. గతంలో జరిగిన గొడవలు, ఇతర అవాంఛనీయ ఘటనలను దృష్టిలో ఉంచుకుని, అదనంగా పోలీసు బందోబస్తు నియమించామన్నారు.

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రితో వెళ్లే పోలింగ్ సిబ్బందికి సాయుధ బలగాలు ఎస్కార్ట్ గా వెళ్తాయని ఎస్పీ చెప్పారు. పోలింగ్ తదుపరి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్ లోకి వెళ్లేంతవరకు అత్యధిక ప్రాధాన్యత కింద ఎస్కార్ట్ ఉంటుందన్నారు. వీరి భద్రతకు ఏటువంటి ఆటంకం కలుగకూడదు, ఒకవేళ ఈ రెండు రోజులు ఎవరైనా ఎక్కడైనా గొడవలకు పాల్పడినా, ఈవీఎంలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించినా, పోలింగ్ సిబ్బందిపై గొడవలకు, దౌర్జన్యానికి పాల్పడితే వారిపై అత్యంత తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ జరిగే రోజున పోలీస్ సిబ్బందితోపాటు ఎన్ఎస్ఎస్, ఎన్.సి.సి., మాజీ సైనికులు పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిదిలో ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ అవసరాల కన్నా ప్రజలే ముఖ్యం



**విజయవాడ,మే 11 (ఆంధ్రపత్రిక) :** రాజకీయ అవసరాల కన్నా ప్రజలే ముఖ్యమని ప్రజలే ముందని చెప్పిన- నమ్మిన గొప్ప రాజనీతిజ్ఞుడు చంద్రబాబు అన్ని పెదపూడి ఆనంద్ బాబు కొనియ్యాడారు. రాజకీయ అవసరాల కన్నా ప్రజలే ముఖ్యమని,ప్రజలే ముందని చెప్పిన-నమ్మిన గొప్ప రాజనీతిజ్ఞుడు చంద్రబాబు. దేశ,రాష్ట్ర రాజ కీయాలలో గొప్ప చరిత్ర కలిగిన చంద్రబాబు నాయుడు లాంటి సమర్ధ నాయకుడి పాలనను మళ్లీ ఏకపక్షంగా ప్రజలు ముఖ్య మంత్రిగా కోరుకుంటున్నారూ .మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బలసౌరి గారిని గాజు గ్లాసు గుర్తు పై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిచించాలి మరియు పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా ని సైకిల్ గుర్తు పై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిచించాలి అలాగే రామ రాజ్య స్థాపన కు అందరూ కలసికట్టుగా కృషి చేయా లని కృష్ణ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పెదపూడి ఆనంద్ బాబు పిలుపునిచ్చారు.

## పల్నాడు రైతులు గెలవాలంటే

# తెలుగుదేశం పార్టీ గెలవాలి

### నీటిని తీసుకొచ్చి పల్నాడుని సశ్యశ్యామలం చేస్తాం - ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను సమూలంగా పెకిలించి వేస్తాం -ప్రచార ర్యాలీలో జీవి ఆంజనేయులు



**వినుకొండ,మే 11( ఆంధ్రపత్రిక):** శివయ్య స్తూపం నుండి కరెంట్ సబ్ స్టేషన్ వరకు పట్టణం వరకు ఉమ్మడి కూటమి వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవి ఆంజనేయులు ప్రచారం ముగింపు ర్యాలీ ఘనంగా జరిగింది. భారీ ట్రాక్టర్ ర్యాలీతో ఈ కార్యక్రమం జరిగింది. నీటిని తెచ్చుకుంటేనే మన పల్నాడు ప్రజల జీవనగ మనం మారేది.. మనం నీరందించుకోవాలంటే వరికెపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేసుకోవాలి, సాగర్ కుడి కాలవను గోదావరి జలాలతో స్థిరీకరణ చేసుకోవాలి, జల్జీవన్ మిషను పూర్తి చేసుకోవాలి,, ఇవన్నీ నిబద్ధతగా జరగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలి,, చంద్రబాబు నాయుడు సీఎం కావాలి,, మే 13 వ తారీఖున సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. - ప్రజలకు ఇబ్బందిగా మారబోతున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను తెదేపా అధికారంలోకి రాగానే సమూలంగా పెకిలించి వేస్తుందని అన్నారు.ప్రజలకు భూ సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటామని అన్నారు. పల్నాడు ప్రజలు కులమత వర్గ బేధాలు చూడరని.. ఎవరైతే మంచి చేస్తారో వారి వైపే నిలబడి గెలిపించుకుంటారని అన్నారు. ప్రజలకు అండగా నిలబడ్డామని, మరో మారు వారికి మంచి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని పలనాటి ప్రజలంతా మా వైపే ఉన్నారన్న నమ్మకం మాకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఎవరి బలవంతంగానో ఇక్కడ పోటీ చేయట్లేదని, ఈ ప్రాంతం పైన మక్కువతో, అభివృద్ధిపై ఇష్టంతో ఇక్కడ పోటీ చేస్తున్నానని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

# మరొక్క అవకాశం ఇవ్వండి...

### -జరుగుతున్న అభివృద్ధిపనులు పూర్తి చేస్తా- వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు

**-ఐదేళ్ళలో ఎంతో అభివృద్ధి జరిగింది -ప్రజలకు ఎంతో మేలు చేసిన జగన్ ప్రభుత్వం-వినుకొండలో ఎన్నో మార్పులు వచ్చాయి...-శక్తి వంచన లేకుండా పనిచేశా...-దుష్ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దు -మంచిని ఆదరించాలని విజ్ఞప్తి-మాజీ ఎమ్మెల్యే మక్కెనకు చురకలు-పోటీ చేస్తుంది జీవీనా మక్కెనా అని ప్రశ్న-రౌడీ రాజ్యం చేయాలని చూస్తున్నారు-ఎన్నికలు సజావుగా సాగానిచ్చేలా లేరు -ప్రత్యేక బృందాలు రప్పించండి కలెక్టర్ కు విజ్ఞప్తి.**



**వినుకొండ,మే 11( ఆంధ్రపత్రిక):** వినుకొండ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ప్రజలు మరొక్క మారు అవకాశం కల్పించాలని వైసీపీ అభ్యర్థి శాసనసభ్యులు శ్రీ బొల్లా బొల్లా బ్రహ్మనాయుడు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీల కులు యర్రం వెంకటేశ్వర రెడ్డి తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనా యుడు మాట్లాడుతూ ప్రజలకు తనికిచ్చిన అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని వినుకొండలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యాలయాల్లో నూతన భావనాలు ఏర్పాటు చేయటంతోపాటు, ఎన్ఎస్పీ కాలనీలో రెండు ఎకరాలతో బాలికోన్నత పాఠశాల (ఫస్ట్వర్డు) నూతన భవన నిర్మాణం చేపట్టామని తెలిపారు. అదేవిధంగా 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి నాబార్డు నుంచి నిధులు తేవటం, పనులకు టెండర్లు పిలవటం జరిగాయన్నారు. అదేవిధంగా ఎన్ఎస్పీకాలనీలో షాపింగ్ కాంప్లెక్స్, కూరగాయల మార్కెట్ నిర్మాణానికి అను మతులు తెచ్చామన్నారు. ఏళ్లతరబడి నిరుపయోగంగా ఉన్న సన్ని ధి వెంకట సుబ్బయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సు రు.3.45 కోట్లతో నిర్మాణం పూర్తి చేసి, పట్టణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని, పట్టణ ప్రజలకు ప్రధాన సమస్యగా ఉన్న తాగునీటి సమస్యకోసం రు.60 లక్షలతో 60 ఎకరాల సింగరచెరువును 270 ఎకరాల చెరువుగా విస్తరించి నీటి నిల్వ సామర్థ్యం పెంచి తాగునీటి కొరత తీర్చామన్నారు. రు.2కోట్లతో 11 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ ను నిర్మించి, రు.75 లక్షలతో పైప్ లైన్ లు ఏర్పాటు చేశామని, రు.161 కోట్లతో భవిష్యత్లో నీటి సమస్యను పూర్తిగా తొలగించేందుకు నీటి నిల్వ ట్యాంకులు నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. నూజండ్ల రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగిందని, అధికారంలోకి వచ్చాక కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామని, కొండపైన శ్రీ రామలింగేశ్వర ఆలయం పునర్నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు.

పట్టణంలోని ఎన్.ఎస్.పి.కాలవకట్టకు ఇరువైపులా సి.సి. రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, ఎన్ఎస్పీలోని విద్యానగర్ సమీపంలో రు. 95 లక్షల రూపాయలతో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం అందుబాటులోకి వచ్చిందని, అక్కడ పేదలకు వైద్య సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ముందు భాగంలో డంపింగ్ యార్డుగా వాడుతున్న స్థలాన్ని ఆక్రమణల చెరనుండి కాపాడి దుర్గంధభరితంగా ఉన్న దానిని కాలేజీకి అనుసంధానంగా స్టేడియం నిర్మాణం చేయాలని రు.1కోటి నిధులతో చుట్టూ ప్రహరీ నిర్మించి, మట్టి తోలి రూపురేఖలు మార్చామన్నారు. రు.1.11 కోట్లతో చెత్త రవాణా కేంద్రం ఏర్పాటు, రు.1.28 కోట్లతో వినుకొండ పట్టణంలో మలశుద్ధి కేంద్రాలు ఏర్పాటు జరిగాయని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కట్టుబడి పట్టణంలోని పెట్రోలు బంక్వద్ద ఆక్రమణకు గురైన రోడ్డును పునరుద్ధరించి తారురోడ్డు నిర్మాణం చేశామన్నారు.

రెండు దశాబ్ధాలుగా పట్టణంలో ఇళ్ళు లేని నిరుపేదలకు జగనన్న కాలనీల ఏర్పాటులో భాగంగా వెంకుపాలెం శివారులో సుమారు 100 ఎకరాలలో సుమారు రు.22కోట్లతో 5,118 మంది ఇళ్ళ పట్టాలు పంపిణీ జరిగిందని,ఇళ్ళ నిర్మాణాలు వేగంగాజరుగుతున్నా యి. ఈ కాలనీలో అత్యాధునిక త్రీఫేజ్ విద్యుత్లన్, కోట్లాది రూపా యలు ఖర్చుచేసి విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశామని, ఇది మరో వినుకొండగా మారుతుందనటంలో సందేహంలేదన్నారు. తద్వారా పేదలకు సొంత ఇళ్ళు లేదన్న బాధ కూడా తీరుతుందని చెప్పారు.

ఈపూరు మండలంలో నూతనంగా ఎంపీడీవో కార్యాలయం నిర్మాణ ం చేపట్టామని, 10 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం, వనికుంట లో మోడల్ స్కూల్ పనులు చేపట్టామన్నారు. బొల్లాపల్లి మండలంలో వరికపుడిశలకు అనుమతులు తెచ్చి, మెగా ఇంజనీరింగ్ సంస్థ వారి ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. నూజండ్ల మండలంలో ఐదు లిఫ్ట ఇరిగేషన్ల కు అనుమతులు తెచ్చామన్నారు. వినుకొండ రూరల్ మండలపరిధిలో నాగిరెడ్డిపల్లి, పువ్వాడ వద్ద రెండు బ్రిడ్జిలు ఏర్పాటు చేశామన్నారు.

తెల్లపాడులో 220 ఎకరాల్లో ఆర్టికల్చర్ కాలేజీకి అనుమతులు తెచ్చామని, అగ్రికల్చర్ కాలేజీతోపాటు, వినుకొండలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు అనుమతులు తెచ్చామన్నారు. ఒక నర్సింగ్ కాలేజీ కూడా తెస్తామని చెప్పారు. గతంలో ఏ నాయకుడూ చేయని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని కొన్ని పూర్తితవగా మరికొన్ని పనులు జరుగుతున్నాయని, పట్టణంలో ఆటోనగర్ కు 10ఎకరాలు కేటాయించామని, అదేవిధంగా లారీ స్టాండింగ్కు మరో 6 ఎకరాలు ఇచ్చామన్నారు. శావల్యాపురం లో సొసైటీ తరపున కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేశామన్నారు. కనుమర్లపూడి వద్ద 40 లక్షలతో బ్రిడ్జి నిర్మించామని, అదేవిధంగా పెదకంచర్లకు సి. సిరోడ్డు, బ్రిడ్జి నిర్మించామన్నారు. ఈ తరుణంలో మరెక్కమారు ఎన్నికల్లో ప్రజలు తనకు అవకాశం ఇచ్చి అభివృద్ధిని కొనసాగించి, వినుకొండను అభివృద్ధి చెందిన ప్రాంతంగా చేసేందుకుఅవకాశం కల్పించాలని కోరారు...

## రాష్ట్ర యస్సి,ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**కొరిశపాడు మే 11( ఆంధ్రపత్రిక):**మహాత్మ జ్యోతిరావుపూలే మరియు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి జయంతి కార్యక్రమంల సందర్బంగా అద్దంకి బంగళా రోడ్డు లోని అంబేద్కర్ గారి విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యస్సి ఎస్టీ బీసీ మైనారిటీస్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం. ప్రారంభించారు. చలివేంద్రం నిర్వహణకు కావలసిన ఆర్థిక సహకారం అందించిన పెద్దలు ఉబ్బా దేవపాలన రిటైర్డ్ రిజినల్ జాయింట్ డైరెక్టర్ హయ్యర్ ఎడ్యుకేషన్ మరియు శ్రీ విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రిటైర్డ్ తెలుగు పండిట్ కు యస్సి, ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక రాష్ట్ర సంఘ అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేశారు. ఈ కార్యక్రమం లో జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, అంకం నాగరాజు, శ్యాంసన్ దళిత నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్నికల ప్రచారం

## ఓటర్లకు తాయిలాలు మద్యం పంపిణీ పై అభ్యర్థుల దృష్టి

**కొరిశపాడు మే 11( ఆంధ్రపత్రిక):** శనివారం సాయంత్రం తో సాధారణ ఎన్నికల ప్రసారము ముగిసినది. నిన్నటి వరకు గ్రామాలలో వివిధ పార్టీలు తమ ప్రచార వాహనాల్లో డీజేబాక్స్ లతో 20 రోజుల పాటు రకరకాల పాటలతో హోరెత్తించాయి.తెలంగాణ గాయకులతో ప్రధానంగా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధానపార్టీలు పాటలు రూపొందించారు. స్థానిక ప్రచారమాధ్యమాలు, యూట్యూబ్ ఛానల్ లను విరివిగా ఉపయోగించుకున్నారు. సోషల్ మీడియాను ఎన్నికలకు ఒక ఆయుధం గా వివిధ పార్టీ లు వినియోగించు కున్నాయి. ఆయాగ్రామాలలో తమ అనుమాయలను నియమించుకొని వార్డు వారీగా బూతు వారీగా మొత్తం ఎన్ని ఓట్లు ఉన్నాయి మన పార్టీకి ఎన్నిఅనుకూలంగా ఉన్నాయి అనే విషయం ఆయా గ్రామనాయకుల ద్వారా సేకరించి ఆయా పార్టీలకు పడేఓట్లు విడిపోకుండా ముందు వారికి తాయిలంగా నగదు మద్యం పంపిణీచేసి ఆ తరువాత మన పార్టీలకు ఎన్నిఓట్లు ఆకర్షణచేయగలుగుతాము అనే దానిపై దృష్టిపెడుతున్నారు. గ్రామాలలో ఓటుఉండి దూర ప్రాంతంలో నివసిస్తున్న వారికి రాను పోను ప్రయాణ ఖర్చుతో పాటు ఓటుకి ఆయాగ్రామాల లో ఉన్న ఓటర్లు వారియొక్క డిమాండ్ ను బట్టి రెండువేల నుంచి ఐదువేల దాకా పంపిణీచేస్తున్నారు. స్థానిక నాయకులను నమ్మే పరిస్థితి లేకుండా ప్రధానపార్టీ అభ్యర్థులు తరపున వారి మనుషులను నియమించుకుని వారిద్వారా పేర్లు వ్రాసుకుని డబ్బులు పంచుతున్నారు. స్థానిక నాయకులు ప్రమేయంలేకుండా ఎన్నికల తర్వాత గొడవలులేకుండా ప్రధానపార్టీలు జాగ్రత్త పడుతున్నాయి.మద్యపాన ప్రియులకు వారం ముందుగానే ఆయా గ్రామాలలో ఓటర్లను బట్టి మద్యంషాప్ ల నుండి క్వార్టర్ బాటిల్ కు ఐదు నుండి10 రూపాయలు ఎక్కువఇచ్చి కొనుగోలు చేసి ఆయా గ్రామాలలో డంపింగ్ చేశారు .ప్రధాన పార్టీ లు షాఫ్ ల తరపున మండలానికి రెండు మూడు లోడ్ లు ఒక కూడలిలో దింపి దగ్గరిగా ఉన్న గ్రామాలకు పంపిణీ చేసినట్లు ఓటర్లు గుసగుసలాడుతున్నారు ఇవన్నీ కూడా అధికారులకు తెలిసిన ఏ పార్టీ గెలుస్తుందో, ఎవరు అధికారంలోకి వస్తారో ఎవరు కక్ష్య సాధింపుగా ఉంటారో అని అధికారులు మిన్నకుండిపోయారు. ఈ తంతు అన్ని గ్రామాలలో అన్ని మండలాలలో జరుగుతున్నది.ఇతర రాష్ట్రములో, ఇతర జిల్లాలలో, ఇతర రాష్ట్రములో ఉన్న ఓటర్లు శనివారం నుండి వారి సొంత గ్రామాలకు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి భారీ స్థాయిలో ఓటర్లు తమసొంత గ్రామాలకు చేరుకుంటున్నారు వీరు తమ ఓటుహక్కు వినియోగించుకునే వరకు వారివి కావాల్సిన రాచ మర్యాదలు ఆయాగ్రామాల నాయకులు చూసుకోవాల్సి ఉంది.పోస్టల్ బ్యాలెట్ లు ఉద్యోగులకు కూడా మూడు వేల నుండి ఐదు వేల రూపాయలు పంపిణీ చేసినట్లు నాయకులు చెప్పుకుంటున్నారు.పోలింగ్ లో పాల్గొనే ఉద్యోగులు కూడా తమ యొక్క ఓటింగ్ విధానము పై ఎక్కడ చర్చించకుండా ఏ పార్టీ గెలిచిన మనఉద్యోగం మనకుతప్పదు అనిమాట దాటవేసే ధోరణిలో మాట్లాడుతున్నారు. ప్రభుత్వం పథకాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయా శుక్రవారం ఎన్నికలు సంఘం ప్రభుత్వం పథకాలు ఎన్నికలు అయ్యేవరకు నిలుపుదల చేయాలి అని స్పష్టం చేయడం, ఓటర్ల ను ఏ మాత్రం ప్రభావితం చేస్తుంది. ప్రతిపక్షం మేనిఫెస్టోను ఓటర్లను ఆకర్షణ చేస్తాయా. ఓటర్ల కు ఇచ్చే స్వల్పకాలిక తాయిలాలు ఏ మాత్రం పనిచేస్తాయో అని సర్వే సంస్థలు మేధావులు కూడా అంచనా వేయలేక పోతున్నారు. మే 13 వ తేది ఓటర్ నాడీ ఏవిధంగా ఉంటుందో అందరు జూన్ నాల్గవ తేది వరకు ఎదురు చూడవలసిందే.

## అంతర్జాతీయ ఎన్నికల అనుభవాలు పై ముఖాముఖి

**గుంటూరు,మే 11( ఆంధ్రపత్రిక):**జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు గుంటూరులోని జనచైతన్య వేదిక హాలు ఒకటో లైన్ లో గల రామన్నపేటలో భారతదేశం మరియు అంతర్జాతీయ ఎన్నికల అనుభవాలు పై గుంటూరు పుర ప్రముఖులతో ముఖాముఖి కార్యక్రమం జరుగును. **వక్తలుగా :**1. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రాజనీతి శాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ కొండవీటి చిన్నయ సూరి 2. డాక్టర్ విఘ్నేష్ కార్తీక్, రాజనీతి శాస్త్ర పరిశోధకులు, రాయల్ నెదర్లాండ్స్ ఇన్టిట్యూట్ 3. డాక్టర్ వార్డ్ బేరెన్ స్కాట్, రాజనీతి శాస్త్ర ఆచార్యులు, ఇండోనేషియ లు ప్రసంగిస్తారు. ఎన్నికలకు సంబంధించి ప్రపంచ అనుభవాలు, భారతదేశ అనుభవాలను తెలుసుకోవడానికి మంచి అవకాశం. కావున తప్పక హాజరు కాగలరు.

## బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల కంట్రోల్ రూం ఏర్పాటు

**బాపట్ల,మే 11( ఆంధ్రపత్రిక):** జిల్లా కలె క్టర్ కార్యాలయం బాపట్ల నందు ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కంట్రోల్ రూమ్ లో 08643-297802 టోల్ ఫ్రీ నెంబర్ ను, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రజలకు అందుబాటు లోకి తెచ్చామన్నారు. ఎన్నికలకు సంబంధిం చిన ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే తక్షణ మే టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయవచ్చున్నారు. సదరు సమస్యను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణలో పౌరులంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు.




# 100 శాతం ఓటింగ్ ద్వారానే ప్రజాస్వామ్యం పరిపుష్టం

### 'లెట్స్ ఓట్' ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కే మాల కొండయ్య

**గుంటూరు : మే 11( ఆంధ్రపత్రిక ) :** ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో ఓటింగ్ 100 శాతం పెరిగేందుకు యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని "లెట్స్ ఓట్" ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ పేర్కొన్నారు. గత 40 రోజులుగా గుంటూరు నగరంలో ఓటర్లలో ప్రజాస్వామ్య విలువల పట్ల, ఓటు యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ వేలాది మందిని ప్రభావితం చేసిన లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో చివరి కార్యక్రమం గా శనివారం ఉదయం స్థానిక బ్రాడీపేట అంబేద్కర్ కూడలి వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ఫస్ట్ ఓటర్స్ విద్యార్థులు, యువతీ యువకులతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



ఓటు ప్రాధాన్యత తెలియజేసే టి షర్ట్స్ క్యాప్స్ జాతీయ, లెట్స్ ఓట్ పతాకాలు చేపట్టి పాద చార్లకు అవగాహన కల్పించారు. లెట్స్ ఓట్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ టి బాలాజీ శ్రీనివాస్ ప్రతిజ్ఞ గావించి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలోనే గత నెల రోజులుగా నగరంలోని ప్రధాన స్టేడియం లు, వివిధ పార్కులు, వాకింగ్ ట్రాక్స్, అపార్ట్మెంట్స్, రైతు బజార్లలో ప్రజలను జాగ్రూతం చేయడంతో పాటు, రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్, జిల్లాఎస్పీ, నగర కమిషనర్ ల సహకారంతో వేలాదిమంది ఫస్ట్ ఓటర్స్ తో త్రీ కే వాక్ నిర్వహించి వారిలో ఓటు ప్రాధాన్యత పట్ల చైతన్యం కలగజేసినట్లు తెలిపారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జాతీయస్థాయి గుర్తింపు పొందిన లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ బలోపేతానికి విద్యార్థులు యువకులు ముందుండి నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు కె.వి భాస్కర్, సీతా రమేష్, వల్లూరి సదాశివరావు, పలువురు రొటీరియన్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### రాజనాల బండపై శనివారం పూజలు అందుకున్న

## ప్రసన్న ఆంజనేయ స్వామి



**చౌడేపల్లి, మే11 (ఆంధ్రపత్రిక):** మండలంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ ప్రసన్న ఆంజనేయస్వామి, లక్ష్మీ నరసింహ స్వామి శనివారం పూజలు అందుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో రాజనాల పండక్కిరిసిపోయింది. పలువురు ప్రమాణాలు చేయగా మరి కొందరు వాయి దాలు వేసుకుని వెళ్లారు, ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివార్లకు విశేష అభిషేకము, అలంకరణ గావించారు. రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

### 12న శ్రీవారి ఆలయంలో

## భాష్యకారుల సాత్తుమొర

**తిరుమల, ఆంధ్రపత్రిక :** తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 12వ తేదీన ఆదివారం భాష్యకార్ల సాత్తుమొర జరుగనుంది. ఈ ఉత్సవం సందర్భంగా మే 3 నుండి 21వ తేదీ వరకు 19 రోజులపాటు ఉభయం సమర్పణ జరుగుతోంది. శ్రీరామానుజులవారు జన్మించిన వైశాఖ మాస అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. శ్రీ భాష్యకార్ల సాత్తుమొర సందర్భంగా సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని ఒక తిరుచ్చిపై, శ్రీభాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. ఆ తరువాత ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు భాష్యకార్లవారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో సల్లింపు చేపడతారు. జీయర్‌స్వాములు, ఏకాంగులు తదితరులు పాల్గొంటారు.

### 14న శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో..

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, ఆంధ్రపత్రిక :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. వసంతోత్సవాల సందర్భంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 9.30 గంటల నుండి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ కారణంగా 14న కల్యాణోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టీటీడీ రద్దు చేసింది.

### వైకాపాను గెలిపించి

## జగనన్న రుణం తీర్చుకుందాం

**- చౌడేపల్లిలో వైసీపీ నాయకుల విస్తృత ప్రచారం**



**చౌడేపల్లి,మే11(ఆంధ్రపత్రిక):** జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రుణం తీర్చుకుందామని ప్రజలకు వైసీపీ నాయకులు పిలుపునిచ్చారు.ప్రచారంలో చివరి రోజు అయిన శనివారం పుంగనూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి,రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గెలుపు కోసం చౌడేపల్లె బజారు వీధిలో విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వైకాపా నాయకులు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో రాష్ట్ర ప్రజలందరికీ సీఎం జగన్మోహన్ రెడ్డి అండగా నిలబడ్డారని గుర్తు చేశారు.అదే సమయంలో ప్రతిపక్ష నాయకులు హైదరాబాదులో విలాసవంతమైన జీవితం గడిపి,ఇప్పుడు మళ్లీ వచ్చి ఓట్లు అడుగుతున్నారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.అధికారం కోసం చంద్రబాబు నాయుడు ఎన్ని అడ్డదారులైన తొక్కుతారని,జగన్మోహన్ రెడ్డి ప్రజలకు మంచి చేయడం కోసం ఎంతవరకైనా వెళ్తారని స్పష్టం చేశారు.తన మేనిఫెస్టోలో చేయగలిగే అంశాలని జగన్మోహన్ రెడ్డి పొందుపరిచారన్నారు.చంద్రబాబు నాయుడు అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు.దీనిని దృష్టిలో ఉంచుకొని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిలను గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో వైకాపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

**- తిరుపతి ఎంపి అభ్యర్థి చింతా మోహన్**



**గూడూరు, మే11,ఆంధ్ర పత్రిక:** కేంద్రంలో రాబోయే ఎన్నికల్లో సంకీర్ణ ప్రభుత్వం విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని వచ్చిన వెంటనే దుగారాజ పట్టణం పోర్టు నిర్మాణం పనులు ప్రారంభి స్తామని తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతామోహన్ వెల్లడించారు. శనివారం గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతామోహన్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో వైసిపి పార్టీలకు ప్రజాదరణ తగ్గిపోయిం దని ప్రజల మార్పు కోరుకుంటున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని గెలిచిన వెంటనే దుగరాజ పట్టణం పోర్ట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పోర్టు నిర్మాణం జరిగితే గూడూరు పట్టణం మహానగరంగా అభివృద్ధి చెందుతుందని లక్షలాది ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. ఈ ప్రచారంలో గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి రామకృష్ణారావు నాయకులు పాల్గొన్నారు.

### రామచంద్ర యాదవ్‌చే

## పుంగనూరు జయ కేతన యాత్ర ర్యాలీ



**చౌడేపల్లి,మే11(ఆంధ్రపత్రిక):** బీసీవై పార్టీ అధినేత పుంగనూరు ఆ పార్టీ అభ్యర్థి రామ చంద్ర యాదవ్, పుంగనూరు జై కేతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్‌లో ఆయన ప్రసంగిస్తూ, పుంగనూరు అభివృద్ధిలో పయనించాలంటే బీసీవై పార్టీని ఆదరించాలని ఆయన కోరారు. అరాచక శక్తుల నుంచి పుంగనూరును రక్షించి ప్రశాంత పుంగనూరుగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రతి ఇంటికి పాడి ఆవునిస్తూ ప్రతి మండలంలోనూ పాడి రైతుల కోసం పాల డిపోలను ఏర్పాటు చేస్తానన్నారు. తనను అసెంబ్లీకి ప్రజలు ఆదరించి పంపాలని అలా జరిగితే పుంగనూరును అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన తన మొదటి లక్ష్య మన్నారు. ఎవరు ఎన్ని బెదిరింపులు దాడులు చేసిన తాను భయపడేది లేదని ప్రజల పక్షాన నిలబడి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం పుంగనూరు విజయకేతన యాత్ర రొంపిచర్ల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీసీవై నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యాత్రతోపాటు స్కూటర్ ర్యాలీ కొనసాగింది.

### ఉపాధి హామీ కూలీలతో

# ముఖాముఖి



**నందవరం,మే11(ఆంధ్రపత్రిక):** పేదల సంక్షేమానికి సూపర్ సిక్స్ పథకాలు వరం అని మండల నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి అన్నారు.సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నందవరం మండలోని హాలహార్వి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చేసింది ఏమీ లేదని,ఉపాధి హామీ వేతనం గిట్టుబాటు కాక ప్రజలు వలసలకు వెళ్లడం జరిగిందన్నారు .ఉపాధి హామీ పథకం నిర్వహించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ కూలీలు వేతనం పెంచుతుందన్నారు.టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు.రాబోవు ఎన్నికల్లో టిడిపి కూటమి బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ జయనాగేశ్వర రెడ్డి,పార్లమెంట్ అభ్యర్థి కురువ నాగరాజులకు సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీ గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు దావీదు,టిడిపి గ్రామ అధ్యక్షులు బోయ నాగరాజు,రాగప్ప,గోవిందు,గొల్ల రవి,మణికుమార్,జి దుబ్బన్న,సురేష్ ,ఏసేపు, కార్పెంటర్ కాజా, సల్మోన్ ,కార్యకర్తలు, తదితరులుపాల్గొన్నారు.

### ప్రశాంతత ,అభివృద్ధి కావాలంటే

## వైసీపీని గెలిపించండి



**చెన్నేకొత్తపల్లి, మే 11 (ఆంధ్రపత్రిక):** రాప్తాడు నియోజకవర్గములోని ప్రజలకు ప్రశాంతత ,అభివృద్ధి ఈ రెండు కావాలంటే వైసీపీ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మేడాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆఖరి రోజు అయిన శనివారంనాడు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మేడాపురం గ్రామంలోకి అడుగు పెట్టగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు మంగళ హారతితో స్వాగతించారు. బాణసంచులు, కాలుస్తూ, పూల వర్షం కురిపించారు.ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మేడాపురం గ్రామంలో సి సి రోడ్లు వేశామని, రెండు సచివాలయాలు, హెల్త్ క్లినిక్,ఆర్ బి కె లను నిర్మించామని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారందరికీ నేరుగా బ్యాంక్ ఖాతాలలో నిధులను జమచేశారు అన్నారు.రాప్తాడు మరింతగా అభివృద్ధి చెందాలంటే మళ్ళీ నాకు ఓటు వేసి మీ యొక్క సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని అన్నారు. అలాగే హిందూపురం పార్లమెంటు అభ్యర్థి శాంతమ్మకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, వైసీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ మజ్జిగ అంజలి, జడ్పీటీసీ మైలారపు గోవిందరెడ్డి, కన్వీనర్ నరసిరెడ్డి, మన్నేరు నరసింహాలు, మందల నరసింహాలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

### పెద్ద కొత్తిలిలో విస్తృత ప్రచారన్ని

## నిర్వహించిన టిడిపి నాయకులు



**నందవరం, మే 11(ఆంధ్రపత్రిక):** పెద్ద కొత్తలి గ్రామంలో టిడిపి నాయకులు విస్తృత ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఏవీఎం మిషన్లో ఉమ్మడి పార్టీ సైకిల్ గుర్తును ప్రజలకు చూపిస్తూ అవగాహన కల్పించారు. మీ అమూల్యమైన ఓటుతో బీవీ జయనాగేశ్వరరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని టిడిపి నాయకులు గ్రామ ఓటర్లను అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో అదిశేషు,సోమన్న రంగన్న, భ్రమయ్య, వీరేష్, హనుమప్ప, సిరి, బసవరాజు, భాస్కర్, నరసింహులు, రామకృష్ణ, మహానంది తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ హామీలను నమ్మవద్దు

**- టీడీపి రాష్ట్ర కార్యదర్శి, కనుమూరు హరిచంద్ర రెడ్డి**



**గూడూరు,మే11 (ఆంధ్రపత్రిక):** ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇస్తున్న వైసిపి నాయకులను నమ్మవద్దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్ర రెడ్డి పట్టణ ప్రజలకు పిలుపు నిచ్చారు గూడూరు పట్టణంలోని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్ర రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో సుమారు 15 వేల కోట్ల రూపాయల రేషన్ బియ్యం స్కాం జరిగిందని ఆరోపించారు. రాబోయే ఎన్.డి.ఏ ప్రభుత్వం ఆ స్కాంకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గూడూరు పట్టణ అభివృద్ధి పై వైసీపీ నాయకులకు చిత్తశుద్ధి లేదని వైసీపీ పాలనలో చేసిన పనులలో జరిగిన అవినీతి రాబోయే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ద్వారా వెలుగులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. వైసీపీ నాయకులు ఓట్లు కొను గోలు చేసేందుకు అవినీతి సొమ్ము పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఆ డబ్బులను తీసుకొని అభి వృద్ధికి పాటుపడే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పాటుకు అండగా నిలవాలని పట్టణ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## తెలుగుదేశం పార్టీతోనే మా ప్రయాణం



**నందవరం, మే 11(ఆంధ్రపత్రిక):** నిన్నటి రోజున మర్యాదపూర్వకంగా కలిసి కలిసినందుకు వైసిపి వాళు టిడిపి వాళ్ళని వైసీపీలోకి ఆహ్వానించారని తప్పుడు ప్రసారం చేశారు మా ప్రయాణం ముమ్మాటికి తెలుగుదేశం పార్టీతోనే అని వారన్నారు.తెలుగుదేశం పార్టీని వీడే ప్రసక్తే లేదు అని వారు తెలియజేశరు .ఈరోజు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావు దేశాయ్ ని మర్యాదపూర్వకంగా కలిసి వాళ్లు తిరిగి పార్టీ కండువా కప్పుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పరశురాముడు.అంజి.నూర్ బాషా. దస్తగిరి. బోయ రవి, పింజరి ఖాజా,నరసింహ,తెలుగు భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కోసం రెండు బటన్లు నొక్కుదాం..

**-19వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ**



**హిందూపురం, మే 11 (ఆంధ్ర పత్రిక) :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే ధ్యేయంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ ఆధ్వర్యంలో పట్టణంలో విస్తృతంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం 19వ వార్డులోని చాకలి కుంట, విద్యానగర్, పైప్లైన్ రోడ్డులో మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక, ఎంపీ అభ్యర్థి శాంత విజయమే లక్ష్యంగా ఓటర్లను అభ్యర్థించారు. వైయస్సార్సిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోని రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలపడతారని చైర్ పర్సన్ అన్నారు.

## సిలిండర్ గుర్తుకే మన ఓటు



**నందవరం,మే 11 (ఆంధ్రపత్రిక):** నియోజకవర్గ స్వాతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణ గవ్వల నందవరం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ సిలిండర్ గుర్తుపై ఓటు వేసి నన్ను గెలిపించాలని ప్రజలను వారు అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తా గ్రామంలో ఉన్న సమస్యలను తీర్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు.13 న జరిగే ఎన్నికలలో భారీ మెజార్టీతో నన్ను ఆచరించాలని గ్రామ ప్రజలను కోరారు.

### వైస్సార్సీపీలోకి

## కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళాధ్యక్షురాలు చేరిక



**హిందూపురం, మే 11 (ఆంధ్రపత్రిక):** స్థానిక వైస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక సమక్షంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళాధ్యక్షురాలు రేష్మ బాలాజీ మనోహర్ ఆధ్వర్యంలో వైస్సార్సీపి పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా రేష్మ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని పార్టీలో రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం జరుగుతుందని నమ్మి పార్టీలోకి చేరడం జరిగిదన్నారు. ఈ కార్త్ర్యమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు ఆదిమూర్తి, అమానుల్లా, రామాంజినేయులు, గంగాదరప్ప, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం,అభివృద్ధి టిడిపి వల్లే సాధ్యం



**నందవరం, మే 11 (ఆంధ్రపత్రిక):** మండల మైనార్టీ బీసీసెల్ అధ్యక్షులు,నాగలదిన్నె టీడీపీ సీనియర్ నాయకులు యన్ ఎ. జబ్బార్ నాగలదిన్నె గ్రామంలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో ఇంటింటికి తిరుగుతూ ఆయన ఉమ్మడి ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే సంక్షేమ పథకాలను తెలియజేశారు. సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. చంద్రబాబు నాయుడు పరిపాలన వలన రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చి, ప్రాజెక్టుల నిర్మాణం... ద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని ఆయన ప్రజలకు తెలియజేశారు. ప్రజా సంక్షేమము, రాష్ట్ర అభివృద్ధి టిడిపి వల్ల సాధ్యం అన్నారు.13న జరిగే ఎన్నికలలో నియోజకవర్గ ఉమ్మడి పార్టీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి,ఎంపీ అభ్యర్థి కురవ నాగరాజ్ ను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న, తిమ్మప్ప, మన్ననసాబ్, యూవనాయకుడు ఎన్.ఏ. మునాఫ్, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 10వేల మెజారిటీతో గెలవబోతున్నా..

**-స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామి**




**హిందూపురం, మే 11 (ఆంధ్రపత్రిక) :** ప్రస్తుతం జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం శాసనసభ నియోజకవర్గంలో సంచలనమైన తీర్పుని ఇవ్వనున్నారని అదే అగ్గిపెట్టె గుర్తు గెలవబోతుందని స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామి సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో సమాప్తం ఆయన సందర్భంగా హిందూపురం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పరిపూర్ణానంద స్వామి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన గెలుపు ఖాయమని సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూపురం ప్రాంతం అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ఇక్కడ నుండే రాజకీయ రంగ ప్రవేశం చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశానని తెలిపారు. తనకున్న తక్కువ సమయంలో అతి తక్కువ వనరులతో నియోజకవర్గ వ్యాప్తంగా తనతో పాటు అభిమానులు, మద్దతుదారులు మేధావులు విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. అగ్గిపెట్టె గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే హిందూపురం ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తాను వాగ్దానం చేయడంతో నియోజకవర్గ ప్రజలందరూ ఎంతగానో స్పందించి అగ్గిపెట్టె గుర్తుకు ఓటు వేస్తామని చెప్పడం జరిగింద న్నారు. ప్రజల్లో వస్తున్న స్పందన బట్టితనకున్న జ్ఞానంతో తెలుసుకున్న సమాచారం మేరకు తాను కాదు తనకు కేటాయించిన అగ్గిపెట్టె గుర్తు 6వేల నుండి 8000 వరకు మెజార్టీ రాబోతుందని ఇది రాష్ట్రంలో అన్ని పార్టీలు కన్నెత్తి చూసే విధంగా తీర్పు ఇవ్వను న్నారని ఆయన పేర్కొన్నారు. బలమైన రెండు పార్టీల మధ్య తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రధాన పార్టీలకు నిద్ర పట్టని విధంగా అన్ని వర్గాల వారు కష్టపడ్డారన్నారు. కుల, మత వర్గాలకు అతీతంగా ధర్మాన్ని రక్షిస్తాం, కాషాయాన్ని గెలిపిద్దాం అనే నినాదంతో ప్రజలందరూ ముక్తకంఠంతో ముందుకొచ్చి అగ్గిపెట్టె గుర్తును గెలిపించబోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా పూర్తి మెజార్టీ రాదని తద్వారా హిందూపురం వైపు అందరూ ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తుందని తద్వారా ప్రజల సూచన మేరకు ఆ పార్టీకి మద్దతు పలికి అభి వృద్ధికి సహకరిస్తానన్నారు. తాను గెలుపొందితే పర్యాటక కేంద్రమైన లేపాక్షిలో నివాసముంటు అక్కడ ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ దుర్గా దేవి అమ్మవారిని దర్శించుకొని అభివృద్ధికి శ్రీకారం చుడతానన్నారు.

# హిందూపురం వాసికి అరుదైన గౌరవం

**-రాష్ట్రపతి చేతుల మీదుగా మాకం శ్రీధర్ కు పద్మశ్రీ అవార్డు పురస్కారం**

**-హర్షం వ్యక్తం చేస్తున్న పుర ప్రజలు**



**హిందూపురం, మే 11 (ఆంధ్రపత్రిక) :** ఎంతో మంది మహానుభావులు సమాజ సేవకు అంకితమై వారు ఎంచుకున్న రంగాలలో రాణిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి భారతదేశ ప్రభుత్వం ప్రతి ఏడాది వివిధ అవార్డులు, పురస్కారాలు అందిస్తుంటారు. ఇందులో భాగంగానే శనివారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా మాకం శ్రీధర్ కు పద్మశ్రీ అవార్డు పురస్కార పత్రం అందుకున్నారు. హిందూపురం పట్టణానికి చెందిన ఆర్య వైశ్య వర్గానికి చెందిన మాకం శ్రీధర్1973–1976 మధ్యకాలంలో స్థానిక ఎస్. డి.జి. ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యాభ్యాసం గావించారు. తిరిగి అక్కడ నుండి ఉన్నతమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగి ప్రస్తుతం కర్ణాటక పరిధిలోని బెంగళూరు నగరంలో ఉన్న చాణిక్య యూనివర్సిటీ వైస్ ఛాన్స లర్ గా విధులు నిర్వహిస్తున్నారు. నాడు అఖిలభారత విధాన్ పరిషత్ లో( ఏబీవీపీ) చురుకైన పాత్ర పోషిస్తుండేవాడు. కస్తూరి రంగన్ నేతృత్వంలో ఏర్పడ్డ జాతీయ విద్యా మండలిలో కమిటీ సభ్యుడిగా ఉంటూ ఎన్ ఈ పి రూపొందించడంలో కీలక పాత్ర వహించారు. విద్యార్థి దశ నుండే మంచి సేవ గుణగణాలు అలవర్చుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తద్వారా అదేబాటలో నడుస్తూ సమాజానికి ఎంతగానో చేయూత నిచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న హిందూపురం పట్టణవాసులు ప్రధానంగా ఆర్యవైశ్యుల్లో హర్షం వెలువెత్తుతుంది.అదేవిదంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ విద్యాసాగర్, బైసాని రాంప్రసాద్, జెపికె రాముతో పాటు 1973–1976 బ్యాచ్ ఈ బ్యాచ్ తో పాటు హిందూపురం ప్రజలు ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలో అత్యున్నతమైన పద్మశ్రీ అవార్డు హిందూపురం వాసికి రావడం గర్వించదగ్గ విషయమన్నారు.

# మంచి మనసుతో ఆశీర్వదించండి

**-టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ..**




**హిందూపురం, మే 11(ఆంధ్రపత్రిక):** టిడిపి, బిజెపి, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పరచుకోవచ్చని గ్రామ వికాసం మహిళా సాధికారత అందరి కళ్లలో ఆనందం చూడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అందుకు ప్రతి ఒక్కరు ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు సహకారం అందించాలని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా చివరి రోజు శనివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ చైతన్య రథంపై రోడ్ షో నిర్వహించారు. ప్రచార రథంపై బాలయ్య ప్రజలందరినీ అభివాదం చేస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో అద్భుతమైన పథకాలను తీసుకురావడం జరిగిందన్నారు. అధికారం లోకి రాగానే ఆ పథకాల ద్వారా ప్రజల జీవితంలో వెలుగులు నింపగలమని పేర్కొన్నారు. చదువుకునే ప్రతి బిడ్డకు రూ. 15వేలు, ప్రతి ఇంటి ఆడపడచుకు నెలకు రూ. 1500 చొప్పున వారి ఖాతాల్లో జమ చేయడం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించిన వంటి అద్భుతమైన పథకాలను రూపొందించడం జరిగిందని ప్రజలు మంచి మనసుతో దీవించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హిందూపురంలో పసుపు జెండా అత్యధిక మెజార్టీతో ఎగరవేస్తుందని ఇందుకు ఉదాహరణ మీరు చూపిస్తున్న అభిమానమే అని అయన పేర్కొన్నారు. నాటి స్వర్గీయ రామారావు స్వర్గీయ హరికృష్ణ నుండి తన వరకు హిందూపురం ప్రాంత ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని మీ రుణం ఏమిచ్చిన తీర్చుకోలేని తెలిపారు. నాటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నేటి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనతో విసిగి వేశారని ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయి ఎప్పుడు టిడిపి అధికారంలోకి వస్తుందని ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు. జనసేన,బిజెపితో కలిసి టిడిపి ఎన్నికల్లో ముందుకు పోవడం ఎంతో సంతోషమన్నారు. తాను మూడోసారి మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అవుతానని తద్వారా ఓ ప్రక్క ప్రజా సంక్షేమం మరో ప్రక్క ప్రజాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డాక్టర్ సురేంద్ర బాబు, డిఈ రమేష్, ప్రసాద్,గ్రీన్ పార్క్ నాగరాజు, భారీ ఎత్తున తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మహిళలు, టీడీపీ కార్యకర్తలతో భారీ ర్యాలీగా ప్రచారాన్ని నిర్వహించిన రఘుమూర్తి స్వామి



**నందవరం, మే 11 (ఆంధ్రపత్రిక):** నందవరం మండలం మాజీ వైస్ ఎంపీపీ ,టిడిపి సీనియర్ నాయకులు రఘుమూర్తిస్వామి, ఆయన సతీమణి గీతాబాయ్ కనకవీడు గ్రామంలో మహిళలు,టిడిపి కార్యకర్తలు, గ్రామ ప్రజలతో కలిసి ర్యాలీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. నియోజకవర్గం ఉమ్మడి పార్టీ అభ్యర్థి బీవిజయనాగేశ్వరరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో టిడిపి హాయంలో రోడ్డు మార్గాలను వేయించడం జరిగింది అన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యల తీర్చడానికి కృషి చేస్తామన్నారు.

## ఆత్మీయ పలుకరింపులతో చివరి రోజు పరిటాల కోడళ్ల ప్రచారం



**ధర్మవరం, మే 11 (ఆంధ్రపత్రిక):** ఎన్నికల ప్రచారంలో చివరి రోజు పరిటాల.ఇరువురు కోడళ్లు చురుగ్గా ప్రచారం చేశారు. తమ స్వగ్రామం రామగిరి మండలం వెంకటాపురంలో పరిటాల సునీతమ్మ తోపాటు పెద్ద కోడలు పరిటాల జ్ఞాన, అలాగే కొండాపురం పంచాయతీలో చిన్న కోడలు పరిటాల తేజశ్విలు ప్రచారం చేశారు. ఏ ఇంట చూసినా. తోబుట్టువులా, సొంత మనిషిలా ఆదరించారు. దాదాపు గ్రామాల్లో ప్రజలంతా తమ ఇంటిలోపలికి వచ్చే వరకు వదిలేది లేదంటూ వారిపై ప్రేమ చూపించారు. మీరు ఓటు ఎందుకు అడుగుతారు. మాకు మీరు చెప్పే పని లేదని. సైకిల్ గుర్తు, పరిటాల కుటుంబం మా గుండెల్లో ఉందన్నారు. చివరి రోజు.ఎన్నికల ప్రచారంలా కాకుండా ఆత్మీయ పలుకరింపులా పర్యటన సాగింది. ఎక్కడ చూసినా ప్రజలంతా విక్టరీ సింబల్ చూపిస్తూ.. మనం గెలవబోతున్నామని సంకేతం ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి.. పరిటాల కోడళ్లు సంతోషం వ్యక్తం చేశారు. మాపై ప్రజలు చూపిస్తున్న ప్రేమను ఎప్పటికీ మరువలేమని వారు అన్నారు.

# ప్రచారాలకిక స్వస్తి

**144సెక్షన్ అమలుకు సహకరించండి: సీఐ లింగప్ప**



**వి.కోట, మే 11(ఆంధ్ర పత్రిక):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మే 13న జరుగబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శనివారం సాయంత్రం 6గంటల నుంచి మండలంలో 144 సెక్షన్ అమలయ్యిందని సీఐ లింగప్ప అందరికీ తెలియజేశారు. శనివారం సాయంత్రం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం పరిసమాప్తం కావడంతో, మండల ప్రజానీకానికి పలు సూచనలు జారీచేశారు.ఎక్కడా కూడా నలుగురికి మించి గుంపులుగా గుమికూడదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో స్వేచ్ఛగా పాల్గొని తమ ఓటుహక్కును ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవాలన్నారు. మండలంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు కేంద్ర సాయుధబలగాల సహకారంతో అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# చివరి రోజు కూడా ఆగని వలసలు



**చెన్నేకొత్తపల్లి మే 11 (ఆంధ్రపత్రిక):** రాప్తాడు నియోజకవర్గంలో చివరి రోజు కూడా వైసీపీ నుంచి టిడిపిలోకి వలసలు ఆగలేదు. ఆ పార్టీకి షాక్ ఇస్తూ చివరి రోజు కూడా చాలా మంది టీడీపీ కండువాలు కప్పుకున్నారు. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి, నామాల, రామగిరి మండలం ముత్యాలంపల్లి, కనగానపల్లి మండలం, నరసంపల్లి, ఆత్మకూరు మండలం, పాపంపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ వైసీపీ ఎంత పతనావస్థకు చేరుకుందని చెప్పడానికి ఈ వలసలే నిదర్శనమన్నారు. ఇప్పటికే వేల మంది ఆ పార్టీ నుంచి టీడీపీలోకి వచ్చారన్నారు. ఇంకా అక్కడ ఉన్న వారు కూడా అసంతృప్తితోనే ఉన్నారు. వారు మా పార్టీలోకి రాకపోయినా.. ఎన్నికల్లో ఓటు ద్వారా ఎమ్మెల్యే సోదరులకు బుద్ధి చెప్తారని సునీత అన్నారు.

# మండలంలో వైసీపీకి భారీ షాక్



**నందవరం, మే 11(ఆంధ్ర పత్రిక):** నియోజవర్ పరిధిలో తెదేపా బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్, గ్రామ అధ్యక్షులు భార్గవ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నందవరం మండలం ముగతి గ్రామంలో వైసిపి మైనార్టీ నాయకులు అక్బర్ బాషా, చాన్ పీరా, రుక్మాన్, బందే నవాజ్, పాపారాయుడు, గఫూర్, అల్లావుద్దీన్, బెడ్లు కాజా, వలి ఇబ్రహీం,బోయ హనుమప్ప, తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీ ప్రభుత్వం అరాచక పాలన నచ్చక తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు పార్టీలో చేరిన వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు భార్గవ్ యాదవ్, కొండారెడ్డి ,బోయ దస్తగిరి, తులసిరామ్ యాదవ్ పాల్గొన్నారు.

## అమ్మంటే తెలుసుకో..

# జన్మంతా కొలుచుకో..

**ఆర్.కె అబాకస్ సంస్థ డైరెక్టర్ ఆర్కే విమలారెడ్డి**



**తిరుపతి, ఆంధ్రపత్రిక :** అమ్మ...! ఆ పదంలో ఆప్యాయత, అనురాగం, ఆనందం, ఆత్మీయత, ఆదర్శం, కమ్మదనం, తీయదనం, ఇంకా ఎన్నోన్నో... ఎంత చెప్పినా తక్కువే... మాటలకు అందనిది అమ్మ ప్రేమ అని ఆర్.కేస్ వీక్ష ద స్కూల్ సంస్థ డైరెక్టర్ ఆర్కే విమలారెడ్డి తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడ ఆర్.కేస్ వీక్ష ద స్కూల్ నందు శనివారం ఉదయం మాతృ దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం తల్లికి వందనం కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కేస్ వీక్ష ద స్కూల్ అధినేత డాక్టర్ తాతిరెడ్డి రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ అమ్మే బ్రహ్మను సృష్టించింది, అమ్మ లేనిదే బ్రహ్మ ఎక్కడి నుంచి పుట్టాడు? మన భారతీయ సమాజం సైతం మాతృదేవోభవ, పితృదేవోభవ అంటూ అమ్మకే అగ్రతాంబూలం ఇచ్చింది. ఏ దేశంలోనైనా సంస్కృతాలు మారవచ్చు.

కానీ అమ్మ ప్రేమ మారదు అని తెలిపారు. అమ్మ లాలి పాటకు మించిన సంగీత విద్వాంసుడు, అమ్మలా పాడి నిద్ర పుచ్చగల సంగీత కళాకారుడు లేడు. అందుకే అమ్మ సంగీత కళానిధి. సంగీత, సాహిత్యపరంగా మాధుర్య పరంగా అమ్మ లాలిపాటకు మించిన పాట లేనే లేదు అని అన్నమయ్య నృత్య కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. తల్లికి వందనం కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వారి తల్లులకు పాద పూజలు చేసి, తల్లి ఆశీర్వచనం తీసుకున్నారు. భూమాత అంత సహనంతో తల్లులందరూ తమ బిడ్డల భవిష్యత్ బాగుండాలని ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పుష్ప, కల్పన, నదియ, ప్రేమావతి, అరుణ, అనూష, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

# మోసకారి నాయకుల మాటలు నమ్మకండి



**మంత్రాలయం, మే 11(ఆంధ్రపత్రిక):** ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అంటు మాయ మాటలు చెప్పే మోసకారి నాయకుల మాటలు నమ్మకండి అని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి అన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని చెట్నేహళ్లి మంత్రాలయంలో వైయస్ఆర్ సీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు ప్రియాంక రెడ్డి కుమారిరెడ్డి వైయస్ఆర్ సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి కృష్ణారెడ్డి లక్మికాంత్ రెడ్డి సయ్యద్ నేతృత్వంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.చెట్నేహళ్లి గ్రామానికి చేరుకున్న వై. బాలనాగిరెడ్డి అన్నకి పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. మెయిన్ రోడ్డు భీరప్ప గుడి కురువ గేరి మీదుగా రోడ్డు షో నిర్వహించారు. మంత్రాలయం చేరుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నకి రాఘవేంద్ర నగర్ లో వైయస్ఆర్ సీపీ మండల నాయకులు పెట్రోలు బంక్ శీనన్న సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య బొంబాయి శివ నేతృత్వంలో ఘన స్వాగతం పలికారు.అన్న పర్యటన జన జాతరగా సాగింది. రాఘవేంద్ర నగర్ రాఘవేంద్ర సర్కిల్ ప్రధాన రహదారి ఆర్చ్ మీదుగా రోడ్డు షో నిర్వహించారు.అనంతరం రాఘవేంద్ర సర్కిల్‌లో పెట్రోలు బంక్ శీనన్న బొంబాయి శివ ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రేన్ తో గజమాల వేసి సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్న మాట్లాడుతూ దేవుళ్ళ నా నియోజకవర్గంలోని ప్రజల ఆశీస్సులు ఉన్నంత సేపు భయపడే ప్రసక్తే లేదు.నాకు మూడు సార్లు ఎమ్మెల్యే పదవి వచ్చింది అంటే అది మీరు పెట్టిన బిక్ష అని గర్వంగా చెప్పారు.నాల్గవ సారీ కూడా మీ అందరి బిక్షతో ఎమ్మెల్యే కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.మంత్రాలయంలో అశోక్ రెడ్డి అంత మోసం చేసి ఇప్పుడు ఆ పార్టీ లోకి వెళ్లాడని అక్కడ కూడా మోసం చేయడం ఖాయమని హెచ్చరించారు. మంత్రాలయంలో చాలా మందికి ఇళ్ల స్థలాలు రాలేదని మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16.ఎకరాలు భూమి ని కొనుగోలు చేసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇవ్వడం జరుగుతుంది. అభివృద్ధి జరగలేదని మాట్లాడుతున్న టీడీపీ నాయకులకు ఒక్కటే చెబుతున్నా అవును 15.సంవత్సరాల ఎమ్మెల్యేగా ఉన్న మాట వాస్తవమే కానీ రెండు సార్లు ప్రతి పక్షంలో ఉన్నాం 2019.లో వైయస్ఆర్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కరోనా కారణంగా రెండు సంవత్సరాలు అభివృద్ధి కుంటు పడింది. మిగతా మూడేళ్ళలో చేయగ లిగిన వరకు అభివృద్ధి చేశాం మరలా అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. సూపర్ సిక్స్ కాదు బ్యాటింగ్ జగన్ బౌలింగ్ చంద్రబాబు జగన్ బ్యాటింగ్ దెబ్బకు కూటమి గల్లంతు కావడం ఖాయమన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి యంపీ గా బీవై రామయ్యను ఎమ్మెల్యేగా మీ అభిమాన నాయకుడు వై.బాలనాగిరెడ్డి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించా లని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున వైస్ యంపీపీ పులికుక్క రాఘవేంద్ర సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి సర్పంచ్ అంజిని ఉప సర్పంచ్ లు హొటల్ పరమేష్ వీరనాగప్ప యంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి రామాంజనేయులు అల్లింగప్ప ముఖ్య నాయకులు ఎస్సి ఎస్టీ బీసీ మ్యెనార్టీ ఓసీ అన్ని కులాల వారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సొంత గూటికి చేరిన టిడిపి కార్యకర్తలు



**నందవరం, మే 11 (ఆంధ్రపత్రిక):** మండల కేంద్రమైన నందవరం గ్రామంలో టిడిపి వార్డ్ మెంబర్ చిన్న భీమన్న, టిడిపి కార్యకర్తలు అంజి ,పరశురాముడు, గోపాల్ లు శుక్రవారం వైసీపీలో చేరారు. ఒక్క రోజులోనే మరలా మనసు మార్చుకుని శనివారం తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పిటిసి వైస్ చైర్మన్ పుష్పావతి సమక్షంలో తిరిగి సొంత గూటికి చేరారు. పార్టీలో చేరిన వారు మాజీ జెడ్పిటిసి వైస్ చైర్మన్ పుష్పావతికి శాలువా, పూలమాల వేసి సత్కరించారు. అనంతరం పార్టీలో చేరిన వారికి ఆమె కండువాలను కప్పి తన కార్యకర్తలను సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వైస్ చైర్మన్ పుష్పావతి, వార్డ్ మెంబర్ దేవల్ల చిన్న భీమన్న, అంజి, పరశురాముడు, గోపాల్, విజయ్, ఖాజా, మహేష్, అమరేష్ ప్రవీణ్, రెహమాన్ వీరేష్, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.



యర్రగొండపాలెం పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్డుషో మరియు బైక్ ర్యాలీలో పాల్గొన్న ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి, యర్రగొండపాలెం శాసనసభ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు మరియు పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





మార్కాపురం పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్డుషో మరియు బైక్ ర్యాలీలో పాల్గొన్న ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి మరియు మార్కాపురం శాసనసభ అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఒంగోలు పట్టణంలో 34వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మరదలు శశికళ,సురేఖ రెడ్డి, చెల్లెలు సంధ్య, హిత రెడ్డి, మేనకోడళ్ళు ప్రణతి, కీర్తి, మనవరాలు జాహ్నవి దామచర్ల జనార్దన్ అక్క మాధవి, కుమార్తె అనిషా లక్ష్మి, మరదలు డా.హిమ బిందు, కోడలు హారిక వారి కుటుంబ సభ్యులు, ఆత్మకూరి బ్రహ్మయ్య తదితర నాయకులు తెలుగుదేశం, జనసేన, బీజేపీ డివిజన్ నాయకులు, అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఒంగోలులో విజయవంతంగా ప్రజాగళం సభ ముగించుకొని వెళ్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన సీనియర్ నాయకులు అయినాబత్తిన ఘనశ్యామ్, ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ కార్యకర్తలు అందరు బాగా కష్టపడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఘనశ్యామ్‌కి తెలియజేసారు మాగుంటని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సూచించారు.



దర్శిలో దర్శి శాసనసభ అభ్యర్థి డా.గొట్టిపాటి లక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోడలు యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి సతీమణి చందన రెడ్డి..




ఒంగోలు పట్టణంలో గాంధీ రోడ్డులో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్డు షో లో పాల్గొన్న ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసనసభ అభ్యర్థి దామచర్ల జనార్దన్ రావు, ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్, ప్రకాశం జిల్లా బీజేపీ ఇంచార్జి యోగయ్య యాదవ్, మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయులు నిఖిల్ రెడ్డి ,అయినాబత్తిన ఘనశ్యామ్, తాతా ప్రసాద్, పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ డివిజన్ నాయకులు, అధ్యక్షులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటు వినియోగించుకునేందుకు వెళుతున్న ప్రయాణీకులతో రద్దీగా మారిన విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్..



సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారంతో(నిన్నటితో) ముగిసిన ప్రచార పర్వం..

ఆంధ్రపత్రిక ఫొటోలు: సిహెచ్.విజయభాస్కర్



## జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు

# సర్వం సిద్ధం

- హింసాత్మక సంఘటనలకు, రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా భద్రతా ఏర్పాట్లు
- 13న ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్, ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- అర్బన్‌లో 78-80 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 88-90 శాతం ఓటింగ్ శాతం లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు
- పోలింగ్ కేంద్రాలకు మొబైల్ ఫోన్లు తీసుకురావొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు

**విజయవాడ, మే 11 (ఆంధ్రపత్రిక):** ఈ నెల 13న జరిగే పోలింగ్‌ను ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి హింసాత్మక సంఘటనలను తావులేకుండా, రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీ రావు తెలిపారు. నగరంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ ఎన్నికల మీడి యా కేంద్ర ంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో కలెక్టర్ డిల్లీ రావు, పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ పోలింగ్‌కు చేసి న ఏర్పాట్లను వివరించారు. శనివారం నిర్వహించిన పోలింగ్ స్టేషన్లకు సిబ్బందిని అనుసంధా నించే ర్యాండమైజేషన్‌కు అనుగుణంగా ఆదివారం 1,792 పోలింగ్ స్టేషన్లకు సంబం ధించి పోలింగ్ పార్టీల ఏర్పాటుతో పాటు నియోజకవర్గాల వారీ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా ఈవీఎం, ఇతర పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ జరుగు తుందన్నారు. పోలింగ్ మెటీరియల్‌కు, సిబ్బందికి ఎలాంటి కొరత లేదని.. 13 వేల మందికి పైగా సిబ్బం దిని, మెటీరియ ల్‌ను తరలించేందుకు జీపీఎస్ అను సంధానం చేసిన 459 వాహ నాలను ఉపయోగించనున్నట్లు తెలిపారు. 176 సెక్టార్ల పరిధిలోని 186 రూట్లను ఏర్పాటు చేశామని.. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల కల్లా పోలింగ్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకునేలా ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించా రు. ప్రతి పోలింగ్ ప్రాంతంలో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, కుర్చీలు, చక్రాల కుర్చీలు, ప్రాథమిక చికిత్స తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 తర్వాత కూడా పోలింగ్ జరిగే అవకాశమున్నందున లైటింగ్ ఏర్పాట్లు చేసిన ట్లు వెల్లడించారు. ఓటర్లు ఎలాంటి గందరగోళానికి తావులే కుం డా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు సహాయ కేంద్రం సేవలందిస్తుందన్నారు.

## నాయకుడుగా కాకుండా

# సేవకుడిగా ఉంటా...

ఒక్క అవకాశం ఇవ్వండి... రాజానగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా ..
రాజానగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ..



**రాజానగరం,మే 11 (ఆంధ్రపత్రిక):** అవినీతి అక్రమాలు, గంజాయి బ్యాచ్ లతో కూరుకుపోయిన రాజానగరం నియోజకవర్గాన్ని గాడిలో పెట్టడానికి మరియు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పయనించడానికి తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని రాజానగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి భక్తుల బలరామకృష్ణ ఓటర్లను అభ్యర్థించారు. రాజానగరం నియోజకవర్గం పరిధి కోరుకొండలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కరోనా సమయంలో రాజకీయాలకు అతీతంగా ఎంతోమందికి తాను సహాయ సహకారాలు అందించామని, కరోనా సమయంలో ఆసుపత్రి వైద్యానికి ఇతరత్రా అవసరాలు కూడా తాము తోడుగా నిలిచామన్నారు. అలాగే నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతోనే తాను ఖర్చును వెనకాడకుండా ఆధ్యాత్మిక సేవలు అందించానని, దీనిలో భాగంగానే ఆలయాలను చర్చిలను కూడా నిర్మించామని పేర్కొన్నారు. అలాగే లోక కళ్యాణ అర్థం నిస్వార్థంగా ఎన్నో యజ్ఞయాగాదులు కూడా నిర్వహించామన్నారు. వాస్తవానికి నేను ఆధ్యాత్మిక సేవలు అందిస్తూనే సామాజిక సేవలు కూడా అందించాలనే సదుద్దేశంతో తాను రాజకీయాల్లోకి అడుగు పెట్టాను అన్నారు. అందుకే దయచేసి తనకు ఒక అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. తనకి ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గంలో ఎటువంటి గంజాయి బ్యాచిలు బ్లేడ్ బ్యాచ్లు లేకుండా పూర్తిగా నిర్మూలించే చర్యలు చేపడతానన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో జరుగుతున్న భూ కబ్జాలు స్థల కబ్జాలు, చెరువులు, మట్టి దోపిడీలు నివారిస్తామన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగత విపరీతంగా



పెరిగిపోతుందని తనకు అవకాశం ఇస్తే పరిశ్రమలు స్థాపించే దిశగా చర్యలు చేపట్టి తద్వారా నిరుద్యోగ నిర్మూలన చేస్తానన్నారు. రైతు బిడ్డనైన తనకు ఒక అవకాశం ఇస్తే రాజానగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని,0 అలాగే నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తయారు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని యువత భవిష్యత్తును అన్ని రకాలుగా ఉన్నత స్థితికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తానన్నారు. నియోజకవర్గంలో రోడ్లు డ్రైన్లు సదుపాయాలతో పాటు ఇంటర్, డిగ్రీ కళాశాల స్థాపన కూడా కృషి చేస్తానన్నారు. అలాగే అభద్రతాభావంగా ఉన్న నియోజకవర్గ ప్రజలకు తన రక్షణ కల్పించే అన్ని చర్యలు చేపడతామన్నారు. ఇప్పటివరకు అనేక మందికి ఎమ్మెల్యే అవకాశాన్ని కట్టబెట్టారని, అయితే ఈసారి తనకు ఒక అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఒక సామాన్య కుటుంబానికి వచ్చిన ఈ మంచి అవకాశాన్ని జనసేన తెలుగుదేశం బిజెపి మద్దతు ఇచ్చి ఉమ్మడి అభ్యర్థిగా తననాన్ని ఎన్నికల బరిలో నిలిపారని, ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తనకు గాజుగ్లాసుపై ఓటు వేసే తప్పనిసరిగా గెలిపిస్తారని అభ్యర్థించారు. నిస్వార్థంగా సేవ చేయడానికి వచ్చిన ఒక ఆధ్యాత్మిక సేవా గుణం ఉన్న తనకు ఒక్క అవకాశం ఇవ్వాలంటూ కోరారు. అయితే తనను ఎన్నికల బరిలో ఓటమి పాలు చేయడానికి ప్రత్యర్థులు నకిలీ బత్తుల బలరామకృష్ణ పేరుతో నామినేషన్ వేయించారని అయితే తనకు వరుస నెంబర్ 5 లో ఉన్న గాజు గ్లాస్ గుర్తుకు మాత్రమే ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే ఉమ్మడి అభ్యర్థిగా ఎంపీ బరిలో నిలిచిన దగ్గుబాటి పురందరేశ్వరికి కమలం గుర్తుపై ఓటు వేసి ఇద్దరినీ గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పురందరేశ్వరుని గెలిపిస్తే కేంద్రమంత్రి అయ్యే అవకాశం కూడా మెండుగా ఉన్నాయన్నారు. పురందరేశ్వరి ఎంపీ అయితే రాజానగరం నియోజకవర్గ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తమను గెలిపిస్తే రాష్ట్ర అభివృద్ధితో పాటు దేశ అభివృద్ధి కూడా చెందుతుందని, మోడీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా దేశంలో ఎన్ డి ఏ ప్రభుత్వానికి మనం అండగా నిలిచిన



వాళ్లము అవుతామని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే దేశంలో మళ్ళీ ప్రధానమంత్రి మోడీ అయితే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా భక్తుల బలరామకృష్ణ సతీమణి భక్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ తాము జనసేన కండువా కప్పుకున్న రోజు నుంచి ప్రతిరోజు ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నియోజవర్గం అంతా పర్యటించామన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉమ్మడి అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ పేరు ప్రకటించక ముందు నుండి తాము తమ కుటుంబ సభ్యులందరితో కలిసి రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ ,సీతానగరం ,రాజానగరం మండలాల్లో ఉన్న 83 గ్రామాలను ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటిని ప్రతి గడపను తాకి ప్రతి కుటుంబాన్ని యోగక్షేమాలు తెలుసుకొని స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. ద్వారా అందరికీ తమ కుటుంబం దగ్గర అయిందని , ఇంత ఆడపడుచుల తనను అందరూ ఆదరించారని, నా వెన్నంటే నడిచారని మీరు నన్ను ఎప్పటికీ తీర్చుకోలేనని ఎంతో భావోద్వేగంతో పలికారు. తన భర్తకు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చి తమ కుటుంబాన్ని ఆశీర్వదిస్తారని అభ్యర్థించారు. తన భర్త ఎమ్మెల్యే గాగెలిచిన అనంతరం నియోజకవర్గంలో ఏ అమ్మాయికి వివాహం జరిగిన తాము పసుపు కుంకుమతో పాటు చీర, బంగారు తాళిబొట్టు కూడా కానుకగా అందజేస్తామని తెలిపారు. తనకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని తన కుమార్తెలతో సమానంగానే ఇతర బిడ్డలను కూడా అదే ఆదరణతో చూస్తానని హామీ ఇచ్చారు. ఒక సామాన్య కుటుంబం నుంచి బయటకు వచ్చిన తమను ఎంతో ఆదరించారని ఇదే ఆదరణ ఓటు రూపంలో తమకు వేస్తారని కోరారు. నియోజకవర్గ ఏ కష్టం వచ్చినా ఒక్క ఫోన్ కాల్ చేస్తే తామిద్దరం కూడా అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com